Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ విదియ ఉ.9.30 వరకు అనంతరం తదియ; నక్షత్రం: శ్రవణం రా.9.47 వరకు అనంతర ధనిష్ఠ; అమృతకాలం: ఉ.10.25 నుండి 12.15 వరకు; వర్జ్యం: రా.2.13 నుండి 3.59 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, రా.10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

సంపుటి:57 • సంచిక:264 • మంగళవారం 8 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from:Hyderabad |Karimnagar| Nizamabad| Suryapet| Vijayawada| Guntur| Rajahmundry| Visakhapatnam|Tirupati |Kurnool |Anantapur|Nellore

మోడీ ఈబీసీ బాణం!



అగ్రవర్ణ పేదలకు

విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్లు

కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం

- నేడు పార్లమెంట్ ముందుకు బిల్లు
- రాజ్యాంగ సవరణకు సన్నాహాలు
- ఇది ఎన్నికల జిమ్మిక్కు: విపక్షాల ధ్వజం

అర్హతలివీ:

- వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు
- సొంత వ్యవసాయ భూమి 5 ఎకరాల్లోపు ఉండాలి
- 1000 చ. అడుగుల కంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉండాలి
- నోటిఫైడ్ మునిసిపాలిటీలో 100 గజాలలోపు ఇంటి స్థలం
- నాన్‌నోటిఫైడ్ మునిసిపాలిటీల్లో 200 గజాలలోపు ఇంటి స్థలం

వివరాలు 9లో

సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సోమవారం కేంద్ర కేబినెట్ కీలక ప్రకటన చేసింది. ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లును నేడు (మంగళవారం) పార్లమెంటు ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈబిల్లు చట్టరూపం దాల్చితే, అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, ఉదోగాల్లో 10% కోటా కల్పించనున్నారు. వార్షికాదాయం రూ. 8 లక్షల లోపు ఉన్నవారంతా ఈ రిజర్వేషన్ల పరిధిలోకి వస్తారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌పై మోడీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కీలక నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం చట్టబద్ధం కావాలంటే రాజ్యాంగం లోని ఆర్టికల్ 15, 16లకు సవరణలు చేయాల్సి ఉంది. వాస్తవానికి శీతాకాల పార్లమెంటు సమావేశాలు నేటితో ముగియనున్నాయి. ఈ బిల్లును ఉభయసభల్లో చర్చకు ప్రవేశపెట్టి, ఆమోదింపజేసేందుకు సమావేశాలను పొడిగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



సీఎం కేసీఆర్‌తో స్టీఫెన్‌సన్ భేటీ

నామినేటెడ్ ఎమ్మెల్యేగా స్టీఫెన్‌సన్

- తొలి కేబినెట్ భేటీలో నిర్ణయం
- గంగా జమునా తహజీబ్ సంప్రదాయం కొనసాగింపు
- 3 భాషల్లో రాజ్యాంగ ప్రతులు
- ఎన్నికల నిర్వహణపై ఈసీకి మంత్రివర్గం అభినందనలు

17న అసెంబ్లీ

- 19 నుంచి మండలి సమావేశాలు
- నోటిఫికేషన్ విడుదల

3లో

జూన్ నుంచి నిరుద్యోగ భృతి?

- నెలకు రూ.3016 చెల్లింపు
- అధికారుల కసరత్తు షురూ
- సీఎంకు ప్రాథమిక నివేదిక
- ఏడు రాష్ట్రాల్లో అమలుపై పరిశీలనకు అధికారుల టూర్
- నిరుద్యోగులు 9 లక్షలు
- ఎన్నికల హామీల అమలుపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ నిరుద్యోగ భృతి చెల్లింపు పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతి అమలు జరుగుతున్న తీరుతెన్నులను ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. నిరుద్యోగ భృతిని అమలు చేస్తున్న ఏడు రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ అమలవుతున్న తీరును పరిశీలించి విధి విధానాలను ఖరారు చేయాలని కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 9 లక్షలకు పైగా నిరుద్యోగులుండగా, అందులో 18 నుంచి 30 సంవత్సరాల వయస్సున్న వారు 5 లక్షల 30 వేలకు పైగా ఉన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి ⇨ 3వ పేజీలో...



సోమవారం నాడు ప్రగతిభవన్‌లో హరితహారంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

కేజీ బేసిన్ నీళ్ల వాటా వదలొద్దు

కేటాయించినదంతా వినియోగించుకుందాం

- కోటి ఎకరాలకు నీరందించడమే లక్ష్యం
- ప్రాజెక్టుల నుంచి చెరువులకు నీళ్లు
- పెండింగ్ ప్రాజెక్టులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు
- ప్రగతిభవన్‌లో సుదీర్ఘ సమీక్ష
- ప్రాజెక్టుల వారీగా స్థితిగతులు, లోపాలను ముఖ్యమంత్రికి నివేదించిన రిటైర్డు ఇంజనీర్ల బృందం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణాకు ఉన్న పూర్తిస్థాయి వాటాను ఏమాత్రం వదిలిపెట్టకుండా సద్వినియోగం చేసుకోవాలని సీఎం కె.చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. సాగునీటి రంగంలో లక్ష్యాలను చేరుకున్నపుడే వ్యవసాయమే ప్రధానమైన మన రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని అన్నారు. అందుకోసం ప్రత్యేక వ్యూహం, ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు, అందుబాటులోకి వచ్చిన నీటిని వినియోగించుకునేందుకు, ప్రణాళికాబద్ధంగా నిర్వహణకు సాధ్యమైనంత త్వరలో విధి విధానాలు రూపొందించాలని ఆదేశించారు. సోమవారం ప్రగతి భవన్‌లో సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల తన పర్యటనలో వెలుగుచూసిన అంశాలు, లోటుపాట్ల సవరణపై మార్గదర్శకాలు ఇచ్చారు. జాప్యం జరుగడానికి ఎక్కడ లోపం ఉందో ⇨ 3వ పేజీలో...

కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం

నిఘా పటిష్టం.. పీడీ యాక్టు ప్రయోగం

- కట్టె కోత మిల్లులపైనా నియంత్రణ
- అటవీ, పోలీసుల సంయుక్త ప్రణాళిక
- హరితహారం లక్ష్యానికి పకడ్బందీ వ్యూహం
- కంపా, నరేగా నిధులు వినియోగించాలి
- అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

3లో



భళా భారత్

- 71 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డమీద టీమిండియా టెస్ట్ సిరీస్ కైవసం

12లో



తెరాసలో చేరిన రామగుండం ఎమ్మెల్యే కోరుకుంట చందర్‌ను అభినందిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు వివేక్, కరీంనగర్ మేయర్ రవీందర్ సింగ్

2లో

ఎన్నిక ఏదైనా తెరాసదే గెలుపు

ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం: కేటీఆర్

- తెరాసలోకి రామగుండం ఎమ్మెల్యే చందర్, నల్లగొండ కాంగ్రెస్ నేతలు

ఔరా..!



కోటి ఉద్యోగాలు హుష్‌కాకి

- భారత్‌లో కోరలుచాస్తున్న నిరుద్యోగం..
- 2018లో ఊడిన ఉద్యోగాలు 1.09 కోట్లు
- 2017లో నిరుద్యోగం 4.78 శాతం
- 2018 డిసెంబర్ నాటికి 7.38 శాతం
- సీఎంఐఈ తాజా నివేదికలో వెల్లడి

10లో

ప్రధానితో టీఆర్ఎస్ ఎంపీల భేటీ

- పార్టీ కార్యాలయానికి ఢిల్లీలో స్థలం ఇవ్వాలంటూ విజ్ఞప్తి

2లో



ఆగమ ధర్మం రాజకీయ పర్వం

శబరిమల వివాదంలో తెరవెనుక వాస్తవాలు



- మహిళల ప్రవేశంపై ఎన్నో నివేదికలు
- బ్రిటీష్ హయాంలోనే సమగ్ర రికార్డులు
- ఆగమ విధానాలకే అగ్రతాంబూలం
- కాలానుగుణ మార్పులతో సుప్రీం కొత్త మార్గదర్శకం
- రాజకీయ జోక్యంతో కీకారణ్యంలో ఆరని చిచ్చు

4లో

ఎన్నిక ఏదైనా.. గెలుపు మనదే

• ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం • కేటీఆర్ సమక్షంలో రామగుండం ఎమ్మెల్యేకు గులాబీ తీర్థం



ఆంధ్రప్రభ, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 16ఎంపీసీట్లు కైవసం చేసుకుని ఢిల్లీని శాసిద్దామని, ఎన్నిక ఏదైనా గులాబీజెండా ఎగిరేలా అందరూ సమిష్టిగా పనిచేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తన అనుచరులతో కలిసి సోమవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీతీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేటీరామారావు మాట్లాడుతూ అందరూ కేసీఆర్ శిష్యులేనని, కొన్ని కారణాలతో పార్టీకి దూరంగా ఉండి తిరిగివచ్చారన్నారు. రామగుండంలో కాంగ్రెస్ గెలవకపోవడం అదృష్టమన్నారు. ఓవైపు సోమారపు మన పార్టీ లీడర్, సన్నిహితుడు చందర్ ఉన్నారని, చందర్ భార్య చనిపోయిన రోజు తాను రామగుండం ప్రచారానికి వచ్చి బాధపడ్డానన్నారు. అవసరం అయినపుడు సహకరిస్తా అని సోమారపు చెప్పారని, చందర్ సలహాలు తీసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్ళాలన్నారు. రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటుచేస్తామని కేసీఆర్ హామీనిచ్చారని, త్వరలో హామీని నిలబెట్టుకుంటామన్నారు.

చందర్, సోమారపు సత్యనారాయణకు కలిపి లక్ష ఓట్లకు పైగా వచ్చాయని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఓట్లు మనకు పడాలన్నారు. ఇద్దరూ కలిసిపనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నిలుపుకుంటామన్నారు. ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చందర్ చురుకుగా పాల్గొన్నారని, సింగరేణి ఎన్నికల్లోనూ చందర్ టిబిజికెఎస్‌ను గెలిపించారన్నారు. అందరం కలిసి పార్టీని బలోపేతం చేద్దామన్నారు. ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ ఏ ఎన్నిక వచ్చినా గెలిచేది టీఆర్ఎస్సేనని, టీఆర్ఎస్ తన మాతృసంస్థ అన్నారు. తనను టీఆర్ఎస్‌లో తిరిగి చేర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, పలువురునేతలు పాల్గొన్నారు.

ట్రక్కువల్లే నకిరేకల్‌లో ఓడిపోయాం

నల్లగొండ జిల్లాలో జానారెడ్డి సహా మహామహులు మట్టికరిచారని, ఇతరపార్టీలనేతలు కాలికిబలపం కట్టుకుని తిరిగినా టీఆర్ఎస్‌కు అపూర్వవిజయం కట్టబెట్టిన నల్లగొండ ప్రజల రుణం తీర్చుకుంటామని తెలంగాణరాష్ట్రసమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు, ఇతరపార్టీల కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో నైతికంగా టీఆర్ఎస్ అన్నిస్థానాలు గెలుచుకుందని, ట్రక్కుగుర్తు వల్లే నకిరేకల్‌లో టీఆర్ఎస్ ఓడిందన్నారు. మంత్రులుగా ఉన్నపుడు జానారెడ్డి, ఉత్తమ్‌లు నల్లగొండ ఫ్లోరోసిస్ సమస్యపై దృష్టిపెట్టలేదన్నారు. తండాలను గ్రామపంచాయతీలు చేస్తామని దశాబ్దాలుగా చెప్పారని, కానీ కేసీఆర్ సీఎం అయ్యాక 3400తండాలు గ్రామపంచాయతీలు అయ్యాయన్నారు.

12వేల పైచిలుకు గ్రామపంచాయతీలుంటే అందులో 25శాతం గిరిజనులే సర్పంచ్‌లుగా కాబోతున్నారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పరిపాలనాసౌలభ్యం కోసం కొత్తగా జిల్లాలు, మునిసిపాలిటీలు, మండలాలు గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేసుకున్నామన్నారు. నల్లగొండ ప్రజల రుణం తీర్చుకునేందుకు చేయాల్సిన కార్యక్రమాలన్నీ చేస్తామన్నారు. హాలియా, నందికొండ మునిసిపాలిటీలకు నిధులిచ్చి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. నెల్లికల్లు లిఫ్ట్ పథకం వస్తుందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి త్వరగా పనులు పూర్తయ్యేందుకు కృషిచేస్తామన్నారు. 16ఎంపీ స్థానాలు కేసీఆర్‌కు గెలిపించి ఇస్తే ఢిల్లీగద్దెపై ఎవరుండాలో తెలంగాణ ప్రజలు నిర్ణయిస్తారన్నారు. శాసనసభ ఎన్నికల్లో చూపిన స్ఫూర్తి పార్లమెంట్‌లోనూ ప్రదర్శించాలన్నారు.

జనవరి 25వరకు ఓటరుగా నమోదుచేసుకోవొచ్చని, ఓటరుజాబితాలో లేనివారిని చేర్పించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో వీలైనన్ని ఏకగ్రీవం అయ్యేందుకు నేతలు ప్రయత్నించాలని, తండాలపై మరింత దృష్టిపెట్టాలన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే రూ.10లక్షలు అభివృద్ధికి ఊతం ఇస్తుందన్నారు. ఏ ఎన్నిక జరిగినా గులాబీజెండా రెపరెపలాడించేందుకు కార్యకర్తలు శ్రమించాలన్నారు. ఈ సందర్భంగా ఇతరపార్టీల నుండి వచ్చిన నేతలకు గులాబీకండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో ఎంపీ గుత్తాసుఖేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్రప్రధానకార్యదర్శి సత్యవతి రాథోడ్, ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్, ఎమ్మెల్సీ కర్నెప్రభాకర్, నాయకులు ఎంసికోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



13 శాతం వృద్ధితో మనమే టాప్

హై దరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రం 13శాతం వృద్ధిరేటుతో దేశంలోనే ప్రధమ స్థానంలో ఉందని టీఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. సోమవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోషియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు విద్యుత్ కోసం జరిగే ధర్నాలు , రాస్తారోకోలు ఇప్పుడు లేవన్నారు.ఊర్లో ఎవరైనా చనిపోతే కరెంట్ ఇవ్వండని బ్రతిమాలే రోజులు పోయాయన్నారు. 24గంటల నిరంతర విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. సాధించిన విజయాలు గుర్తు చేసుకుంటూనే రాబోయే సవాళ్లను ఎదుర్కొని ముందుకు పోవాలన్నారు .తాను మంత్రిగా ఉన్నప్పుడు పరిశ్రమలు నెలకొల్పడంలో విద్యుత్ ప్రధాన సమస్యగా ఉండేదన్నారు. పరిశ్రమలు నెలకొల్పడంలో పోటీ దేశాలమధ్య సాగుతోందన్నారు. విద్యుత్ సంస్థలకు వినియోగదారులు ముఖ్యం అని , ప్రైవేటు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలతో పోటీపడుతూ ముందుకు పోవాలన్నారు. అప్పుడు అధ్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు.

వినియోగదారుల డిమాండ్ పెరిగేకొద్ది మనం ముందుకు పోవాలని అప్పుడు మాత్రమే విజయం సాధించగలమన్నారు. ఎలాంటి ప్రకృతి వైపరిత్యం సంభవించినా విద్యుత్ అందుతున్నప్పుడు చాలా సంతృప్తి వస్తుందన్నారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టినప్పుడు మాత్రమే నగరాల్లో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వప్నం ప్రాజెక్టులని , అవి త్వరగా పూర్తయి తెలంగాణ కోటి ఎకరాల మాగాణి కావాలన్నారు. రాష్ట్ర ప్రజలకోసం పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిని ఎలా ఆదుకోవాలో ప్రభుత్వ పెద్దలకు తెలుసన్నారు. ఈ రంగంలో సీఎండి ప్రభాకర్ రావుకు 50ఏళ్ల అనుభవం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలన్నీ సీఎంకు తెలుసన్నారు. అందుకే ప్రత్యేక శ్రద్ద చూపుతారన్నారు. సమస్యలన్నీ ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యుత్ రంగం సవాళ్లను ఎదుర్కోబోతోందన్నారు. ఎప్పటికప్పుడు కాలానుగుణంగా ముందుకు పోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా ఉద్యోగులకోసం అసోషియేషన్ అధ్యక్షుడు శివాజి పోరాడుతారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాక విద్యుత్ రంగంలోనే తొలివిజయం సాధించామన్నారు. ట్రాన్స్‌కో సీఎండి డి.ప్రభాకర్ రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ విద్యుత్ రంగంలో ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. సీఎంగా తొలిరోజే 24గంటల విద్యుత్ ఇవ్వాలని దిశానిర్దేశం చేశారన్నారు. ప్రభాకర్ రావు ఇంజనీర్ కాదని ,బ్యూరోక్రాట్ కూడా కాదని తనమీద ఉన్న నమ్మకంతోనే ఈ బాధ్యత అప్పగించారన్నారు. అయన ఇచ్చిన బాధ్యతను పూర్తిస్థాయిలో నెరవేర్చానన్నారు. 41నెలల్లో కొత్తగూడెం పవర్ ప్లాంట్ అందుబాటులోకి రానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ , ఎన్పీడీసీఎల్ సీఎండిలు రఘుమారెడ్డి, గోపాల్ రావుతోపాటు పలువురు డైరెక్టర్లు, అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ అసోషియేషన్ డైరి, క్యాలెండర్ , హ్యాండ్‌బుక్‌లను ఆవిష్కరణ చేశారు.

ప్రతిష్టాత్మకంగా స్వీట్,కైట్ ఫెస్టివల్స్

ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం

ఆంధ్రప్రభ, హైదరాబాద్: అంతర్జాతీయ స్వీట్, కైట్ ఫెస్టివల్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని, పర్యాటకులు లక్షలాదిగా హాజరై వీటిని జయప్రదం చేయాలని ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సోమవారం సెక్రటేరియట్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19దేశాల నుండి కైట్ ఫెస్టివల్‌కు హాజరవుతున్నారని, ఈనెల 13నుండి 15వ తేదీవరకు ఉత్సవాలు సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ టూరిజం ఎండి మనోహర్, దినకర్ బాబు, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మానవత్వం చాటుకున్న కేటీఆర్


బాలుడి వైద్యానికి భరోసా

ఆంధ్రప్రభ, హైదరాబాద్: పోలియోవ్యాధితో రెండుకాళ్ళు దెబ్బతిన్న రామగుండం నియోజకవర్గం బాలుడు శివసాయిని ఆదుకునేందుకు ముందుకు వచ్చి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు తన మానవతాహృదయాన్ని మరోసారి చాటుకున్నారు. తన సమస్యను రామగుండం ఎమ్మెల్యేతో పాటు వచ్చిన బాలుడు తెలంగాణభవన్‌లో వివరించగానే తక్షణ స్పందించిన కేటీఆర్ వెంటనే శివసాయిని ఆస్పత్రిలో చేర్చాలని గ్రేటర్ హైదరాబాద్ టీఆర్ఎస్ నేత కట్టెల శ్రీనివాసయాదవ్‌ను ఆదేశించారు. బాలుని వైద్యానికయ్యే ఖర్చును భరిస్తానంటూ అభయమిచ్చారు. కేటీఆర్ స్పందనకు బాలుని కుటుంబసభ్యులు, నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

నేతన్నలను కాపాడుకుందాం

ఆంధ్రప్రభ, హైదరాబాద్: రాష్ట్రంలో చేనేతల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకచర్యలు తీసుకుంటుండగా, వరంగల్ తూర్పునియోజకవర్గానికి చెందిన నాలుగువేలమంది సభ్యులు గల చేనేత సహకాససంఘాలు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావును కలిసి తమకు సిరిసిల్ల తరహాలో ఉపాధి కల్పించాలని కోరారు. వారు ఉత్పత్తి చేసిన వస్త్రాలను పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతోపాటు వారు ప్రత్యేకంగా బెడ్‌షీట్స్, కార్పెట్లతయారీలో ప్రావీణ్యం కలిగిన వారికి మార్కెట్ కల్పించాలని కోరారు. వినతులు పరిశీలిస్తానని, తూర్పుచేనేతలను కాపాడుకుంటానని కేటీఆర్ భరోసానిచ్చారు. సమస్య పరిష్కారానికి చొరవచూపిన తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌ను అభినందించారు.





ప్రధాని మోడీతో ఎంపీ సంతోష్ భేటీ

ప్రధానితో తెరాస ఎంపీల భేటీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ దేశ రాజకీయాలపై దృష్టి పెట్టింది. రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలే రాజ్యమేలుతాయని ధీమాగా చెబుతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు, ప్రాంతీయ పార్టీలతో ఒకకూటమి ఏర్పాటు ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే.

ఈ మేరకు ఢిల్లీలో పార్టీ కార్యకలాపాలు పెంచడం కోసం పార్టీ కార్యాలయం నిర్మించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇందులో భాగంగా ఆ పార్టీకి చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసి స్థలం గురించి విజ్ఞప్తి చేశారు. ప్రధానితో భేటీ అనంతరం టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత ఏపీ జితేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అర్బన్ డెవలప్‌మెంట్ మార్గదర్శకాల ప్రకారం తమకు కనీసం 1000 గజాల స్థలం కేటాయించవచ్చునని అన్నారు. ఉభయ సభల్లో కలిపి టీఆర్ఎస్‌కి 17 మంది ఎంపీలున్నారని, ఆ ప్రకారం పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకోవచ్చునని వెల్లడించారు. ఢిల్లీలోని రాజేంద్ర నగర్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని కేటాయించాల్సిందిగా తాము కోరుతున్నట్టు తెలిపారు. ఢిల్లీలో పార్టీ కార్యాలయం ఏర్పాటైతే దేశ రాజకీయాల్లో మరింత క్రియాశీల పాత్ర పోషించవచ్చని ఆ పార్టీ ఎంపీలు భావిస్తున్నారు.

నుమాయిష్‌లో తెలంగాణ అటవీశాఖ స్టాల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పిల్లలకు అటవీ జంతువులపై అవగాహన కల్పించే విధంగా హరితం, శివం సుందరం నినాదంతో తెలంగాణ అటవీశాఖ నాంపల్లి నుమాయిష్ (ఎగ్జిబిషన్)లో స్టాల్‌ను ఏర్పాటు చేసింది.

సోమ వారం అటవీశాఖ స్టాల్‌ను ప్రధాన అటవీ సంరక్షణ అధికారి పి. కె. ఝా ప్రారంభించారు. తెలంగాణ హరితహారం, ఎకో టూరిజం స్పాట్లు, అర్బన్ ఫారెస్టు పార్కులు, అడవులు జంతుజాలం రక్షణ, గడ్డి క్షేత్రాల పెంపకం తదితర అంశాలకు సంబంధించి స్టాల్‌లో ప్రదర్శించారు. పెద్దల కోసం ఔషధ మొక్కల స్టాల్, బాలల కోసం బర్డ్స్ కాల్, మినీ జూను ఏర్పాటు చేశారు.

5 ఏళ్ల పాటు కొత్త కాలేజీలకు నో చాన్స్

• ఇంజనీరింగ్‌తో పాటు.. డిగ్రీ కాలేజీలకు నో పర్మిషన్ • ఉన్న సీట్లే భర్తీ కావడం లేదు • నాణ్యత పాటించే కాలేజీలకే గుర్తింపు • 835 కాలేజీల మూసివేత... వాటిలో 149 ఇంజనీరింగ్ కాలేజీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే ఉన్న కాలేజీల్లో నాణ్యతను పెంచేలా చూస్తోంది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇంజనీరింగ్‌తోపాటు.. డిగ్రీ, పీజీ కాలేజీలకు కొత్తగా అనుమతులు ఇవ్వలేదు. రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు డిగ్రీ కాలేజీలు కూడా ఉండాల్సిన వాటి కంటే ఎక్కువగా ఉన్నాయని... వాటిలో ఉన్న సీట్లు పూర్తిగా భర్తీ కావడం లేదని గత 4 సంవత్సరాలుగా అడ్మిషన్లను బట్టి తెలుస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న అనుభవాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర సర్కార్ కొత్త వాటికి అనుమతులు ఇవ్వలేదు. ఉన్న కాలేజీల్లోనే సీట్లు భర్తీ కావడం లేదు కాబట్టి కొత్త కాలేజీలకు అనుమతులను గత 4 ఏళ్లుగా ఇవ్వలేదు. మరో ఐదేళ్ల పాటు కూడా కొత్త కాలేజీలు అవసరం లేదని సర్కార్ భావిస్తోంది. అందుకే రానున్న 5 సంవత్సరాలపాటు ఇంజనీరింగ్‌తోపాటు డిగ్రీ, పీజీ ఇతర ప్రొఫెషనల్ కోర్సులను ఆఫర్ చేసే కాలేజీలకు అనుమతులు ఇవ్వరాదని సూచన ప్రాయంగా నిర్ణయించింది.

835 కాలేజీల మూసివేత...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సమయంలో రాష్ట్రంలోని 10 జిల్లాల్లో కలిపి 354 ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వాటిలో 17 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు కాగా 337 ప్రైవేటు కాలేజీలున్నాయి. అలాగే డిగ్రీ కాలేజీలు మొత్తం 1329 ఉండగా వాటిలో 178 ప్రభుత్వ కాలేజీలు... 1151 ప్రైవేటు కాలేజీలున్నాయి. పీజీ కాలేజీలు 520 ఉండగా ప్రభుత్వ కాలేజీలు 76 ఉంటే ప్రైవేటు కాలేజీలు 444 ఉన్నాయి. ఇవి కాంకుడా ఎంబీఏ, ఎంసీఏ, బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బీఈడీ తదితర కాలేజీలు 3688 కాలేజీలు ఉండగా వాటిలో 337 ప్రభుత్వ కాలేజీలు... 3351 ప్రైవేటు కాలేజీలున్నాయి. ప్రస్తుత ఏడాది 2018-19 నాటికి రాష్ట్రంలో 923 డిగ్రీ కాలేజీలుండగా 188 ఇంజనీరింగ్ కాలేజీలకు పడిపోయాయి. డిగ్రీలో 228 కాలేజీలు మూతపడగా... ఇంజనీరింగ్‌లో 149 కాలేజీలు మూతపడ్డాయి. మొత్తంగా అన్ని కోర్సులకు సంబంధించిన ప్రైవేటు కాలేజీలు 2014-15లో 3351 కాలేజీలు ఉండగా అదికాస్త 2018-19 నాటికి 2516కు పడిపోయింది. అంటే 835 కాలేజీలు మూసివేసుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది.



భర్తీ కాని సీట్లు...

రాష్ట్రంలోని వివిధ కోర్సులు.. కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య రాను రాను తగ్గుతూ వస్తోంది. ప్రతి ఏడాది అన్ని కోర్సులు... కాలేజీల్లో కలిపి చేరుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. దీంతో కాలేజీల సంఖ్య కూడా తగ్గుతూ వస్తోంది. విద్యార్థులు చేరకపోవడంతో కొత్త కాలేజీలకు ... కొత్త కోర్సులకు కూడా గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అనుమతి ఇవ్వలేదు. రాష్ట్రంలో 2014-15లో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో కలిపి 5,23,291 సీట్లు ఉండగా వాటిలో 3,77,344 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం కాలేజీలు 2901 కాలేజీలు ఉండగా వాటిలో మొత్తం అందుబాటులో ఉన్న సీట్లు 6,52,178 ఉండగా కాలేజీల్లో చేరిన విద్యార్థులు 3,97,225 మంది మాత్రమే ఉన్నారు. డిగ్రీతోపాటు ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్యకు సంబంధం లేకుండా ఉంటుంది. డిగ్రీలో అయితే ఉన్న సీట్లలో కేవలం 50 శాతం మాత్రమే విద్యార్థులు చేరుతున్నారు. ఇక ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అయితే కన్వీనర్ కోటా సీట్లు భర్తీ కావడం లేదు... గత మూడేళ్లల్లో కాలంలోనే ప్రైవేటు డిగ్రీ కాలేజీలతోపాటు ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడటం ప్రారంభం అయ్యాయి.

గత మూడేళ్లల్లో రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య, చేరిన విద్యార్థుల సంఖ్య వివరాలు

డిగ్రీ కాలేజీలు.. విద్యార్థులు

విద్యాసంవత్సరం	కాలేజీలు	సీట్ల సంఖ్య	చేరిన విద్యార్థులు
2016-17	1125	408266	213321
2017-18	1173	421947	223163
2018-19	1151	443269	233947

ఇంజనీరింగ్ కాలేజీలు.. విద్యార్థులు

విద్యాసంవత్సరం	కాలేజీలు	సీట్ల సంఖ్య	చేరిన విద్యార్థులు
2016-17	220	104758	73686
2017-18	212	97961	68594
2018-19	205	96518	68296



మెక్సికోలో మారణహోమం

తీరప్రాంతంలోని బార్‌లో ఆగంతకుల కాల్పులు

ఏడుగురు మృతి.. ఒకరికి గాయాలు

గతేడాది క్వింటానా రాష్ట్ర తీరంలో 688 మంది హత్య

మెక్సికో: ఉత్తర అమెరికా ఖండంలోని మెక్సికో మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. తీర ప్రాంత నగరం ప్లయా డెల్ కార్మెన్ లో ఆగంతకుల కాల్పుల్లో 7 గురు ప్రాణాలు కోల్పోయారు. లాస్ విర్జీనియా బార్‌లో దుండగుల కాల్పులు జరపగా ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా..మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలొదిలాడు. కాల్పులు జరిపిన ఆగంతకుల వివరాలు తెలియరాలేదు. కాల్పులు జరిగిన రిసార్ట్ తీర ప్రాంతంలో ఉండటంతో ఆగంతకులెవరనేది తెలుసుకోవడం కష్టంగా మారింది. తీర ప్రాంత రాష్ట్రం క్వింటానా రూ కు అత్యంత సమీపంలో ఉన్న ఇలాంటి రిసార్టుల్లో నరహత్యలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది రెండుసార్లు జరిగిన నరహత్యలో 688 మంది ప్రాణాలు కోల్పోగా..పదుల సంఖ్యలో గాయపడ్డరు. 2017 లో జరిగిన నరహత్యలో 322 మంది బలయ్యారు. నరహత్యలకు పేరుమోసిన క్వింటానా లో ప్రతీ లక్ష మందిలో 50 శాతం మంది ఇలాగే హతమౌతున్నారు.



కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం

నిఘా పటిష్టం... పీడీయాక్టు ప్రయోగం

• రాజకీయ జోక్యంలేకుండా బాధ్యులపై చర్యలు • తెరాస నాయకులున్నా వదిలిపెట్టకండి • కట్టె కోత మిల్లులపైనా నియంత్రణ పెంచండి • కొత్తగా సామిల్స్‌కు అనుమతి వద్దేవద్దు • నియంత్రణ చర్యలపై త్వరలో ప్రత్యేక కార్యాచరణ • హరితహారం లక్ష్యాలు చేరుకునేందుకు పకడ్బందీ వ్యూహం • అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పర్యావరణ పరిరక్షణకు, హరితహారం లక్ష్యానికి ముప్పు తెస్తున్న కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అడవుల సంరక్షణ, చెట్ల నరికివేతకు సంబంధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కలప స్లగ్లింగ్‌కు అవకాశం లేని విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అటవీ, పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రత్యేకంగా సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. హరితహారం లక్ష్యాలు, ఫలితాలు, అడ్డంకులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పోలీసుల సహకారంతో కలప స్మగ్లరపై ఉక్కుపాదం మోపాలన్నారు. తరచూ స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని తేల్చి చెప్పారు. కలప స్మగ్లర్లు ఎంతటి వారైనా, ఎంత పలుకుబడి కలిగిన వ్యక్తయినా, ఏ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడైనా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణను నాలుగు విభాగాలుగా విభజించుకుని చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మొక్కల పెంపకం, అడవి పునరుద్ధరణ, హైదరాబాద్ నగరం లోపలా బయటా పచ్చదనం పెంచడం, కలప స్మగ్లింగ్ అరికట్టడంపై కార్యాచరణ రూపొందించుకుని రంగంలోకి దిగాలని సీఎం సూచించారు.

''అడవుల్లో సహజంగా చెట్లు పెరుగుతాయి. అడవుల ద్వారా లభించే పచ్చదనమే ఎక్కువ. ఓ వైపు అడవులు నశించిపోతుంటే, హరితహారం లాంటి కార్యక్రమాల ద్వారా ఎన్ని చెట్లు పెంచినా పెద్దగా ప్రయోజనం ఉండదు. అడవులను కాపాడితే పచ్చదనం కాపాడినట్లే. అడవులను కాపాడడమంటే, భూమిధర్మాన్ని కాపాడినట్లే. కలప స్మగ్లింగ్ వల్ల అడవులకు పెద్ద ముప్పు వాటిల్లుతుంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కలప స్మగ్లింగ్ జోరుగా సాగుతున్నది. కొందరు కలప స్మగ్లింగ్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. అలాంటి ప్రాంతాలను, వ్యక్తులను గుర్తించాలి. అక్కడ నిబద్ధత కలిగిన అధికారులను నియమించాలి. కలప స్మగ్లింగ్ అరికట్టడమే లక్ష్యంగా వారు పనిచేయాలి. పోలీసుల సహకారంతో అటవీశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించాలి. సాయుధ పోలీసుల అండతో కలప స్మగ్లింగ్‌ను నూటికి నూరు శాతం అరికట్టాలి. కలప స్మగ్లింగుకు పాల్పడే వారు ఎవరైనా సరే ఉపేక్షించవద్దు. కఠిన చర్యలు తీసుకోవాలి. వారికి సహకరించే అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. రాజకీయ నాయకులు ఎవరైనా స్మగ్లింగ్ కు పాల్పడినా వదిలిపెట్టవద్దు'' అని కేసీఆర్ అన్నారు. రూట్ స్టాక్‌ను ఉపయోగించుకుని అడవుల పునరుద్ధరణ చేపట్టాలని సూచించారు. సామాజిక అడవుల అభివ ద్ధి కన్నా, అటవీ ప్రాంతంలో అడవి పెంచడం సులువు, ఎక్కువ ఉపయోగం అని సిఎం అన్నారు. ''తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద ప్రతీ ఏటా నాటే మొక్కల సంఖ్యను పెంచాలి. వచ్చే వర్షాకాలం నుంచి ఏడాదికి వంద కోట్ల చొప్పున మొక్కలు నాటాలి. దీనికి అవసరమైన కార్యాచరణ రూపొందించాలి'' అని ముఖ్యమంత్రి చెప్పారు.

అటవీ పోలీసు అధికారుల సంయుక్త ప్రణాళిక

''టీఆర్ఎస్ నాయకులు ఎవరైనా ఈ పనిచేస్తే ముందు వారిపైనే చర్యలు తీసుకోండి. గతం లో నక్సలైట్ల కారణంగా అడవుల్లోకి వెళ్లడం సాధ్యం కావట్లేదు అని సాకులు చెప్పేవారు. ఇప్పుడు అలాంటి సమస్య కూడా లేదు. అడవులను కాపాడడమే లక్ష్యంగా పనిచేయండి. పోలీస్, అటవీ అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటు చేసుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొందిం చుకోవాలి'' అని సీఎం ఆదేశించారు. కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు ఇండ్లు నిర్మించుకునే సందర్భంలో తాము ఎంత కావాలంటే అంత కలప అందిస్తామని కొందరు అధికారులు తరచూ చెపుతుంటారని సిఎం చెప్పారు. అడవుల్లో చెట్లు నరకడం వల్లే ఈ కలప సమకూరుతున్నదని, ఇలాంటి అక్రమాన్ని అరికట్టాలని సూచించారు. కట్టె కోత మిషన్ల (సామిల్స్) నిర్వహణపై కూడా నియంత్రణ ఉండాలని, కొత్తగా ఎలాంటి సామిల్స్ కు అనుమతి ఇవ్వవద్దన్నారు. అడవులను రక్షించడంతో పాటు, చెట్ల నరకివేత వల్ల పోయిన అడవిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

''హైదరాబాద్ నగరం పరిధిలో లక్షా 50 వేల ఎకరాల అటవీ బ్లాకులున్నాయి. కానీ అందులో చెట్లులేవు. ఈ అటవీ బ్లాకుల్లో పెద్ద ఎత్తున చెట్లు పెంచాలి. దేశ రాజధాని నగరం ఢిల్లీలో ప్రస్తుతం విపరీతమైన వాయు కాలుష్యం ఉంది. చెట్లు లేకపోవడం, వాహన కాలుష్యం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ నగరంలో కూడా వాహనాల సంఖ్య పెరుగుతోంది. కాలుష్యం పెరుగుతోంది. దీన్ని నివారించా లంటే చెట్లు పెంచడం ఒక్కటే మార్గం. అన్ని పార్కులు, అటవీ బ్లాకుల్లో విరివిగా చెట్లు పెంచాలి. వాటిలో వాకింగ్ పాతులు కూడా నిర్మించి ఉపయోగంలోకి తేవాలి'' అని ముఖ్యమంత్రి సూచించారు.

కంపా, నరేగా, స్థానిక సంస్థల నిధులు వినియోగం

చెట్ల పెంపకం కార్యక్రమానికి నిధుల కొరత ఏమాత్రం లేదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. కాంపా నిధులు, నరేగా నిధులు, బడ్జెట్‌లో కేటాయించే నిధులు, నగర పాలక సంస్థల ద్వారా వచ్చే నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చదనం పెంచడానికి తీసుకునే చర్యలకు నిధుల కొరత ఉండదని, చిత్తశుద్ధితో పనిచేయాలని సిఎం కోరారు. ఈ సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు అనురాగ్ శర్మ, సిఎస్ ఎస్.కె.జోషి, డిజిపి మహేందర్ రెడ్డి, పిసిసిఎఫ్ పి.కె.ఝా, సీనియర్ అధికారులు ఎస్.నర్సింగ్ రావు, రామక ష్ణ రావు, రాజీవ్ త్రివేది, నిరంజన్ రావు, స్మితా సభర్వాల్, రాజశేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ప్రియాంక వర్గీస్, పలువురు అటవీశాఖ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఏది చేసినా...సంచనలమే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ సీఎం కేసీఆర్ ఏది చేసినా సంచలనమే... ఏ నిర్ణయం తీసుకున్నా సాహసో పేతమే... నామినేటెడ్ ఎమ్మెల్యే ఎంపికలోనూ ఈ తరహా నిర్ణయం తీసుకుని సంచలనం సృష్టిం చారు. శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యే లతోపాటే నామినేటెడ్ ఎమ్మెల్యేతో కూడా తాత్కాలిక స్పీకర్‌తో ప్రమాణ స్వీకారం చేయించాలని నిర్ణయించిన కేసీఆర్ అత్యవసరంగా మంత్రివర్గాన్ని సమావేశపర్చి గతంలో ఆంగ్లో-ఇండియన్‌గా ఉన్న స్టీఫెన్‌సన్‌ను నామినేటెడ్ మరోసారి ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పుడు కూడా మంత్రివర్గాన్ని సమావేశపర్చి నామినేటెడ్ ఎమ్మెల్యే ఎంపికపై చర్చించి నిర్ణయం తీసుకున్న దాఖలాలు లేవు. శాసనసభ కొలువుదీరాక నామినేటెడ్ ఎమ్మెల్యేను ఎంపిక చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కేసీఆర్ అందుకు భిన్నంగా ఎమ్మెల్యేల ప్రవమాణ స్వీకారానికి పది రోజుల ముందు మంత్రివర్గాన్ని సమావేశపర్చి అందులో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ ఎంపికను ఎజెండాలో పెట్టి అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని వెనువెంటనే గవర్నర్ ఈఎస్ఎల్ నరసిం హన్‌కు పంపగా, ఆయన ఆమోదించి అక్కడినుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రజత్‌కుమార్‌కు దస్త్రం చేరింది. ఆయన వెనువెంటనే ఆ దస్త్రానికి ఆమోదముద్ర వేయడం, నోటిఫికేష న్‌తోపాటు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించడం చకచకా జరిగిపో యాయి. నాలుగున్నరేళ్లపాటు సీఎంగా కొనసాగి ముందస్తు ఎన్నికలకు వెళ్లి ప్రభుత్వాన్ని రద్దు చేసే సాహసోపేత నిర్ణయం కేసీఆర్ తీసుకున్న సంగతి తెలిసిందే. దాంతోపాటు ప్రభుత్వాన్ని రద్దు చేసిన రోజునే 105 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించడం... ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడానికి కూడా ఆయన సంచలన జాబితాలో చేరాయి. ఎన్నికలకు ముందే వంద సీట్లు సాధిస్తామని ప్రకటించడంతోపాటు దరిదాపుగా 90 సీట్లను కైవసం చేసుకుని జాతీయస్థాయిలోనే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న ఘనత కూడా కేసీఆర్‌కే దక్కింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్ తనతోపాటు మైనార్టీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ మహమూద్ అలీతో గవర్నర్ చేత ప్రమాణం చేయించి ఆయనకు హోంమంత్రిత్వ శాఖను కట్టబెట్టారు. ఒక సీఎం, ఒక మంత్రితో రాష్ట్రాన్ని పాలిస్తూ సంచలనానికి తెరతీశారు. సోమవారం నామినేటెడ్ ఎమ్మెల్యే విషయంలో కేసీఆర్ తీసుకున్న చొరవపై సర్వత్రా హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి.

17 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రెండవ శాసనసభ, శాసన మండలి సమావేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 17 నుంచి శాసన సభ, 19 నుంచి శాసనమం డలి సమావేశాలు ప్రారంభం కాను న్నాయి. ఈ మేరకు సోమవారం గవర్నర్ ఈఎస్ ఎల్ నరసింహన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ శాసనసభ మొదటి సమావేశాలు 17వ తేదీ ఉదయం 10.30 గంటలకు, అలా గే మండలి సమావేశాలు 19న ఉదయం 11.30 గంటలకు ప్రారం భమ వుతా యని శాసనసభ కార్యదర్శి నర్సిం హాచార్యులు పేర్కొ న్నా రు. ఈ సమావేశా లను ఎన్ని రోజులపాటు నిర్వహించాలన్న అంశంపై శాసనసభ స్పీకర్ అధ్యక్షతన జరిగే సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) నిర్ణయించనుంది.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) మెయిన్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. 12 వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఆన్‌లైన్లో పరీక్షలు కొనసాగనున్నాయి. ఇందు కోసం దేశ వ్యాప్తంగా 273 నగరాల్లో పరీక్షలను నిర్వహిస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)పరీక్షను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణలో 7 నగరాల్లో... ఏపీలో 18 నగరాల్లో పరీక్షా కేంద్రాలున్నాయి. నేడు జరిగే పరీక్షకు తెలంగాణలో 10వేల మంది హాజరు కాను న్నట్టు తెలుస్తోంది. రేపటి నుంచి జరిగే పరీక్షలకు 70వేల మంది హాజరు కానున్నా రు. పరీక్ష రెండు షిఫ్టుల్లో జరగనుంది.విద్యార్థులు కేవలం అడ్మిట్ కార్డుతోపాటు ఏదైనా గుర్తింపు కార్డును మాత్రమే పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు.



కేజీ బేసిన్ నీళ్ల వాటా వదలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించి, అక్కడికక్కడే సవరించడానికి అధికారులకు సూచనలు చేశారు. ప్రతీ ప్రాజెక్టు పురోగతిపై రిటైర్డు ఇంజనీర్ల బృందం ముఖ్యమంత్రికి వివరించింది.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా గోదావరి, కృష్ణా బేసిన్లలో రాష్ట్రానికున్న నీటి వాటాను వినియోగించుకునే వ్యూహం అమలు చేయాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే, ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, సాగునీళ్లు అందిస్తారనే విశ్వాసంతో ప్రజలు తమకు మరోసారి అవకాశం ఇచ్చారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ఈ టర్మ్‌లో అన్ని ప్రాజెక్టులు నూటికి నూరు శాతం పూర్తి చేస్తామన్నారు. అందుకు అధికారులు, వర్క్ ఏజన్సీలు సహకరించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక సంస్థల నుంచి నిధుల సేకరణ

ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయించడంతో పాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా నిధులు సేకరిస్తామని చెప్పారు. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత కూడా వాటి నిర్వహణ కోసం అవసరమైన నిధులను బడ్జెట్లో కేటాయిస్తామని వెల్లడించారు. రైతులకు సాగునీరు ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు, మంచినీటికి కూడా ఎంత నీరు అవసరమవుతుందో లెక్కకట్టి, ఏ ప్రాజెక్టు నుంచి ఎంత నీరు వాడాలో నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో మొదట చెరువులు నింపడానికే ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం ఆదేశించారు. దీనికోసం ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఏ ప్రాంతంలో అయినా ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి ఆలస్యమైనా సరే, చెరువులు నింపడానికి కావాల్సిన ఏర్పాట్లు మాత్రం యుద్ధ ప్రాతిపదికన జరగాలని చెప్పారు.

''ప్రాజెక్టులు పూర్తి చేయడం ఈ ప్రభుత్వం వల్లనే అవుతుందని ప్రజలు నమ్మారు. 75 శాతం ఇదే కారణంతో టిఆర్ఎస్‌కు మళ్లీ ఓటు వేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, సాగునీరు అందించాం. వలసలు పోయిన వారు వాపస్ వచ్చారు. ఈ పరిస్థితి చూసే అక్కడి ప్రజలు 13 సీట్లలో టిఆర్ఎస్ ను గెలిపించారు. ఈ టర్మ్ లో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, తెలంగాణలో కోటి ఎకరాల్లో నీరు పారించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఐదేళ్ల పూర్తి సమయం మనకుంది. రాజకీయ సుస్థిరత ఉంది. నిధులకు కొరతలేదు. రైతులకు సాగునీరు అందివ్వడమే ధ్యేయంగా పనిచేయడానికి పునరంకితమవుదాం'' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

మోడీ పైసా ఇవ్వలేదు

''తెలంగాణ రాష్ట్రం వెనుకబడింది. సాగునీటి రంగంలో వివక్షకు గురైంది. అందుకోసమే ఇక్కడి ప్రజలు పోరాటం చేశారు. కాబట్టి తెలంగాణలో ఓ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించండి అని ప్రధాని మోడీకి అనేక సార్లు చెప్పాను. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.20 నుంచి రూ.30వేల కోట్లు సాయపడండి అని వేడుకున్నా. అయినా సరే నరేంద్రమోడి డబ్బులు ఇవ్వలేదు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరిస్తున్న తీరును చూసి దేశమంతా మెచ్చుకున్నది. వాటర్ మాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ వరంగల్ జిల్లా నెక్కొండలో చెరువులో పుట్టిన రోజు చేసుకుని మిషన్ కాకతీయ పనులను మెచ్చుకున్నారు. దేశమంతా ప్రశంసించారు. నీతి ఆయోగ్ కూడా మిషన్ కాకతీయ గొప్ప పథకమని చెప్పింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు రూ.24వేల కోట్లివ్వాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సరే, నరేంద్ర మోడీ ప్రభుత్వం 24 రూపాయలు కూడా ఇవ్వలేదు.

ఈ సారి కేంద్రంలో మనది క్రియాశీల పాత్ర ఉంటుంది. కావాల్సిన నిధులు రాబట్టుకునే అవకాశం ఉంటుంది. దీంతోపాటు మన రాష్ట్ర ఆదాయాభివృద్ధి రేటు కూడా బాగుంది. మొదటి నాలుగు సంవత్సరాలలో 17.17 శాతం వృద్ధిరేటుంటే, ఈ సంవత్సరం ఇప్పటి వరకు 29.17 శాతం వృద్ధి రేటు నమోదైంది. నిధులకు కొరతలేదు. ప్రాజెక్టులు కట్టుకోవడమే మన లక్ష్యం'' అని సీఎం కేసీఆర్ చెప్పారు.

''గోదావరి నదిలో తెలంగాణకు 950 టిఎంసిల నీటి వాటా ఉంది. సమైక్య రాష్ట్రంలోనే ఇది ఖరారైంది. దీని ప్రకారమే మనం గోదావరిపై కాళేశ్వరం, తుపాకుల గూడెం, సీతారామ ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందించాలి. హైదరాబాద్ కు తాగు నీరు అందించాలి. ఇదే లక్ష్యంతో ఆ ప్రాజెక్టు నిర్మిస్తున్నాం'' అని అన్నారు.

మల్లన్నసాగర్ ద్వారా హైదరాబాద్‌కు తాగునీరు

''మల్లన్న సాగర్ ద్వారానే హైదరాబాద్ మంచినీళ్ల కోసం నిర్మిస్తున్న 10 టిఎంసిల రిజర్వాయర్‌కు నీళ్లు పంపాలి. హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్, ఘనపురం ఆయకట్టుకు సాగునీరు అందించాలి. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువులు నింపాలి. వాటి ద్వారా క్రమం తప్పకుండా నీటిని విడుదల చేస్తూ మూసీ నది మురికిని వదిలించాలి. మూసీ రివర్ ఫ్రంట్ ను అహ్మదాబాద్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ లాగా అభివృద్ధి చేస్తాం. దానికి కూడా గోదావరి నీళ్లు అందాలి. చివరికి మూసీ నది నీళ్ల ద్వారా పాత నల్గొండ జిల్లా పొలాలకు నీరు చేరాలి'' అని ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని చెప్పారు.

దేవాదుల ఎత్తిపోతలపై సమీక్ష అవసరం

''గోదావరి నదిపైనే నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత తుపాకుల గూడెం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఆ నీటిని ఉపయోగించుకోవడానికి బ్యారేజి కడుతున్నాం. ఏడాదికి 75 టిఎంసిలకు పైగా నీరు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పుడున్న డిజైన్లు, కాల్వలు, ఇతర నిర్మాణాలు పెద్దగా ఉపయోగపడేలా లేవు. పాఖాల, రామప్ప, గణపురం, లక్నవరం చెరవులను నింపాలి. తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ నిర్మించి, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియో.జకవర్గాలకు నీరివ్వాలి. దీనికోసం మొత్తం ప్రాజెక్టును రివ్యూ చేసి,కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలి'' కేసీఆర్ ఆదేశించారు.

జూన్ నుంచి నిరుద్యోగ భృతి?

(మొదటిపేజీ తరువాయి)

నివేదించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు రూ.3016 భృతిని అందజేస్తామని కేసీఆర్ ఎన్నికల ప్రచార సభల్లో హామీ ఇవ్వడంతోపాటు తెరాస ఎన్నికల ప్రణాళికల్లోనూ ఈ అంశాన్ని చేర్చిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన కేసీఆర్ నిరుద్యోగ భృతిపై యుద్ధప్రాతిపదికన కసరత్తు చేసి నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుతం అమలులో ఉన్న నిరుద్యోగ భృతి పథకాన్ని అధికారులు అధ్యయనం చేయనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు విడివిడిగా ఏడు రాష్ట్రాల్లో పర్యటించి పది రోజుల్లోగా నివేదిక అందజేయాలని నిర్ణయించారు.

ఆదాయ పరిమితిలో మార్పు

నిరుద్యోగ భృతికి వార్షిక ఆదాయ పరిమితి ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో రూ.2 లక్షలు నిర్ణయించగా, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో రూ.3 లక్షలుగా నిర్ణయించారు. నిరుద్యోగ భృతిని అమలు చేస్తున్న ఆయా రాష్ట్రాల్లో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇచ్చాక ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసి వచ్చే జూన్ మాసం నుంచి ఈ భృతిని నిరుద్యోగులకు చెల్లించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. నిరుద్యోగు భృతికి ఆయా రాష్ట్రాల్లో ఉన్న జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవలసి ఉంటుంది. అధికారుల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం రాష్ట్రంలో 9,13,307 మంది నిరుద్యోగులు ఉండగా, 18 నుంచి 30 ఏళ్ల వయస్సున్న వారు 5,53,847 మంది ఉన్నట్టు అంచనా. రాష్ట్రానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న నిరుద్యోగ భృతి విధి విధానాలను ఇప్పటికే అధికారులు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి నివేదించినట్టు తెలుస్తోంది. వాటి ఆధారంగా నిరుద్యోగ భృతి అమలుపై సీఎం అంతిమ నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

ఆ రాష్ట్రాల్లో అమలుపై అధికారుల ప్రాథమిక నివేదిక

మనదేశంలో ప్రస్తుతం ఏడు రాష్ట్రాల్లో నిరుద్యోగులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ భృతిని చెల్లిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో ఈ పథకం అమలవుతోంది. ఆయా రాష్ట్ర ప్రభు త్వాలు నిరుద్యోగ భృతికి సంబంధించి విధి విధానాలను ఖరారు చేసి అమలు చేస్తున్నట్టు అధికారులు ప్రభుత్వానికి అందజేసిన ప్రాథ మిక నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో ఇంటర్మీడియట్, ఆపై తరగతికన్నా ఉన్నత విద్యనభ్యసించిన వారికి నిరుద్యోగ భృతిని అమలు చేస్తున్నారు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్న యువతీ, యువకులకు నెలకు రూ.1000 భృతిని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చెల్లిస్తోంది. వికలాంగులైతే అదనంగా రూ.500 ఇస్తున్నట్టు అధికారులు సేకరించిన సమాచారంలో తేలింది. హిమాచల్‌ప్రదేశ్‌లోనూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అమలు చేస్తున్న విధానం తరహాలోనే నిరుద్యోగ యువతకు రూ.1000, వికలాంగులైతే అదనంగా రూ.500 కలిపి రూ.1500 చెల్లిస్తోంది. అయితే ఈ రాష్ట్రంలో నిరుద్యోగ భృతి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్నవారికి మాత్రమే వర్తింపజేస్తున్నారు. కేరళ రాష్ట్రంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి మూడేళ్లు పూర్తి చేశాక మాత్రమే నిరుద్యోగ భృతిని చెల్లిస్తున్నారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్న వారికే నిరుద్యోగ భృతి ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఈ రాష్ట్రంలో కేవలం నెలకు రూ.120 మాత్రమే నిరుద్యోగ భృతిని చెల్లిస్తున్నట్టు అధికారులకు సమాచారం అందింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 12వ తరగతిపైన చదివి నిరుద్యోగులుగా ఉన్న వారికి మాత్రమే భృతి ఇస్తున్నారు. 22 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్న వారికి మాత్రమే నెలకు రూ.1000 భృతిని ఇస్తుండగా, వికలాంగులైతే రూ.1500 చెల్లిస్తున్నారు.

రాజస్థాన్‌లో 12వ తరగతి పాసై 21 నుంచి 35 ఏళ్ల వయస్సున్న నిరుద్యోగ యువతకు భృతి ఇస్తుండగా ఇక్కడా పురుషులకు రూ.650, మహిళలకు రూ.750 భృతి కింద ఆ ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో డిగ్రీ, రెండేళ్ల డిప్లొమా ఉత్తీర్ణత సాధించి నిరుద్యోగులుగా ఉన్నవారికి నెలకు రూ.1000 చెల్లిస్తున్నారు. 21 నుంచి 35 ఏళ్ల వయస్సున్న వారికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. హర్యానా రాష్ట్రంలో 35 ఏళ్ల వయస్సు వచ్చేవరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లిస్తోంది. పదవ తరగతి పాసైనవారికి నెలకు రూ.100, 12వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికి రూ.900, డిగ్రీ పాసైన వారికి రూ.1500 భృతిగా ఇస్తున్నారు. పీజీ చేసిన వారికి ఈ రాష్ట్రంలో రూ.3000 భృతిని ఇస్తున్నట్టు అధికారులు గుర్తించారు.

నామినేటెడ్ ఎమ్మెల్యేగా స్టీఫెన్‌సన్

ప్రొటెమ్ స్పీకర్‌గా అహ్మద్‌ఖాన్ నియామకానికి మంత్రి మండలిఆమోదం


హైదరాబాద్, ఆంధ్రప్రభ : రెండోసారి ముఖ్య మంత్రిగా ఎన్నికైన తర్వాత కె.చంద్రశేఖర రావు సోమవారం తొలిసారి మంత్రిమండలి సమా వేశం నిర్వహిం చారు. ప్రగతి భవన్ వేదికగా జరిగిన ఈ సమావేశంలో రెండు కీలక నిర్ణ యాలు తీసుకున్నారు. అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యుడి నియామకంపై ఆమో దముద్ర వేశారు. రాష్ట్రచరిత్రలో ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ఎన్నికైన అందరు సభ్యులతో పాటు నామినేటెడ్ సభ్యుడితోనూ ప్రమాణ స్వీకారం చేయించాలని నిర్ణయిం చారు. తెలంగాణాలో గంగా జమునా తహజీబ్‌ను కొనసాగించడానికి ప్రభుత్వం అసెంబ్లీకి సంబంధించిన వ్యవహారాల్లో నిర్ణయాలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా అన్నారు. అందులో భాగంగానే ప్రొటెమ్ స్పీకర్‌గా ముస్లిం సామాజికవర్గానికి చెందిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను నియమిం చినట్లు పేర్కొ న్నారు. అసెంబ్లీలో నామినేటెడ్ సభ్యునిగా క్రిష్టియన్ మతానికి చెందిన ఆంగ్లో ఇండి యన్ ఎల్విస్ స్టీఫెన్‌సన్‌ను నియమిం చాలన్న ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ గవర్నర్ ఇఎస్ఎల్ నరసిం హన్‌కు పంపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో ఆంగ్లో ఇండియన్ల ప్రాతినిధ్యం ఉండాలనే రాజ్యాంగ నిబంధనల మేరకు తెలంగాణ అసెంబ్లీలో ఎల్విస్ స్టీఫెన్‌సన్‌ను నామినేటెడ్ సభ్యునిగా నియమిసు న్నట్లు ఈ



సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. అలాగే 2018 డిజెంబర్ నెలలో తెల్గాణ శాసనసభ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను, రాష్ట్ర ప్రదానాధికారి రజత్‌కుమార్‌ను మంత్రిమండలి అభినందించింది. ఈ ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసిన రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగానికి కూడా కేబినెట్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపింది. తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికైన శాసన సభ్యులం దరికీ భారత రాజ్యాంగం ప్రతులను తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో అందజేయాలని మంత్రిమండలి నిర్ణయించింది. అసెంబ్లీకి సంబంధించిన సభా నియమావళి పుస్తకాలను, బుక్‌లెట్లను, ఇతర సమాచారాన్ని కూడా మూడు భాషల్లో ముద్రించి పంపిణీ చేయాలని తీర్మానిం చారు. ఇందుకు సంబంధించిన నమూనా ప్రతులను అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులు పరిశీలన నిమిత్తం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందజేశారు.

స్టీఫెన్‌సన్‌కు మరో ఛాన్స్

రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడలు రూపొందిం చడంలో తిరుగులేని చాణక్యాన్ని ప్రదర్శించే ముఖ్యమంత్రి కేసీఆర్ నామినేటెడ్ ఎమ్మెల్యేగా మరోమారు స్టీఫెన్‌సన్‌ను ఎంపికచేసి బంపర్ ఆఫర్ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశానికి ముందే మంత్రివర్గ సమావేశం ఏర్పాటుచేసి ఈ నియామకం చేయడం ఒక రికార్డు. స్టీఫెన్‌సన్ అనగానే ఓటుకునోటు కేసు గుర్తుకురానుండగా, ఓట్లకు నోట్ల వ్యవహారాన్ని ప్రభుత్వానికి సహకరించి బట్టబయలు చేయడంతో రాజకీయంగా టీఆర్ఎస్‌కు, ప్రభుత్వానికి ఈ సంఘటన ద్వారా ఎంతో మేలు జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్పట్లో టిడిపి ఎమ్మెల్యేగా ఉన్న రేవం త్‌రెడ్డిని లంచం ఇవ్వజూపారని అరెస్ట్ చేయడం, చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారన్న ప్రచారం వెరసి విపక్షాన్ని ఇరుకునపెట్టేయ డంలో టీఆర్ఎస్‌కు కొత్త అస్త్రాన్ని అందించడంలో స్టీఫెన్‌సన్ సంఘటనే కీలకం. ఇప్పటికీ ఈకేసు దర్యాప్తు జరుగుతుండగా, తెలంగాణలో టిడిపిని పతనావస్థకు చేర్చడంలో ఆ సంఘటనే ప్రధానభూమిక పోషించిందని రాజకీ యవర్గాలు భావిస్తాయి. గతంలో నామినేటెడ్ ఎమ్మె ల్యేగా ఉన్న స్టీఫెన్‌సన్‌కు రెండోసారి అవకాశం దక్క గా, తనకు విశ్వసనీయంగా ఉండేవారికి కేసీఆర్ న్యాయం చేస్తారన్న అంశం మరోసారి రుజువైందని టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.



ఆగమధర్మం రాజకీయ పర్వం

శబరిమల వివాదంలో తెరవెనుక వాస్తవాలు

సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో... దట్టమైన కీకారణ్యంలో కొలువైన అయ్యప్ప ఆలయం శబరిమలై సుసంపన్నమైన సంప్రదాయ మతవిశ్వాసాల వేదిక. ఆలయ విధివిధానాలు, సంప్రదాయాలు, ఆగమ విధానాల కారణంగా కొన్ని కఠిన నిబంధనలు ఆలయానికి ప్రత్యేకతలు తెచ్చిపెట్టాయి. ఇప్పుడు ఆ నిబంధనలే వివాదాలకూ కారణమయ్యాయి. ముఖ్యంగా రుతుక్రమం ఉండే మహిళలకు ఆలయ ప్రవేశంపై మొదలైన రగడ ఇప్పుడు కేరళను పట్టి ఊపేస్తోంది. వందల సంవత్సరాల సంప్రదాయాన్ని కాదని, ఆ నియమాలకు విరుద్ధమైన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఆదేశాలను కాదనలేని పరిస్థితుల్లో వివాదం రోజురోజుకూ ముదురుతోంది. అనాదిగా శబరిమల ఆలయంలో ఏ ధర్మం పాటించారు.. ఆగమం ఏంచెప్పింది... తెరవెనుక ఉన్న మరికొన్ని వివాదాలు ఏమిటి. మహిళ ప్రవేశంపై సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో కేరళ ఎందుకు అట్టుడుకుతోందన్న అంశాలపై ప్రత్యేక కథనం....

- మహిళల ప్రవేశంపై ఎన్నో నివేదికలు
- బ్రిటీష్ హయాంలోనే సంప్రదాయాలపై సమగ్ర రికార్డులు
- ఆగమ విధానాలకే అగ్రతాంబూలం
- కాలానుగుణ మార్పులతో సుప్రీం కొత్త మార్గదర్శకం
- సంప్రదాయాలే ముఖ్యమంటున్న ఒక వర్గం
- మార్పును ఆహ్వానించాలంటున్న మరోవర్గం
- రాజకీయ జోక్యంతో కీకారణ్యంలో ఆరనిచిచ్చు

మానవ మనుగడ, ధరణిపై పరిణామ క్రమంలో పురుడు పోసుకుంది. ఆకలితో ప్రారంభమైన 'వేట' మానవ జీవన విధానాన్ని మార్చి వేసింది. అన్యోన్యత, అనైక్యత, ఆధిపత్యం, మానవ సమాజ ఎదుగుదలకు అడ్డంకిగా మారిన తొలినాళ్లలో "ఆభయం" అనే పదం ఉద్భవించలేదు. మానవునిలో ఐక్యతను చాటేందుకు "భయం, నమ్మకం, విశ్వాసం" అనే పదాలు నాటి సమాజంలో చొప్పించబడ్డాయి. లేనట్లయితే, ఆధిపత్య ధోరణితో మానవ సమాజాల వృద్ధి ప్రశ్నార్థకం అయ్యేది. కాలక్రమేణా మానవ సమూహాలు పరిమిత కట్టుబాట్లతో, నాటి పరిస్థితుల కనుగుణంగా ఆగమశాస్త్రాలను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసుకున్నాయి. కాలానుగుణంగా మారాల్సిన అవిసుప్త చేతనావస్థలోకి నెట్టివేయబడ్డాయి. దానికి కారణాలు అనేకం ఉన్నప్పటికీ ... రెండు వాదాల కారణ బిందువుగా నేటి సమాజంలో సహేతుక విశృంఖలత్వానికి ఆజ్యం పోసినట్లయింది.

రాజ్యాంగం ఏం చెబుతోంది....

ఎన్నో రాచరిక రాజ్యాల అనుభవాన్ని కలబోసుకున్న ప్రజాస్వామ్య భారతదేశం 19వ శతాబ్దంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో మన దేశం రాజ్యాంగాన్ని నిర్మించుకుంది. ఆ రాజ్యాంగంలో మనం పొందుపరుచుకున్న ముందుమాట భారత ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక ప్రతిపత్తిగల సోషలిస్ట్ సెక్యులర్ ప్రజాస్వామిక గణతంత్ర వ్యవస్థగా ఏర్పాటు చేసుకున్నాం. ఆ రాజ్యాంగం నుంచి ఉద్భవించిందే సర్వోన్నతమైన న్యాయవ్యవస్థ సుప్రీంకోర్టు, చట్టసభల పని చట్టాలను చేయడం మాత్రమే. ఆ చట్టాలపై వ్యాఖ్యానించడం న్యాయస్థానాలు ముఖ్య విధి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు తమ పరిధిలో ఉండి తమ బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, పాలనా వ్యవస్థలు ప్రజలు తూచా తప్పకుండా పాటించాలని మనం నిర్మించుకున్న రాజ్యాంగం వెలువరించింది కదా! తీర్పునకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా నేరమే. పదేపదే చోటుచేసుకుంటున్న సమస్యలపై ప్రజాబాహుళ్యం ఒకవేళ మార్పు కోరుకుంటే ప్రజాస్వామ్యయుతంగా తమ నిరసనలను తెలుపుకోవడానికి ప్రజాస్వామ్యం అనేక విధాలైన మార్గాలను నిర్దేశించింది. హింసాత్మక చర్యలకు తావులేదని మాత్రం కఠినంగా హెచ్చరించింది.

ఆగమశాస్త్రం ఏం చెబుతోంది....

ఆలయంలో ఏది ఆచారం? ఏది అపచారం? ఆగమ శాస్త్రాన్ని నిర్దేశించేదెవరు? వ్యతిరేకించేది ఎవరు? పరపతుల కోసమే పీఠాధిపతుల ప్రయత్నమా? స్వామివారికి కైంకర్యాలు నిర్వహించేఅర్చకులే ఆజ్యం పోస్తారా? భిన్న వాదనలు... విరుద్ధ

అసలు పూజారులు ఎవరు? పద్ధతులు మార్చిందెవరు?

పన్నెండవ శతాబ్దానికి చెందిన అయ్యప్ప ఆలయం మాల ఆర్యులది. 1800వ సంవత్సరంలో పండలం రాజ కుటుంబం దీన్ని ఆక్రమించుకుని, ఆలయంలోని పలు విగ్రహాలను అడవిలో విసిరేసి వాటి స్థానంలో కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించారన్నది చరిత్ర. 1904లో పండలం రాజు ఆంధ్రప్రదేశ్‌లోని బ్రాహ్మణ వర్గానికి చెందిన తాజమన్ కుటుంబాన్ని తీసుకువచ్చి ప్రధాన పూజారి బాధ్యతలను అప్పగించారు. అప్పటివరకు ద్రావిడ పద్ధతిలో పూజా కార్యక్రమాలు జరిగేవి వాటిని మార్చేసి బ్రాహ్మణ పద్ధతులను ప్రవేశపెట్టారు. గతంలో అయ్యప్పకు పూజారులుగా వ్యవహరించిన మాల ఆర్యులు, తేనెతోనే అభిషేకం చేసేవారు. కానీ రామన్న పూజారులు పాలతో అభిషేకం చేయడం ప్రారంభించారు. ఆలయం బాధ్యతలను 1950లో ట్రావెన్కోర్ దేవస్థాన బోర్డు స్వీకరించింది. మాకు ఈ ఆలయాన్ని తిరిగి అప్పగించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతాం అవసరమైతే సుప్రీంకోర్టు గడప ఎక్కుతామని హెచ్చరించింది.

ప్రకటనలు గురించి తెలియాలంటే... ఆగమ శాస్త్రం గురించి తెలుసుకోవాలి. సంస్కృతం నుంచి ఆగమ శాస్త్రం అనే పదం ఉద్భవించింది. "ఆగమ" అంటే సాంప్రదాయ ప్రకారం. శాస్త్రం అంటే వ్యాఖ్యానం.. లేదా గ్రంథం అని అర్థం. వైవిధ్యభరితమైన సాంప్రదాయాల సంగమంగా హిందూ మతాన్ని అభివర్ణించవచ్చు. ఆగమ శాస్త్రం అనేది అగమాలలో ఒకటి. ఇది నాలుగు పాదాలుగా ఉంటుంది. జ్ఞానపాదం: ప్రపంచ దృష్టి కోణాన్ని వివరించే తత్వశాస్త్రం. యోగ పాదం: మానసిక శారీరక అభ్యాసాలను వివరిస్తుంది. క్రియాపాదం: ఆరాధన ఆలయ నిర్మాణ వివరాలను తెలియజేస్తుంది. చర్య పాదం: భక్తుల ప్రవర్తనా నియమాన్ని, ప్రార్థన కోసం ఆచరించవలసిన నియమాలను విశదీకరిస్తుంది. ఇలా మత ఆచరణకు సంబంధించి అన్ని వివరాలను ఆగమ శాస్త్రం మార్గదర్శకంగా వివరిస్తుంది. ప్రత్యేకంగా ఇది ధ్యాన పద్ధతులపై ఆధారపడి మార్గాన్ని నిర్దేశిస్తుంది.

ఆగమంలో మార్పు అవసరమే

కాలానుగుణంగా మారుతున్న పరిస్థితులు, నాగరికతను బట్టి మార్పులు చేర్పులు చేసుకోవలసిన అవసరం ఆగమ శాస్త్రానికి ఎంతైనా ఉందన్న వాదం బలంగా వినిపిస్తోంది. ఆభయం, నమ్మకం, విశ్వాసాలను బలీయంగా ఆనాటి ప్రజలలో చొప్పించి హిందూయిజంను అభివృద్ధి పరచాలని సదుద్దేశంతో ఆగమశాస్త్ర రచన జరిగిందనే వాదన ఉంది. ఆధునికత విరబూస్తున్న నేటి సమాజంలో ఇంకా ఈ పద్ధతులు ఏమిటో? అనే ప్రశ్న తలెత్తుతున్న సందర్భంలో? మతాలకు ప్రాధాన్యత పెరుగుతున్న నేటి ఆధునిక సమాజంలో ఆగమ శాస్త్రం అనే అంశం తెర మీదకు వచ్చింది. ప్రపంచ దేశాలన్నీ భారతదేశాన్ని హిందూ దేశంగా అభివర్ణించడం... ఆగమశాస్త్ర ఉనికిని తట్టి లేపినట్లయింది. దీనికితోడు కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉండటం, మత మౌఢ్యాలకు ఉన్నత స్థాయి స్వేచ్ఛనిచ్చి ఆర్ ఎస్ ఎస్, సంఘ్ పరివార్, బీజేపీలు రాజకీయం చేస్తున్నాయన్న విమర్శ ఉంది. నాయకులు, ఎంపీలు హిందువులను రెచ్చగొట్టే ప్రకటనలు అనేకం చూశాం. దీంతోనే అయోధ్య, శబరిమల ఆలయ అంశాలు తెరమీదకు వచ్చాయనడంలో సందేహమే లేదు.

మాల ఆర్యులు ఏమంటున్నారు?


ఆలయాన్ని అప్పగించినట్లయితే సుప్రీంతీర్పును అమలు చేస్తామని ఐక్య మాల ఆర్యసభ ప్రకటించింది. అయ్యప్ప అసలు ఎవరి పుత్రుడు అనే చర్చ కూడా కొనసాగుతోంది. ఇద్దరు మహాపురుష పుంగవులు మహావిష్ణువు, శివశంకర్‌ల సంగమంలో ఉదయించిన తేజస్సే అయ్యప్పగా నామకరణం చెప్పబడిందని హిందువుల నమ్మకం. అయితే పొన్నం బాల మేడు గుహలో కందన్, కారతమ్మ దంపతులకు జన్మించిన పుత్రుడే అయ్యప్ప అన్నది మాల ఆర్యుల నమ్మకం. అయ్యప్ప ఆలయ మొదటి పూజారి కరిమల ఆర్యన్, చివరి పూజారి కె.కోచు కుట్టి కోచు రామన్, మొదటి పూజారే శబరిమల ఆలయ శంకుస్థాపన చేశారని మాల ఆర్యుల వాదన. ఇప్పటికీ వారంతా కొట్టాయంలోని ఎత్తయిన పర్వత ప్రాంతాలలో నివసిస్తుంటారు. వారిని కేరళ ప్రభుత్వం ఎస్.టి.లు గా పరిగణిస్తుంది. కేరళలో దాదాపు 100 ఆలయాలపై ఆదివాసి దళిత సంఘాల తమ హక్కుల కోసం పోరాడుతున్నాయి. బ్రాహ్మణ పూజారుల కంటే ముందు మాల ఆర్య పూజారులు అయ్యప్పకు తేనెతో అభిషేకం చేసేవారని ప్రస్తుత కేరళ సీఎం విజయన్‌సైతం వ్యాఖ్యానించడం గమనార్హం. తమ దేవుళ్ళ పక్కన అన్య మతస్తులను కూర్చోబెట్టే సంస్కృతి ద్రవిడులదని, ఆ సంస్కృతికి గిరిజనులు, ఆదివాసీలు దగ్గరగా ఉంటారని చరిత్రకారులు చెబుతారు. అందుకేనేమో అయ్యప్ప మిత్రుడు ముస్లిం "వావర్" కావడం విశేషం.

అపచారమా? రాజకీయమా?

సాక్షాత్తు దేశ సర్వోన్నత న్యాయస్థానమే అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశానికి అనుమతినిస్తూ తీర్పునిచ్చింది. ఆ తీర్పును స్వాగతిస్తూ ఆర్ ఎస్ ఎస్ కేరళ రాష్ట్ర కార్యదర్శి పి.గోపాలం కుట్టి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీఎస్ శ్రీధరన్ పిళ్లై స్పందిస్తూ లింగ వివక్ష లేకుండా భక్తులందరికీ సమాన హక్కులు ఉండాలని వ్యాఖ్యానించారు. అయితే అర్చకులు, కర్తలు, భక్తులు మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సందర్భంలో స్వామి దర్శనం కోసం మహిళలు వచ్చారు. కానీ 10 నుండి ఏళ్లలోపు బాలికలను, మహిళలను ఆలయ ధర్మకర్తలు, హిందూ సంఘాలు పూర్తిస్థాయిలో ప్రతిఘటించారు. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైన మూలానే ఇలాంటి ఘటనలు జరిగాయని చెప్పక తప్పదు. పోలీసుల సమక్షంలోనే గుడిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన మహిళలను దాదాపు రెండు వందలమంది భక్తులున్న

దాదాపు 1600వ సంవత్సరం నుంచేశబరిమల అయ్యప్ప ఆలయంలో రుతుస్రావం కలిగిన అమ్మాయిలు, మహిళలకు దర్శన నిషేధం విధించబడిందని ఆగమ శాస్త్రం వివరిస్తోంది. దీనిపై వాదోపవాదనలు జరుగుతున్న తరుణంలోనే ప్రజా సంఘాలు 17 సార్లు సర్వోన్నత న్యాయస్థాన తలుపుతట్టాయి. మొదట 1990 నుంచి ప్రారంభమైన పోరాటం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. పూజింపబడ్డారని, ఆడ, మగ తేడా లేకుండా అయ్యప్ప భక్తులంతా ఓకే భావంతో ఉండాలని హితవు పలికింది. ఓ మతానికి సంబంధించిన ప్రార్థనా మందిరంలోకి అదే మతానికి చెందిన కొంతమందిని అనుమతించడం, మరి కొంతమందిని అనుమతించకపోవడం అంటరానితనమే అవుతుంది అంటున్న రాజ్యాంగంలోని 17వ ఆర్టికల్‌ను స్ఫూర్తిగా తీసుకునే ఆలయంలోకి అన్ని వయస్కుల మహిళలను అనుమతించాల్సిందేనంటూ ధర్మాసనం

సుదీర్ఘ వివాదం... చారిత్రక తీర్పు



పూర్తిస్థాయి వాదనలు విన్న పిమ్మట 4 : 1 మెజారిటీతో సర్వోన్నత న్యాయస్థానం తన సుదీర్ఘ తీర్పును వెల్లడించింది. మహిళలందరినీ ఆలయంలోకి అనుమతించాలంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఖాన్వల్కర్, జస్టిస్ నారీమన్, జస్టిస్ చంద్ర చూడ్, జస్టిస్ ఇందు మల్హోత్రాలు ఉమ్మడి దృక్పథంతోనే తీర్పునిచ్చినట్లు ధర్మాసనం వెల్లడించింది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం వారికి రాజ్యాంగం కల్పించిన హక్కని, భక్తి పేరుతో లింగ వివక్ష నేరమని చెప్పింది. ఈ దేశంలో మహిళలు దేవతామూర్తులుగా ఉత్తర్వులను జారీ చేసింది. సుప్రీం తీర్పును పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళలు స్వాగతించగా, సాంప్రదాయ వాదులు మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తీర్పుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన సర్వోన్నత న్యాయస్థానం 48 రివ్యూ పిటిషన్లను జనవరి 22న విచారిస్తామని భరోసా ఇచ్చింది.

బ్రిటిష్‌కాలం నాటి నివేదికలు ఏం చెప్పాయి?



అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై స్పష్టమైన సంప్రదాయ మార్గదర్శకాలపై బ్రిటిష్ కాలంలోనే చర్చ జరిగింది.రుతుక్రమ వయస్సు గల మహిళలకు ఆలయ ప్రవేశం నిషిద్ధం అని బ్రిటిష్ కాలంనాటి నివేదికలో ఉందని అధికారులు తెలిపారు. అప్పట్లో శబరిమల ఆలయాన్ని "చౌరీముల్లా" అని ప్రస్తావించేవారు. 1820 లోనే ఏడాదికి 15 వేల మంది భక్తులు వచ్చేవారని బ్రిటిష్ ప్రభుత్వ నివేదిక తెలిపింది. శబరిమల ఆలయంపై 1820 లో మద్రాస్ ఆర్మీకి చెందిన బెంజమెన్ స్వాయిన్ వార్డ్, పీటర్ ఐర్ కార్నర్లు, ట్రావన్కోర్, కోచి, శబరిమల విశేషాలపై ఐదు సంవత్సరాలపాటు విస్తృత పరిశోధనలు జరిపి వేదికను రూపొందించారు. మద్రాస్ ప్రభుత్వం ఈ పరిశోధన పత్రాన్ని 1893 నుంచి 1901 ల మధ్య కాలంలో రెండుసార్లు రెండు భాగాలుగా ముద్రించింది. శతాబ్దాల సాంప్రదాయాన్ని మార్చకూడదని బ్రిటిష్ కాలం నాటి నివేదిక ఎంతో ఉపయోగకరంగా ఉందని సాంప్రదాయ వాదులు సంబర పడుతున్నారు.

గుంపు అడ్డుకుంది. అడ్డుకునే సమయంలో ఒక అపరాధం చోటు చేసుకుంది. ఆ గుంపునకు నాయకత్వం వహించిన ఆర్ ఎస్ ఎస్ నాయకుడు వల్సన్ థిల్లంకరే అపచారం చేశారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే మెట్లపై ఇరుముడి మూట లేకుండానే నిల్చున్నాడు. ఇరుముడి లేకుండా ఎవరైనా భక్తులు ఆ మెట్లపై ఎక్కినట్లయితే అపచారంగా భావిస్తారు. ఆలయంలోకి మహిళలు రాకుండా అడ్డుకునేందుకు వచ్చిన ఓ సాధారణ వ్యక్తి ఇంతటి అపచారం చేసినా ఎవరూ పట్టించుకోలేదు. సంప్రోక్షణ జోలికి వెళ్లలేదు. అసలు శుద్ధి చెయ్యాలన్న ఆలోచన రాకపోవడం విచిత్రం.

వివాదానికి రాజకీయ పక్షాల ఆజ్యం

కోర్టు ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్న ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పలు ప్రాంతాలలో సభలు పెట్టి ప్రజలకు, భక్తులకు, హిందూ సంఘాలకు, నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. భక్తులు, హిందూ సంఘాలు తీవ్రస్థాయిలో అడ్డుకోవడంతో మహిళలు వెనక్కి తిరుగక తప్పలేదు. ఇది ఉద్రిక్తతకు దారితీసింది. భూమాత బ్రిగేడ్ చీఫ్ సామాజిక కార్యకర్త, తృప్తి దేశాయ్ అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు రాగా కొచ్చి విమానాశ్రయంలోనే ఆందోళనకారులు అడ్డుకోవడంతో వెనుదిరగక తప్పలేదు.

మార్పు మంచిదే

దక్షిణ భారతదేశంలో పట్టు కోసం ప్రయత్నిస్తున్న బిజెపి, ఆర్ ఎస్ ఎస్, విశ్వహిందూ పరిషత్‌లు శబరిమల అంశాన్ని ఉపయోగించుకుని రాజకీయ లబ్ది పొందేందుకు విశ్వ ప్రయత్నం చేస్తోందని, ఈ అంశాన్ని చేజారనియ్యకుండా, సమయానుకూలంగా, రాజ్యాంగబద్ధంగా సద్వినియోగం చేసుకోవాలని సీపీఎం పార్టీలు చూస్తున్నాయని రాజకీయ పరిశీలకుల విశ్లేషణ. కాలానుగుణంగా ప్రపంచం మారుతుంది. దానికనుగుణంగానే మనం, మనం నిర్మించుకున్న ఆచార సంప్రదాయాలను, అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసుకుంటూ రాజ్యాంగబద్ధంగా ప్రజలు జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్న విషయాన్ని మరువరాదు.



దేశబోయిన శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్, 9381605974



అసలు వివాదం

కేరళలోని పశ్చిమ కనుమల్లో సహ్యాద్రి పర్వత పంక్తుల్లో దట్టమైన 18 కొండల మధ్య శబరిమల కేంద్రీకృతమై ఉంది. ఈ ఆలయంలో అయ్యప్ప స్వామి కొలువైనారు. "పత్తినంతిట్ట" జిల్లాలోని ఈ గుడి సముద్ర మట్టానికి 3 వేల అడుగుల ఎత్తున ఉన్నది. నైష్ఠిక బ్రహ్మచర్యం పాటించి, నలభై ఒక్క రోజులు కఠిన దీక్ష చేసి అయ్యప్ప దర్శనం కోసం భక్తులు ఇక్కడకు వస్తారు. ఆలయ ధర్మకర్తలు ఏర్పాటు చేసుకున్న ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం పది సంవత్సరాల లోపు బాలికలు, 50 సంవత్సరాలు దాటిన మహిళలకు మాత్రమే దర్శన భాగ్యాన్ని కలుగ చేస్తారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయస్కుల మహిళలను అనుమతించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఒక పక్క రాద్ధాంతం జరుగుతుంటే అయ్యప్పపై మరో వివాదం వెలుగు చూసింది.



మహిళ ప్రవేశంతో ఉద్రిక్తత

జనవరి 2వ తేదీన కనకదుర్గ (44), బిందు (42)లు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించి దర్శనం పొందడం మరోసారి ఉద్రిక్తతకు కారణమైంది. మహిళల దర్శనం తర్వాత ఆలయ శుద్ధి నిర్వహించడం వంటి పరిణామాలతో పరిస్థితి చేయి దాటింది.మరునాడు రాష్ట్రవ్యాప్త బందుకు హిందూ సంఘాలు పిలుపునివ్వడంతో రాళ్లు, నాటు బాంబులు విసురుకోవడం, పోలీసులు జన ఫిరంగులు, బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడం, ఇద్దరు చనిపోవడంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు 2500 మందిని అరెస్టు చేయడం, 1200 మందిపై కేసులు నమోదు చేశారు. ఉద్రిక్తతల నడుమ 47 ఏళ్ల మహిళ తన కుటుంబంతో అయ్యప్ప దర్శనం చేసుకున్నారని కేరళ సి ఎం ఓ ధ్రువీకరించింది.

జీవో 95 అమలు నిలిపేయండి

• హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ అధికారుల పదోన్నతులకు ప్రమాణాలు నిర్ణయించే వ్యవహారంలో సవరణలు చేస్తూ తెలంగాణ సర్కారు తేది 05.09.2018న జారీ చేసిన జీ వో 95 అమలును నిలిపివేయాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన హైకోర్టు ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 12 కు వాయిదా వేసింది. ఈ వ్యాజ్యాన్ని వరంగల్ జిల్లాకు చెందిన వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో) మోతె ప్రశాంత్ దాఖలు చేశారు.

దాసోజు శ్రవణ్‌కు కోర్టు సమన్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్ కుమార్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. 2013లో కెసీఆర్‌కు వచ్చిన ఫోన్ బెదిరింపు కేసులో కోర్టుకు హాజరు కావాలని ఆయనకు సమన్లు జారీఅయ్యాయి. 2013లో కెసీఆర్‌కు ఓ అగంతకుడి నుంచి వచ్చిన ఫోన్ బెదిరింపుల కేసులో అప్పటి టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్న దాసోజు శ్రావణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసు విచారణకు సంబంధించి కోర్టుకు హాజరుకావాలని దాసోజుకు సమన్లు జారీ ఆయ్యాయి.

మరో 24 మందికి అస్వస్థత

• చిట్యాల 'వెలుగు' గురుకులంలో ఫుడ్ పాయిజన్

• ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

భూపాలపల్లి, ప్రభ న్యూస్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం (వెలుగు)లో సోమవారం ఉదయం ప్రార్థన సమయంలో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై కిందపడిపోవడంతో వారిని 108 వాహనంలో చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. గతశనివారం గురుకులంలో రాత్రి భోజనం చేసిన అనంతరం అస్వస్థతకు గురై వాంతులు, కడుపు నొప్పితో బాధపడుతున్న 40 మంది విద్యార్థినులలో 22 మందిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. సోమవారం మరో 24 మంది అస్వస్థతకు గురికావడంతో జిల్లావ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ లలితా దేవి పర్యవేక్షణలో వారికి వైద్య సేవలు అందుతుండటంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ షరీఫ్, సీఐ శ్రీనివాస్, ఎస్సై అనీల్ కుమార్‌లు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పై వివరాలను తెలుసుకున్నారు. జిల్లా సాంఘికసంక్షేమ గురుకుల రీజనల్ కోఆర్డినేటర్ రమాదేవి గురుకులం సందర్శించి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యుతపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వైద్యులు అల్లం అప్పయ్య, విజిలెన్స్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆహార నమూనాలను ల్యాబ్‌కు పంపించారు.

పాములు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంట్లో పాములను బంధించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం చౌదరి గూడ గ్రామంలోని వెంకటాద్రి టౌన్‌షిప్‌లోని ఒక ఇంట్లో రెండు కొండ చిలువతో పాటు కట్ల పామును బంధించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకున్న అధికారులు దాడి చేశారు. రెండు పాములను స్వాధీనం చేసుకున్న అధికారులు షరన్ మోసెస్, వి. ప్రవీణ్‌లు స్నేహితులు మోసెస్ నెల రోజులుగా పాములను ఇంట్లో బంధించి ఆసక్తి కలిగిన వారికి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడు. కొనుగోలు దారులను ఆకర్షించేందుకు ప్రవీణ్ కొండ చిలువను మెడలో వేసుకుని ఫోటోలు దిగి ఫేస్‌బుక్, వాట్సప్‌లలో పోస్టు చేశాడు. దీంతో విషయం తెలుసుకున్న అధికారులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు.

'చంద్రబాబుది పబ్లిసిటీ జిమ్మిక్కు!'

తిరుమల ప్రభ న్యూస్: ఏపీ సీఎం చంద్రబాబు పనులు చేయకుండా పబ్లిసిటితో కాలం గడిపేస్తున్నారని తెలంగాణ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. ఆయన సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నెలల్లో దేశ రాజకీయ ముఖచిత్రం మారుతుంది, కేసిఆర్ నేతృత్వంలో ఫెడల్‌ఫ్రంట్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఎన్‌టిఆర్ స్థాపించిన తెలుగు దేశం పార్టి సిద్ధాంతాలను ప్రక్కనపెట్టి కాంగ్రెస్ వెంటనడుస్తుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ తెలుగు ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఆంధ్రా రాజకీయాలలో కేసిఆర్ కీలకపాత్ర పోషిస్తారనిఅన్నారు.

'సహకార' సమరానికి బ్రేక్!

• ఆరు నెలల పాటు పొడిగిస్తూ త్వరలో ఆర్డినెన్స్? • ఎన్నికల నిర్వహణపై ముఖ్యమంత్రి పునఃపరిశీలన • స్పష్టత ఇవ్వని సహకారశాఖ అధికారులు • పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసే అవకాశం • వచ్చేనెల 29తో ముగియనున్న పరపతి సంఘాల కాలపరిమితి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో సహకార ఎన్నికలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసేందుకు ప్రభుత్వం అంతర్గత ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇవి పార్టీలకు అతీతంగా జరిగే ఎన్నికలే అయినప్పటికీ, గ్రామస్థాయిలో రాజకీయ వ్యవస్థతో పెనవేసుకుని ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలపై తుదినిర్ణయం ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలనలో ఉంది. మార్చి మొదటి వారంలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు అధికార పార్టీ ఇప్పటినుంచే సంసిద్ధమవుతున్నందున సహకార ఎన్నికలపై వెనక్కి తగ్గినట్లు సమాచారం. సుమారు ఏడు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఎంతలేదన్నా ఆ ప్రక్రియ మే నెలాఖరు వరకు కొనసాగనుంది. ఆ తర్వాతే సహకార ఎన్నికలు నిర్వహిస్తే బాగుంటుందని మెజారిటీ ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో వాయిదా వేసేందుకే సీఎం మొగ్గు చూపు తున్నట్లు అధికారపార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి 29తో సహకార పరపతి సంఘాల కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో వారం రోజుల క్రితమే ఎన్నికల నిర్వహణకు సానుకూల సంకేతాలిచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం పునరాలోచనలో పడింది. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారులు ఓటరు జాబితాలు సిద్ధం చేసే ప్రక్రిను ప్రారంభించారు.

సీఎంవో నుంచి సంకేతాలు

తాజాగా వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్న తాధికారుల నుంచి సహకార శాఖకు సంకేతాలు అందాయి. అయితే ఈ విషయాన్ని సంబంధిత అధికారులెవరూ ధృవీకరించడం లేదు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం ఏర్పడిన పరిస్థితుల్లో సహకార చట్టంలో ఉన్న వెసులుబాటు మేరకు సాంకేతిక కారణాలు చూపి ఆర్డినెన్స్ ద్వారా గరిష్ఠంగా ఆరు నెలల పాటు పదవీ కాలాన్ని పొడిగించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఆ ప్రకారం సీఎం కేసీఆర్ మరో ఆరు నెలల పాటు పొడిగించాలని సూచన ప్రాయ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వచ్చే రెండు, మూడు రోజుల్లో ఆర్డినెన్స్ విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఇది ఐదోసారి...!

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తెలంగాణాలో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తున్న సహకార ఎన్నికలు మరోసారి వాయిదా వేయక తప్పని అనివార్య పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనని ప్రభుత్వం పరోక్షంగా సంకేతాలిచ్చింది. ఇప్పుడున్న పాలక మండళ్ళనే మరో ఆరు నెలలు కొనసాగించను న్నారు. ఒకవైపు ప్రజలు, ముఖ్యంగా రైతులు, మరోవైపు అధికార యంత్రాంగం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిమగ్నమై ఉండడంతో సంఘాల సభ్యత్వ నమోదు, ఓటుహక్కు అభ్యర్థనల పరిశీలన నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తయ్యే అవకాశాలు లేవు.

సమయం చాలకే ఈ నిర్ణయం

ఏ కోణంలో చూసినా ఎన్నికలు నిర్వహించేందుకు సమయం చాలని పరిస్థితి నెలకొంది. ఒకవేళ ఎన్నికలు నిర్వహించా లంటే ఇప్పటికే ఓటరు జాబితాలు సిద్ధం చేయాల్సి ఉంది. అందుకు ఎంత లేదన్నా రెండు నెలల సమయం అవసరమవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పుడున్న పాలక మండళ్ళను కొనసాగించక తప్పడం లేదు. ఇప్పటికే నాలుగు సార్లు గడువును పొడిగించడంతో న్యాయ సలహా తీసుకుని ప్యాక్స్ గడు వును మరో దఫా పొడిగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయనుంది.

45 రోజుల ముందే నోటిఫికేషన్

చట్టం ప్రకారం సంఘాల పదవీకాలం ముగిసే సమయానికి 45 రోజులు ముందుగా ఎన్నికల నోటి ఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. అంతకన్నా మూడు నెలల ముందుగా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ప్రక్రియ, పరిశీలన తుది జాబితాలు సిద్ధంచేసి బహిరంగంగా ప్రకటించాల్సి ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికలకు వెళితే రాజకీయ వ్యవస్థతో ముడి పెట్టుకుని ఉన్న క్షేత్ర స్థాయి పరపతి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నేప థ్యంలో సహకార ఎన్నికలను వాయిదా వేయాలన్న దిశగా సీఎం కేసీఆర్ యోచిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది.

ఆర్డినెన్స్ కాలపరిమితి ఆరు నెలలు

ప్రభుత్వానికుండే విచక్షణాధికారాల మేరకు ప్రాథమిక సహకార సంఘాల గడువు ముగిసిన తర్వాత గరిష్ఠంగా ఆరు నెలల్లోగా గడువును పొడిగిస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి మూడు సార్లు ఆర్డినెన్స్‌ల ద్వారా పదవీ కాలాన్ని పొడిగించేందుకు వీలుంది. ఆ తర్వాత తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని చట్టం చెబుతోంది. కానీ ప్రభుత్వం తలుచుకుంటే మంత్రి మండలి తీర్మానంతో మరోసారి గడువును పొడిగించే అధికారం ఉందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. అయితే, ఆ ఆర్డినెన్స్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టి సభ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సహకార సంఘాల గడువు పొడిగించనున్నారు.


ప్రత్యేకాధికారులు వద్దు : సీఎం

ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగించకుండా ఇప్పుడున్న పాలక మండళ్ళకే పగ్గాలు అప్పగించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. సహకార చట్టం ప్రకారం మూడేళ్ళ కాల పరిమితితో ఎన్నుకోబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పట్ల కేసీఆర్ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. గత ఏడాది కూడా ఫిబ్రవరితో ముగిసిన ప్యాక్స్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులను మరో మూడేళ్ళు పొడిగించాలన్న ప్రతిపాదనకు ఆయన సూచనప్రాయంగా అంగీకారం తెలిపినప్పటికీ అధికారుల సూచన మేరకు ఆర్డినెన్స్ ద్వారా పొడిగించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 903 సహకార సంఘాలకు ఓటే విధానాన్ని వర్తింపజేశారు.

ఆపరేషన్ స్మైల్‌పై అధికారులకు శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాలలను వెట్టి నుంచి విముక్తి కల్పించేందుకు గత మూడేళ్ళుగా రాష్ట్ర పోలీసు శాఖ నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్‌ను మరింత విస్తరించేందుకు పోలీసు శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం పలు జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ 2015నుంచి ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు ఏకకాలంలో పరిశ్రమలు, కర్మాగారాలు, చిన్న తరహా పరిశ్రమలపై దాడులను నిర్వహించి 22 వేల మంది బాలలను వెట్టి నుంచి విముక్తి కల్పించారు. కర్మాగారాల నుంచి విముక్తి కల్పించిన బాలలను వారి వారి స్వస్థలాలకు, కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలలు చదువుకోవాలి తప్ప పని చేయరాదన్న ఉద్దేశ్యంతో గత కొన్నాళ్ళుగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, పలు స్వచ్ఛంధ సంస్థలు పని చేస్తున్నాయి. తాజాగా జరిగిన శిక్షణా కార్యక్రమంలో మొత్తం 174 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో 8 మంది అదనపు ఎస్పీలు, 8 డీఎస్పీలు, 19 మంది ఇన్‌స్పెక్టర్స్, 90 మంది ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐడీ అదనపు డీజీ గోవింద్‌సింగ్, ఉమెన్‌సేఫ్టీ ఐజీ స్వాతి లక్రా, ఎస్పీ సుమతి, మహిళా, శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీ యునిసెఫ్ ప్రతినిధి ఫిలిప్స్, పాల్గొన్నారు.

కేంద్రం ఏమిచ్చిందో లెక్కలు చెప్పండి: కర్నె



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ఏమిచ్చిందో దత్తాత్రేయ లెక్కలతో సహా చెప్పాలని, దత్తాత్రేయకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నెప్రభాకర్ సవాల్ విసిరారు. సోమవారం మరో ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్‌తో కలిసి తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన తెలంగాణపై కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర వివక్షపై కేటీఆర్ వాస్తవాలు చెప్పారని, దత్తాత్రేయ దీనిని జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. దత్తాత్రేయ స్థాయికి తగ్గట్లు మాట్లాడాలన్నారు. అబద్దాలు మాట్లాడే నేతలు రాష్ట్రంలో ఉండడం దురదృష్టకరమన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, 24 గంటల కరెంట్ దేశమంతా ఎందుకు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలోని 17పార్లమెంట్ స్థానాల్లో బీజేపీకి డిపాజిట్లు గల్లంతుకావడం ఖాయమన్నారు. బీజేపీ మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని, రాజ్యాంగంపై కూడా నమ్మకం లేదని ఎద్దేవా చేశారు.

అమ్మా...నాన్న జాగ్రత్త!

• తమ వాళ్ల మాటలు గుర్తొచ్చి కన్నీరు పెడుతున్న బాధిత కుటుంబాలు

• తమిళనాడు మృతుల కుటుంబాల్లో మనసు పిండేస్తున జ్ఞాపకాలు



మెదక్, ప్రభ న్యూస్ బ్యూరో : అక్కడ ఎవరిని కదిపినా గుండెచెరువే... ఎటు చూసినా రోదనలే.. నేడోరేపో ఇంటికి వస్తారనుకున్నవారు విగతజీవులైనారని తెలిసిన వారు కన్నీరు మున్నీరవుతున్నారు. కడుపుకోతతో బాధపడుతున్న బాధితులను చూసి గ్రామాలు విషాదంలో మునిగిపోయాయి. తమ పిల్లలు శబరిమల వెడుతూ చెప్పిన మాటలు మననం చేసుకుని గుండెలవిసేలా రోదిస్తున్నవారిని చూసి అందరి మనసులు బరువెక్కుతున్నాయి. ''అమ్మా.. నాన్న ఆరోగ్యం జాగ్రత్త.. ఇంటికొచ్చిన చెల్లిని బాగా చూసుకో.. నేను అయ్యప్ప దర్శనానికి వెళ్లివస్తా.. త్వరలో ఇంటికి చేరుకుంటా.'' అంటూ చెప్పి వెళ్లిన తన కొడుకు చివరి మాటలను తలుచుకుంటూ గుండెలవిసేలా ఓ తల్లి రోదిస్తోంది. ఆమె కడుపుకోత చూసి అక్కడ అందరి కళ్లు చెమరుస్తున్నాయి. ''అమ్మా.. నాన్న ఎక్కడ.. దేవుడి దగ్గరికి వెళ్లివస్తానని చెప్పాడుగా.. మా నాన్న ఇంటికి వచ్చేస్తున్నాడు..'' అంటూ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నక్క ఆంజనేయులు కూతురు సిరి తన తల్లితో అంటుంటే వినేవారి గుండెలు పగిలిపోయాయి. తన తండ్రి ఇక తనతో ఉండడని తెలియని ఆ చిన్నారి ఏడుస్తున్న తల్లితో పై మాటలు అంటుంటే చూపరులు గుండెలు బాదుకున్నారు.

తమిళనాడులోని పుదుకొట్టై వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లా, నర్సాపూర్ మండలానికి చెందిన మంతూరు గ్రామ నివాసి శ్యామ్‌సుందర్‌గౌడ్ కన్నీటిగాథ.. ఆదివారం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో నర్సాపూర్ మండలం ఖాజిపేట, మంతూరు, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన 9 మంది దుర్మరణం చెందిన సంగతి విదితమే. మృతదేహాలను ఇక్కడికి తీసుకురావడానికి ఆదివారం సాయంత్రం నర్సాపూర్ తహసీల్దార్, సిఐ, టీఆర్ఎస్ నాయకులు మురళీయాదవ్ తరలివెళ్లారు. కాగా మృతదేహాలను అంబులెన్స్‌లో సోమవారం తరలించారు. మంగళవారం మధ్యాహ్నం వరకు మృతుల కుటుంబాలకు అందజేస్తారని అధికారులు తెలిపారు. అలాగే ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాజు, వెంకటేష్, నరేష్‌గౌడ్, భూమాగౌడ్, శ్రీశైలంలను విమానంలో హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

గర్భిణిపై దాడి

గర్భస్రావం... శిశువు మృతి

• బాలింత పరిస్థితి విషమం • అంగన్‌వాడీ దంపతుల దాష్టీకం



చికిత్స పొందుతున్న గర్బిణీ పద్మ

టేకులపల్లి, ప్రభ న్యూస్ : అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా ఇవ్వలేదని ప్రశ్నించిన ఆరు నెలల గర్భిణిపై అంగన్‌వాడీ ఆయా, ఆమె భర్త దాడి చేసి పొట్టపై కాలితో తన్నడంతో ఆమెకు గర్భస్రావమైంది. పుట్టిన శిశువు మరణించగా బాలింత పరిస్థితి విషమంగా ఉంది. చిన్నారులను, గర్భిణిలను కంటికి రెప్పలా చూసి వారి ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ వారిని అప్రమత్తం చేసే అంగన్‌వాడీ సిబ్బంది దాష్టీకం ప్రాణాల మీదకు తీసుకువచ్చింది. పిల్లలను ఎందుకు సక్రమంగా చూడటం లేదని అంగన్‌వాడీ ఆయాను ప్రశ్నించిన ఓ గర్భిణిపై ఆయా అక్కసు పెంచుకుంది. భర్తకు చరవాణి ద్వారా సమాచారం అందించి అంగన్‌వాడీ కేంద్రానికి పిలిచి మరీ దాడి చేయించింది. అప్పటికీ కోపం పట్టలేకపోయిన ఆయా తాను కూడా దాడి చేసింది.

టేకులపల్లి ఎస్సై గడ్డం ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బద్దుతండా పంచాయతీ మద్దిరాలతండాకు చెందిన భాదావత్ లచ్చు, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ప్రస్తుతం పద్మ ఆరునెలల గర్భిణి. ఆమె ఇద్దరు కుమార్తెలను తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తోంది. కొన్ని రోజులుగా అంగన్‌వాడీ కేంద్రంలో తన పిల్లలకు గుడ్లు పెట్టడం లేదని తెలుసుకుని ఎందుకు అలా చేస్తున్నారని అంగన్‌వాడీ ఆయా మాళోత్ నీలను అడిగింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆయా నీల భర్త మాళోత్ వీరుకు చరవాణి ద్వారా అంగన్‌వాడీ కేంద్రానికి రావాలని కోరింది. అక్కడకు చేరుకున్న వీరు నీలతో పాటు పద్మపై దాడిచేశాడు. పద్మకు విపరీతంగా రక్తస్రావం కావడంతో స్థానికులు సులానగర్ పీహెచ్‌సీకి తరలించారు. శిశువు మృతదేహానికి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పంచనామా నిర్వహించారు. టేకులపల్లి ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్ గర్భిణి భర్త లచ్చు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణతంత్ర వేడుకల్లో

తెలుగు శకటాలకు నో ఛాన్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తెలుగు శకటాలకు ఛాన్స్ దక్కలేదు. ఏటా ఈవేడుకల కోసం ఆయారాష్ట్రాలు ఎలాంటి నమూనా పంపుతున్నాయన్న దానిపై ముందుగానే రక్షణశాఖకు వివరాలు చెప్పాల్సి ఉంటుంది. అక్కడి అధికారులు డిజైన్‌ను ఆమోదించాక శకటాన్ని సిద్ధంచేసి పంపిస్తారు. నిపుణుల కమిటీ తుదిదశ పరిశీలన తర్వాత అంతా బాగుందనుకుంటే వాటికి పరేడ్‌లో అవకాశం కల్పిస్తారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ శకటం ఆఖరు వరకు అందరి మన్ననలు అందుకుంది. కానీ పరేడ్‌లో మాత్రం దానికి చోటు కల్పించకపోవడం ఆ రాష్ట్రప్రభుత్వాన్ని షాక్‌కు గురిచేసింది.

థీమ్‌తో శకటాలు

ఈసారి గణతంత్ర వేడుకల్లో గాంధీకి సంబంధించి థీమ్‌తో శకటాలు ఉండాలని భావించారు. అందుకు తగ్గట్లుగా సమూనాలు పంపాలని రక్షణశాఖ నాలుగు మాసాలకిందటే రాష్ట్రాలకు సూచించింది. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం విజయవాడ గాంధీకొండ, పొందూరు ఖద్దరు, పల్లిపాడు సత్యాగ్రహం మూడు అంశాలను తీసుకుని డ్రాయింగ్స్ రెడీచేసింది. తర్వాత వాటి త్రీడీ మోడల్‌ను, దానికి సంబంధించిన సంగీతాన్ని కూడా జతచేసి పంపారు. అంతా బాగుంది అనుకున్న డిజైన్‌ను రక్షణ శాఖ ఒప్పుకోలేదు. దీంతో ప్రభుత్వం నిరసన వ్యక్తం చేసింది.

తెలంగాణ శకటానికి


మరోవైపు తెలంగాణ శకటానికి కూడా ఈసారి రిపబ్లిక్ వేడుకల్లో అవకాశం దక్కలేదు. 2015వ సంవత్సరంలో బోనాలథీమ్‌తో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ శకటం 2016, 2017, 2018లో అవకాశం దక్కించుకోలేదు. 2016, 2017లో బతుకమ్మ థీమ్‌ను పంపగా, అది అధికారులను మెప్పించడంలో విఫలమైంది. కాగా 2018లో మేడారం జాతర థీమ్‌ను పంపించగా, అదికూడా అధికారులను మెప్పించలేదు. ఈ ఏడాది మహాత్మగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని ఆ థీమ్‌మీద శకటం తయారుచేయాల్సిందిగా కేంద్రంలోని అధికారులు రాష్ట్రాలకు సూచించారు. మహాత్మగాంధీ మీద అధికారులు తయారుచేసిన శకటం అక్కడి అధికారులను ఆకట్టుకోలేకపోయింది. దీంతో మరోసారి తెలంగాణ శకటానికీ అవకాశం దక్కలేదు. దీంతో ఢిల్లీ తీరుపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 8 జనవరి 2019

అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు మంచిదే కానీ...

అగ్రవర్ణాల్లో వార్షికాదాయం ఎనిమిది లక్షల కన్నా తక్కువ ఉండే కుటుంబాలకు చెందిన వారికి విద్యా, ఉద్యోగ రంగాల్లో పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మిశ్రమ స్పందన లభించింది. ఇంతకాలానికి ప్రభుత్వంలో కదలిక వచ్చిందని అగ్రవర్ణాల పేదలు హర్షామోదాలు వ్యక్తం చేస్తున్నట్టే, ఎన్నికల్లో ఓట్లు దండు కోవడానికి మోడీ ప్రభుత్వం హడావుడిగా ఈ నిర్ణయం తీసుకుందనీ, ఇది అమలులోకి రావడం అనుమానమేనని మరికొన్ని వర్గాలు పేర్కొం టున్నాయి. ఇది రాజకీయ నిర్ణయం అన్న మాటల్లో రెండో అభిప్రాయం లేదు. అయితే, ఎంతో కాలంగా ఆర్థికంగా వెనకబడిన వర్గాలు చేస్తున్న డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడాన్ని స్వాగతించా ల్సిందే. అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తామని బిజేపీ గతంలో పలుమార్లు వాగ్దానం చేసింది. అయితే, సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వల్ల ఇది సాధ్యం కాలేదు. యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ ఈ ప్రతిపాదన పరిశీలనలోకి వచ్చింది. అయితే, యూపీఏలో కీలక భాగ స్వామ్య పక్షాలైన డిఎంకె, ఆర్‌జెడి (లాలూ పార్టీ), ఆ కూటమికి బయ టి నుంచి మద్దతు ఇచ్చిన సమాజ్ వాదీ పార్టీలు వ్యతిరేకించడం వల్ల వెనకడుగు వేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ఈ నిర్ణయాన్ని ఎన్నికల గిమ్మి క్‌గా కొట్టి వేసింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నాలుగు సంవత్సరాల ఎనిమిది మాసాలను వృధా చేసి ఉండేది కాదని కాంగ్రెస్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ వ్యాఖ్యానించారు. అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లను ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ ఆచరణ సాధ్యం కాదని కొట్టివే శారు. ఈ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని సవరించే బిల్లును రాజ్యసభలో ఆమోదింపజేసుకునేందుకు తగినంత మెజారిటీ బిజేపీకి ఇప్పటికీ లేనందున ఈ అనుమానాలూ, విమర్శలూ పుట్టుకొస్తున్నాయి. ఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా దాని వెనక రాజకీయ కారణాలు ఉంటాయి. అలాగే, దానిని అమలు జరపడంలో ఇబ్బందులూ ఉండే మాట నిజమే . అన్ని రకాల రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ రిజర్వేషన్లు చెల్లుబాటు అవుతాయా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వీటిని నివృత్తి చేయడం కోసమే రాజ్యాంగంలోని 15,16 అధికరణాలను సవరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అది మంచిదే కానీ,అందుకు తగిన వ్యవధి ఉంటుందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గడువులేకపోతే ఆర్డినెన్స్ మార్గం ఎలాగూ ఉంది. ఎన్నికలలోపు ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించకపోతే అదే ఏకైక మార్గం. ముస్లిం మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) ప్రభుత్వ డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించినట్టు లేదు. మైనారిటీల రిజర్వేషన్లకోసం తెరాస చాలా పట్టుదలతో ఉంది. రిజర్వేషన్లు అనేవి తేనెటీగల తుట్టె వంటివి. వాటిని కదిలిస్తే ఎంత ప్రమాదకరమో ప్రభుత్వానికి తెలియంది కాదు. అయితే, రాజకీయ ప్రయోజనాల కోసం అన్నిపార్టీల వారూ రిజర్వేన్లపై వాగ్దానాలను గుప్పించడం, చివరికి వాటిని అమలు జేయలేకపోవడం చూస్తున్నాం. సమాజంలో అట్టడుగు వర్గాలు తరతరాలుగా అణచివేతకు గురైన దృష్ట్యా వారికి రిజర్వేషన్లకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ బద్ధత కల్పించారు. ఇతర వెనకబడిన కులాలకు 27 శాతం రిజర్వేన్లు కల్పించారు. కర్నాటక, తమిళ నాడులలో వెనకబడిన తరగతులకు రిజర్వేషన్లను కల్పించడంవల్ల వీటి శాతం 69కి పెరిగింది. కర్నాటకలో దేవరాజ్ అర్స్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రిజర్వేషన్ల శాతాన్ని 69కి పెంచారు. అవి కోర్టు ముందు చెల్లుబాటు కాకపోవడంతో కొత్తగా కల్పించిన రిజర్వేషన్లను రాజ్యాంగం లోని 9వ షెడ్యూల్‌లో చేర్చారు. ప్రతిరాష్ట్రం రిజర్వేషన్ల సమస్య వచ్చిన ప్పుడల్లా 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూనే ఉంది. రాష్ట్రాలు కోరినప్పుడు అందరి డిమాండ్లు అంగీకరించడం సాధ్యం కాదని స్పష్టం చేసిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు పది శాతం రిజర్వేషన్లను ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌కు కేటాయించాలన్న నిర్ణయం లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల్లో అగ్రవర్ణాల ఓట్లకు గాలం వేయడం కోసమేనన్న విమర్శలు వచ్చాయి. ఈ కొత్త రిజర్వేషన్ల వల్ల తమ కోటాలో కోత వస్తుందేమోనన్న భయాలు వెనకబడిన తరగతుల్లో వ్యక్తం అవుతున్నాయి. షెడ్యూల్డు కులాలకు చెందిన అధికారులు ఈ కొత్త రిజర్వేషన్ల వల్ల తమ వారి రిజర్వేషన్లకు ఎటువంటి ఢోకా ఉండదని స్పష్టం చేస్తూనే, ఇది ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. సాలుసరి ఆదాయం 8 లక్షల రూపాయిల కన్నా తక్కువ ఉన్న వారికే వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అలా కటీఫ్ చేయడం చాలా కష్టమనీ, దీనివల్ల బోగస్ సర్టిఫికెట్లు పుట్టుకొచ్చే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. ఇది కూడా కాదనడానికి లేదు. అసలు మన దేశంలో ఏ సవరణ తీసుకుని వచ్చినా, దానిని సానుకూల దృక్పథంతో పరిశీలించే వారి కన్నా వ్యతిరేకించేవారే ఎక్కువ. రిజర్వేషన్లకు పేదరికాన్ని ప్రామాణికంగా తీసుకో వాలని అధికారంలోకి వచ్చేందుకూ,అధికారాన్ని నిలబెట్టుకునేందుకూ ప్రతి పార్టీ వాగ్దానం చేయడం మామూలే కానీ, దానిని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించిన దాఖలాలు చాలా తక్కువ. ఆ కోణం నుంచి చూసినప్పుడు మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని తీసుకున్నందుకు అభినం దించాల్సిందే. దేశంలోని వివిధ సామాజిక వర్గాల నుంచి రిజర్వేషన్ల కోసం డిమాండ్ పెరగడానికి పేదరికమే ప్రధాన కారణం. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత దేశంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ సంక్షేమ పథకాలకోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నా, లబ్ధిదారులకు చేరడంలేదు. తమ సంక్షేమ పథకాల సబ్సిడీ పంపిణీని ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల 90 వేల కోట్ల రూపాయిలను ఆదా చేయగలిగిందనీ, ఈ సొమ్మును కొత్తగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలకు వెచ్చించేందుకు వీలు కలిగిందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కొత్తగా ఓ ప్రకటన చేశారు. సబ్సిడీ సొమ్ము దుర్వినియోగం కాకుండా అరికట్టడం మంచిదే కానీ, ప్రభుత్వం తరఫున జరిగే కార్యక్రమాలకూ, ప్రభుత్వం విడుదల చేసే వాణిజ్య ప్రకటనలకూ అయ్యే ఖర్చును కూడా ఆదాచేస్తే ఇంతకు ఎన్నో రెట్ల కోట్ల నిధులు అందుబాటులోకి వస్తాయన్న వా స్తవాన్ని ప్రభుత్వం గ్రహిస్తే మంచిది. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటు తదుపరి సమావేశాల్లో పెట్టేందుకు వీలుగా రాజ్యసభ సమావేశాలను బుధవారం వరకూ పొడిగించారు. బిల్లు ప్రవేశపెట్టడం వరకే వీలవుతుంది. ఆమోదం పొందడం వచ్చే సమావేశాలకే. అప్పుడు వీలవుతుందా?

త్రివిధ దళాలకు కొత్త శక్తులు!



డోక్లాం అనుభవం తరువాత, ప్రాంతీయ రక్షణాత్మక భద్రతపై మరింత దృష్టి కేంద్రీకరించాలనే పరిస్థితి ఏర్పడడంతో 2018లో భారత్ తన సాయుధ దళాల నిర్మాణంలో, ఆయుధ సంపత్తి సమకూర్చుకోవడంలో, మొత్తంగా సైన్యాన్ని ఆధునీకరించాలనే సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సంస్కరణలకూ గడిచిన ఏడాది మోక్షం కలిగింది. దీంతో భారత త్రివిధ దళాల బలోపేతానికి కీలక చర్యలకు 2018లోనే తొలి అడుగు పడింది. అయితే రూ.58 వేల కోట్ల విలువైన రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంలో అక్రమాలు జరిగాయని, దీనికి ప్రధాని నరేంద్రమోడీ నేరుగా బాధ్యత వహించాలనే విపక్షాల ప్రచారం భారత సైనిక నైతిక సామర్థ్యంపైనా పడిందని చెప్పాలి.

డోక్లాంతో పునరాలోచన.. చైనాలోని స్వయంప్రతిపత్తి ప్రాంతమైన టిబెట్‌లో, దీనికి సమీపంగా ఉన్న డోక్లాంలో డ్రాగన్ దేశం భారీగా కల్పిస్తున్న మౌలిక సౌకర్యాలు భారత్‌నుసైతం పునరాలోచనలో పడేశాయి. దీంతో చైనా - భారత్ సరిహద్దుల్లోని 3,600 కిలోమీటర్ల పొడవునా రహదారులు, వంతెనల నిర్మాణం, ఈ ప్రాంతాల్లోని మిలటరీ వైమానికస్థావరాలను బలోపేతం చేయడం, నిఘా వ్యవస్థను పెంపొందించడాన్ని మోడీ ప్రభుత్వం వేగవంతం చేసింది. డోక్లాం సంక్షోభం తరువాత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆధ్వర్యంలో డిఫెన్స్ ప్లానింగ్ కమిటీని ఏర్పాటు చేయడం 2018 సంవత్సరంలో కీలక పరిణామంగా చెప్పాలి. ఈ కమిటీలో విదేశాంగ కార్యదర్శి, త్రివిధ దళాల అధిపతులు సభ్యులుగా ఉంటారు. దోవల్ నేతృత్వంలోని ఈ డిఫెన్స్ ప్లానింగ్ కమిటీ జాతీయ భద్రతా వ్యూహాలు, దేశం ముందున్న సైనికపరమైన సవాళ్లు వంటి వాటిపై ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుంది.

ఆధునీకరణ వైపుగా.. ఇక గడిచిన సంవత్సరంలో పాకిస్థాన్, చైనా సరిహద్దుల వెంబడి భద్రతాపరమైన సవాళ్లు, చొరబాట్లు, ఉగ్రవాదుల దాడులను మరింత సమర్థవంతంగా ఎదుర్కొనడానికి, భారత సైన్య పోరాట పాటవాలను మరింత మెరుగు పర్చడానికి కీలక కీలక సంస్కరణలు తీసుకొని రావాలనే నిర్ణయం తీసుకున్నారు. కొన్ని దశాబ్దాలుగా భారత సైన్యంలో సంస్కరణలు తీసుకొని రావాలనే డిమాండ్‌కి తొలి అడుగు గత ఏడాదే పడింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సైనిక వ్యవస్థ పరిమాణాన్ని తగ్గించడం, అదే క్రమంలో సైనిక పాటవాన్ని మరింతగా ఆధునీకరించడం, అత్యంత ఆధునిక ఆయుధాలను సమకూర్చడం, ఆధునిక యుద్ధ వేదికలను సమాత్తం చేయడం ఈ సంస్కరణల్లో కీలకమైనవి.

సవాళ్లు సరే.. బడ్జెట్‌లో పెంపు ఏదీ? సైన్యాన్ని ఆధునీకరించే ప్రక్రియలో భాగంగా లైట్ మెషిన్ గన్నులు, బాటల్ కార్బైన్స్, అసాల్ట్ రైఫిల్స్ వంటి వాటిని దాదాపు రూ.40 వేల కోట్లతో కొనుగోలుకి ఎన్డీయే ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పాత కాలానికి చెందిన ఆయుధాలు, బూజుపట్టిన యుద్ధ పరికరాల స్థానంలో అత్యాధునిక ఆయుధ సంపత్తిని భారత సైన్యానికి సమకూర్చాలనే చిరకాల కోరిక నెరవేరిన సంవత్సరంగా 2018 చరిత్రలో నిలిచిపోతుంది. అయితే భారతసైన్యాన్ని ఆధునీకరించాలనే కల పూర్తిస్థాయిలో సాకారం కావడానికి నిధుల లేమి వెన్నాడుతోంది. గత మార్చిలో పార్లమెంటరీ స్థాయి సంఘానికి భారత సైన్యం ఒక నివేదిక సమర్పించింది. పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్ తమ సైనిక సామర్థ్యాన్ని వ్యయానికి వెరువకుండా రోజురోజుకీ పెంచుకుంటూ పోతున్నప్పటికీ భారత సైన్యం కేవలం నిధుల లేమి కారణంగా చేతులు ముడుచుకొని కూచోవాల్సి వస్తోందని ఆ నివేదికలో ఆవేదన వ్యక్తం చేసింది. అధికారిక గణాంకాల ప్రకారం ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సు సంయుక్తంగా 2018-19 బడ్జెట్‌లో రూ.1.60 లక్షల కోట్లు కేటాయించాలని కోరితే, కేవలం రూ.83,434 కోట్లు మాత్రమే కేటాయించారు.

ఈ ఏడాదిలోనే ఆర్మీ ఎమ్ 777 హోవిట్జర్, కే9 వజ్ర వంటి ఆధునిక ఆయుధాలను సమకూర్చుకుంది. 1980ల్లో బోఫోర్స్ గన్లు భారత ఆయుధగారంలోకి చేరిన తరువాత ఆ స్థాయిలో పోరాట సాధనాలు ఆర్మీకి అందడం గత ఏడాదే జరిగింది. ఇక పదేళ్లుగా 2,600 యుద్ధ వాహనాలను ఆర్మీకి అందివ్వాలనే డిమాండ్ ఇప్పటికీ కలగానే మిగిలిపోయింది. రూ.60 వేల కోట్ల వరకు వ్యయం అయ్యే యుద్ధ వాహనాల వినిగియోగం, అవసరాలపై సైన్యంలో భిన్నాభిప్రాయాలుండడం దీనికి కారణమని సైనిక వ్యవహారాల నిపుణులంటున్నారు. ఇక విధానపరమైన జాప్యంతో స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయదలుచుకున్న ఆధునిక యుద్ధ ట్యాంకుల ప్రతిపాదన కూడా గడిచిన ఏడాదిలోనూ ఎక్కడ వేసిన గొంగళిలా ఉండిపోయింది.

తాట తీసిన సైన్యం..! జమ్ము, కాశ్మీర్‌లో ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు, కాలుదువ్వే ప్రయత్నాలు చేయకపోయినా దాయాది దేశం పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో పాటు సరిహద్దుల వెంబడి తీవ్రవాదాన్ని ప్రోత్సహించడంపై భారత సైన్యం 2018లో గట్టి సమాధానమే చెప్పింది. మన సైన్యం సత్తా ఏంటో పొరుగు దేశానికి రుచి చూపించింది. భారత్, చైనా దళాలు ఏడవ సైనిక పాటవ ప్రదర్శన నిర్వహించినా డోక్లాం గొడవతో అవి అర్ధాంతరంగా ఆగిపోయాయి.

తీరంలో అప్రమత్తత! ఇటు నేవీ వైపు కూడా 2018 సంవత్సరం ఆశాజనంగానే ఉందని చెప్పాలి. భారత తీరాల్లో నేవీ 35 సైనిక విన్యాసాలను నిర్వహించింది. ప్రతి రోజు సగటున 33 భారత నేవీ యుద్ధ నౌకలు మోహరించినట్లు అధికారిక సమాచారం వెల్లడిస్తోంది. హిందూ మహాసముద్రంలోని సీషెల్స్ దీవుల వద్ద నేవీ స్థావరాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనకి ఎన్డీయే ప్రభుత్వం 2018లోనే వచ్చింది. నేవీ ఆధునీకరణకి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. 56 కొత్త నౌకలతో పాటు, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 32 షిప్పులను భారత నావికాదళంలోకి చేర్చనున్నారు. 2050 నాటికి భారత నేవీ 200 యుద్ధ నౌకలతో, 500 విమానాలతో ప్రపంచస్థాయి సముద్ర బలంగా తయారవుతుందని నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబా గత డిసెంబర్‌లో ప్రకటించారు. ప్రస్తుతం భారత నేవీ వద్ద 130 యుద్ధ నావలున్నాయి. ఇక ఐఎన్ఎస్ అరిహంత్ వంటి అణ్వాయుధ జలాంతర్గామి ఇండియన్ నేవీలో చేరడం కీలక పరిణామంగా చెప్పాలి.

అగ్రరాజ్యంతో సైనిక సాన్నిహిత్యం! 2018వ సంవత్సరం సైనికపరంగా మరో కీలక ఘట్టానికి వేదికైంది. సమాచార, సమతుల్య, భద్రతా ఒప్పందం భారత్ - అమెరికా మధ్య కుదరడం సైనిక పరమైన విశేషంగా చెప్పాలి. ఈ ఒప్పందం కింద అమెరికా నుంచి భారత సైన్యం కీలకమైన మిలటరీ టెక్నాలజీ బదలాయింపు సాధ్యమవుతుంది. దీంతో పాటు అమెరికా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సేవలు కూడా భారత సైన్యానికి అందుబాటులోకి వస్తాయి.

గగనతలంలో ముందడుగు.. ఇక భారత వాయుసేన కూడా కీలక నిర్ణయాలను తీసుకొంది. భారత గగనతల పరిరక్షణ కోసం గత ఏప్రిల్‌లో 13 రోజుల పాటు వైమానిక విన్యాసాలను నిర్వహించింది. పాకిస్థాన్, చైనా దేశాలు యుద్ధానికి సిద్ధమైతే అలాంటి పరిస్థితిని ఎదుర్కొనడానికి తాము సైతం సంసిద్ధంగా ఉన్నట్లు వాయుసేన తన పాటవ ప్రదర్శన ద్వారా నిరూపించింది. ఈ ఏడాదే భారత వాయుసేనకి మరో శుభవార్త అందింది. రష్యా నుంచి ఎస్-400 డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ కొనుగోలుకి మోడీ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. ఈ ఢిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్‌తో భారత వాయు సేన యుద్ధ సామర్థ్యం ఎన్నో రెట్లు పెరుగుతుందని రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు. ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా రాఫెల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేయాలనే దీర్ఘకాలిక ఆకాంక్షకి గత ఏడాదే తొలి అడుగుపడింది. 114 రాఫెల్ యుద్ధ విమానాలు త్వరలోనే వాయుసేన ఆయుధ భండాగారంలోకి చేరనున్నాయి.

ముందడుగు పడని ప్రైవేటు భాగస్వామ్యం! రక్షణ రంగానికి అవసరమైన మౌలిక సౌకర్యాలు, యుద్ధ సాధనా సంపత్తిని వ్యూహాత్మక భాగస్వామ్య విధానంలో రూపొందించాలనే కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ బలమైన ఆకాంక్ష గత ఏడాది పెద్ద ఫలించలేదనే చెప్పాలి. ఈ వ్యూహాత్మక భాగస్వామ్య విధానం కింద చెప్పుకోదగ్గ ఒప్పందాలేవీ కుదరలేదు. ఈ విధానం కింద విదేశీ రక్షణ రంగ సంస్థల సాంకేతిక సహకారంతో జలాంతర్గాములు, యుద్ధ విమానాలు వంటి ఆయుధ సంపత్తిని దేశీయ కంపెనీల భాగస్వామ్యంతో తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆచరణలో ఆ దిశగా కీలకమైన అడుగులు 2018లో పడలేదని చెప్పాలి.

-ఏ.జి.దత్తా

ఆధిపత్య పోరులో పోలికలు!

ఆనాడు జర్మనీ వర్సెస్ బ్రిటన్, ఇప్పుడు చైనా వర్సెస్ అమెరికా



హిట్లర్‌తో నెవేలీ చాంబర్లిన్



జిన్‌పింగ్, ట్రంప్

అన్ని రంగాల్లో అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టడమే తన లక్ష్యమన్న నినాదానికి అనుగుణంగానే ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ విదేశాంగ విధానాన్ని అమలు జేస్తున్నారు. ఆధునిక కాలంలో అన్ని దేశాల విదేశాంగ విధానాలు వాణిజ్య సంబంధాల ప్రాతిపదికపైనే రూపుదిద్దుకుంటున్నాయి. అమెరికా, చైనాల మధ్య వైరం ఏర్పడటానికి వాణిజ్యంలో ఎగుడుదిగుడులే కారణం. ట్రంప్ అధికారంలోకి వచ్చిన వెంటనే చైనాతో వాణిజ్యం పెరగాల్సిన అవసరం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. ఆర్థిక సంస్కరణల అమలు తర్వాత చైనా స్వయం పోషకత్వానికి ప్రాధాన్యం ఇస్తోంది. దాంతో సహజంగానే అమెరికా నుంచి దిగుమతులు తగ్గించేసింది. వాణిజ్య రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని తిరిగి నిలబెట్టేందుకు ట్రంప్ చర్యలు తీసుకుంటున్నారు. ఆర్థిక, వాణిజ్య రంగాల్లో చైనా దూసుకుని పోవడమే అమెరికా గుర్రుకు కారణం. చైనా ఆర్థికాభివృద్ధి అంతా మోసం, దగా అని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం 19వ శతాబ్దం నాటి జర్మనీ, గ్రేట్ బ్రిటన్‌ల మధ్య జరిగిన వాణిజ్య యుద్ధం గుర్తుకు వస్తోంది. ఆర్థిక రంగంలో ప్రపంచీకరణ, సాంకేతిక పరిజ్ఞాన పరిశోధనా ఫలితాల వెల్లువ నేపథ్యంలో ఆనాడు జర్మనీ, గ్రేట్ బ్రిటన్‌ల మధ్య ఆర్థిక వాణిజ్య వైరం నడిచినట్టే ఇప్పుడు అమెరికా, చైనాల మధ్య వైరం నడుస్తోంది. అంతర్జాతీయంగా స్వేచ్ఛా మార్కెట్ విధానం అమలులోకి రావడంతో దేశాల మధ్య పోటీ పెరిగింది. అప్పట్లో జర్మనీ క్రమంగా ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. దానిని చూసి గ్రేట్ బ్రిటన్ గుర్రు పెంచుకున్నట్టే, ఇప్పుడు చైనాను చూసి అమెరికా ఈర్ష్యపడుతోంది. అప్పట్లో రష్యా వ్యూహాత్మకంగా ప్రధాన పాత్ర వహించింది. ఇప్పుడు భారత్ ఆ స్థానంలో ఉంది.

పారిశ్రామికంగా జర్మనీ అభివృద్ధి 1850లో ప్రారంభమైంది. గ్రేట్ బ్రిటన్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన వందేళ్ళకు జర్మనీ అభివృద్ధి బాట పట్టింది. చైనా 1979లో మావోయిజం స్తబ్దత తర్వాత డెంగ్ హయాంలో ఆర్థిక సంస్కరణలు అమలులోకి వచ్చాయి. ఆనాడు జర్మనీ మాదిరిగానే, ఇప్పుడు చైనా కూడా ప్రభుత్వ ఆర్థిక, సాంకేతిక వృద్ధితోనే ఆర్థికాభివృద్ధి ముడిపడి ఉందని విశ్వసించింది. జర్మనీ అభివృద్ధి వేగం అప్పట్లో బ్రిటన్ లోని పెద్దలను కలవర పర్చినట్టే, ఇప్పుడు చైనా స్పీడ్‌కు అమెరికా పెద్దలు కలవర పడుతున్నారు. స్థూల జాతీయోత్పత్తిలో కూడా ఆనాడు జర్మనీ దూసుకుని పోయినట్టే ఇప్పుడు చైనా దూసుకుని పోతోంది. అయితే, ఆనాడు బ్రిటన్ పౌరుల కన్నా జర్మనీ, ఇప్పటి చైనా పౌరులు పేదలుగా ఉన్నారు. సంపద పెరుగుతున్నా అది కొద్దిమంది లేదా కొన్ని వర్గాల చేతుల్లో కేంద్రీకృతం కావడం అప్పుడు

జర్మనీలోనూ, ఇప్పుడు చైనాలోనూ సారూప్యంగా ఉన్న అంశం. ఆనాడు జర్మనీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందినట్టే ఇప్పుడు చైనాలోనూ అమెరికాకు దీటుగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందుతోంది. ఇందుకు తాజా ఉదాహరణ అమెరికా కంటే ఎన్నో రెట్లు శక్తివంతమైన బాంబును చైనా తయారు చేసింది. అమెరికా బాంబు కంటే ఎన్నో రెట్లు శక్తివంతమైన అణు రహిత బాంబును తయారు చేసినట్టు చైనా నార్త్ ఇండస్ట్రీస్ గ్రూపు కార్పొరేషన్ వెబ్ సైట్ లో పేర్కొంది. ఆనాడు జర్మనీ సాధించిన శాస్త్ర, సాంకేతికాభివృద్ధిని బ్రిటిష్ పెద్దలు మోసం, దగా అని అభివర్ణించినట్టే ఇప్పుడు చైనా సాధించిన అభివృద్ధిని చూసి ట్రంప్ ఓర్వలేక మోసం, దగా అంటున్నారు.

ఆనాటి జర్మనీ పరిస్థితికీ, ఇప్పుడు చైనా పరిస్థితికీ పోలికలు ఇంకా చాలా ఉన్నాయి. శతాబ్దం క్రితం ఆనాటి జర్మనీ నాయకత్వం వెయ్యి మైళ్ళ రైలు మార్గాన్ని బ్రిటన్ నౌకా మార్గ ఆధిపత్యాన్ని అధిగమించేందుకు నియమించింది. రైలు మార్గం బెర్లిన్ నుంచి బాగ్దాద్ వరకూ, అలా పెర్షియన్ గల్ఫ్ వరకూ నిర్మించింది. ఈ రైలు మార్గం నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేయాల్సిందిగా అప్పట్లో జర్మనీ జాతీయ ఆర్థిక సంస్థలపై ఒత్తిడి తెచ్చింది. బ్రిటిష్ నౌకా రవాణను అధిగమించడం ఒక్కటే ఆనాటి జర్మనీ లక్ష్యం కాదనీ, పశ్చిమాసియాతో సాన్నిహిత్యాన్ని పెంచుకోవడమని విశ్లేషకులు పేర్కొన్నారు. అదేమాదిరిగా ఇప్పుడు చైనా తలపెట్టిన మహామార్గం (ఒన్ బెల్ట్, ఒన్ రోడ్డు ప్రాజెక్టు) ప్రాజెక్టు కూడా చైనా ఆర్థిక ప్రయోజనాల కోసమే. 2013 లో జిన్ పింగ్ ఈ ప్రాజెక్టును సాధారణ ప్రాజెక్టుగా ప్రకటించారు. కానీ ఇది ఈ ప్రాజెక్టు ఈ శతాబ్దపు ప్రాజెక్టు అని చైనా ప్రచారం చేస్తోంది. అందుకు తగినట్టుగానే అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణాలను సేకరిస్తోంది. ఇందుకు ఆయా సంస్థలపై ఒత్తిడి తెస్తోంది. చైనా మార్షల్ ప్లాన్‌ను న్యూసిల్క్ రోడ్డుగా అభివర్ణిస్తున్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కూడా పోటీ అదే రీతిలో ఉంది. సాంకేతిక రంగంలో అమెరికాను దాటి పోవాలన్న లక్ష్యంతో చైనా పనిచేస్తోంది. ముఖ్యంగా ఇన్‌ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ రంగంలో చైనా అమెరికా

పోటీపడటాన్ని ఆనాటి జర్మనీ బ్రిటన్‌తో పోటీపడిన చందాన్ని గుర్తు చేస్తోంది. ఇటలీకి చెందిన మార్కోనీ బ్రిటన్ ప్రోద్బలంతో సాగర గర్భంలో కేబుల్ నెట్‌వర్క్‌ను కనుగొన్నారు. దానివల్ల బ్రిటన్ అంతర్జాతీయ ప్రసారాల్లో అన్ని దేశాలనూ అధిగమించింది. కైజర్ విల్ హెల్మ్ ఆధ్వర్యంలో ఇందుకు సమాంతర నెట్‌వర్క్‌ను జర్మనీ కనుగొంది. అప్పట్లో జర్మనీ దక్షిణ అమెరికా, ఆఫ్రికాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విక్రయించి ఆదాయాన్ని పెంచుకుంది. ఇప్పుడు చైనా కూడా అంతర్జాల నెట్ వర్క్‌ను పెంచుకోవడానికి కృషి చేస్తోంది. చైనా అమెరికన్ చిప్ తయారీ సంస్థలను అధిగమించేందుకు చిప్ తయారీ రంగానికి అధికంగా

నిధులు వెచ్చిస్తోంది. ఆనాడు జర్మనీ మార్కోనీ నాన్ ఇంటర్ కమ్యూనిషన్‌ను అభివృద్ధి పర్చినట్టే ఇప్పుడు చైనా కూడా నిఘాకు తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంది. హార్డ్ మౌలిక సదుపాయాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ విషయంలో కూడా చైనా దూసుకుని పోతోంది. బ్రిటన్ మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో జర్మన్ ప్రసార కేబిల్స్‌ని తెంపేసి తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. అయితే, అప్పట్లో జర్మనీ సాంకేతికరంగంలో దూసుకుని పోవడానికి ఇప్పుడు చైనా దూసుకుని పోవడానికి కొద్దిగా తేడా ఉంది. అప్పట్లో జర్మనీకి ఉన్న అవకాశాలు ఇప్పుడు చైనాకు లేవు. అప్పట్లో జర్మనీ తమ జనాభా కన్నా రష్యా జనాభా పెరిగిపోతోందని కలవరం చెంది జనాభా పెరుగుదలకు చర్యలు తీసుకుంది. ఇప్పుడు చైనా కూడా జనాభా విషయంలో భారత్ దూసుకుని పోతోందని గుబులుతో ఉంది. అందుకే ఒక కుటుంబానికి ఒకబిడ్డ మాత్రమేనన్న నిబంధనను ఎత్తివేసింది.

భారత్ అమెరికా, జపాన్‌లతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకోడం చైనాకు గుర్రుగా ఉంది. ఆనాడు జర్మనీ కూడా రష్యా, బ్రిటన్ల మధ్య పెరిగిన బంధాన్ని చూసి కలవర పడింది. అంతర్జాతీయంగానూ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి చైనా ఆనాడు జర్మనీ అనుసరించిన పద్దతులనే అనుసరిస్తోంది.

-స్వామి

'చుక్కల' చిక్కులకు పరిష్కారం

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో చుక్కల భూముల సమస్య పరిష్కారం కానుంది. దాదాపు 64 ఏళ్ల నుంచి రైతులు, రైతు కుటుంబాలు ఈ 'చుక్కల' చిక్కులతో అల్లాడుతున్నారు. ఈ చుక్కల వెనక పెద్ద కథే ఉంది. బ్రిటీష్ వారి హయాంలో 1906లో దేశవ్యాప్తంగా భూముల సర్వే జరిగింది. అ తర్వాత 1954లో రీ సర్వే చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మళ్లీ భూముల సర్వే గానీ, రీ సర్వే జరగలేదు. అందువల్ల భూమి హక్కులక ు సంబంధించి 1954 నాటి రెవెన్యూ రికార్డులే ప్రామాణికంగా ఉన్నాయి. 1954లో రీ సర్వే జరిగినప్పుడు రెవెన్యూ రికార్డుల్లో సర్వే నెంబర్ వారీగా భూమి హక్కుదారుల పేర్లు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం నమోదు చేశారు. అయితే, ఎవరూ యాజమాన్య హక్కు కోరని భూముల వద్ద రెవెన్యూ రికార్డుల్లో చుక్కలు (డాట్స్) పెట్టారు. అప్పటి నుంచి ఈ భూములను చుక్కల భూములు (డాటెడ్ ల్యాండ్స్)గా పిలుస్తున్నారు. 1954 తరువాత ఆ భూములను సాగు చేసుకునేవారికి ఎటువంటి యాజమాన్య హక్కులు లేవు. ఆ తరువాత భూముల రీసర్వే చేయకపోవడం వల్ల ఈ సమస్య వచ్చింది. వాటిని వారసత్వంగా బదిలీ చేయడానికి గానీ, అమ్ముకోవడానికి గానీ అవకాశం లేదు. అప్పటి నుంచి రైతులను ఈ చుక్కల చిక్కులు వెంటాడుతున్నాయి. వేధిస్తున్నాయి. ఆ భూములన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి. తాత, ముత్తాతల కాలం నుంచి దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్నవారికి కూడా యాజమాన్య హక్కులు లేకపోవడంతో అనేకమంది కోర్టులను ఆశ్రయించారు. ఈ కేసులను విచారించిన ధర్మాసనం, హక్కు పత్రాలున్న వారికి న్యాయం చేయాలని ఆదేశించింది. అప్పటి నుంచి ఈ సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఈ చుక్కల భూములు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 24 లక్షల ఎకరాలకు పైగా చుక్కల భూములు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్లు అంచనా. వీటిలో 17.7 లక్షల ఎకరాలను ప్రభుత్వం కొంతమందికి అసైన్ చేసింది. లక్షా 80 ఎకరాలను రైతులు సాగుచేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా వారు ఆ భూమిపై హక్కు కావాలని డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ సంస్కరణలలో భాగంగా రిజిస్ట్రేషన్ చట్టం -1908 లోని 22-ఎ1లో నిషేధిత ఆస్తుల జాబితా నుంచి చుక్కల భూములను తొలగిస్తూ 2017 జూలై 14న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం రైతుల ఆధీనంలో సాగులో ఉన్న చుక్కల భూములను మాత్రం ఆ తేదీ నుంచి ప్రైవేటు పట్టా భూములుగా పరిగణించవలసి ఉంది. అయితే వివిధ కారణాల వల్ల ఆ ఆదేశాలు అమలుకాలేదు. ఈ సమస్యపై మళ్లీ వేల సంఖ్యలో రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరిస్థితిని తీవ్రంగా పరిగణించి జనవరి 4న తనంతతానుగా ఈ సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం నూతన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలోని రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్లు పంపుతారు. ఆర్వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్)చట్టం ప్రకారం 1బి రిజిస్టర్ 2వ కాలమ్‌లో నమోదైన పట్టాదారు పేరుని సరిచూసుకొని తదనుగుణంగా 1బి రిజిస్టర్ 8వ కాలమ్ లో కొనుగోలు లేదా వారసత్వం లేదా వంశపారంపర్యం అని నమోదు చేసిన వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలమ్‌లో ఏమీ రాయక పోయినా పట్టాదారు భూమిగా పరిగణించి నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 8వ కాలమ్‌లో 1954కు ముందు ఇచ్చిన డి పట్టా, డికెటి పట్టా, అసైన్ మెంట్ భూములు అని నమోదు చేసినట్లైతే వాటిని కూడా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. 1954 తరువాత ప్రభుత్వం ఇచ్చిన భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగుతాయి.

చుక్కల భూములను స్వాధీనంలో ఉంచుకున్నవారు, సాగుచేసుకుం టున్నవారు ప్రభుత్వం నిర్ణయించిన పత్రాలలో ఏదో ఒకటి చూపిస్తే ఆ భూమి వారికి సంబంధించినదిగా భావించి రిజిస్టర్‌లో వారి పేరు నమోదు చేస్తారు. రిజిస్ట్రేషన్, లింకు డాక్యుమెంట్ పత్రాలు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రికార్డు ఆఫ్ హోల్డింగ్సు నమోదు చేసిన పత్రాలు, ఎన్‌కంబరెన్స్ పత్రం, 10(1) అకౌంట్, భూమి శిస్తు రసీదులు, రెవెన్యూ శాఖ జారీ చేసిన ఆర్‌వోఆర్ రికార్డు, న్యాయస్థానాలు, సంబంధిత అధీకృత అధికారి జారీ చేసిన ఉత్తర్వు ప్రతులు వంటి వాటిని రిజిస్టర్ కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుంది. 2017 జూలై 14వ తేదీకి ముందు 12 ఏళ్లు ఆధీనంలో ఉన్నట్లు ఏవైనా ఆధారాలు చూపినా రిజిస్టర్‌లో వారి పేరు నమోదు చేస్తారు. చుక్కల భూములకు సంబంధించి రైతులు ఫిర్యాదు చేసిన, రెవెన్యూ శాఖ వద్ద, తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలనలో ఉన్న వాటిని కూడా రెవెన్యూ సిబ్బంది తమంతట తాముగా పరిశీలిస్తారు. వాటికి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. చుక్కల భూములు పరిశీలన పూర్తి అయిన తరువాత తుది జాబితాని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు పెడతారు. వాటిలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే, తెలియజేస్తే రెవెన్యూ శాఖ వాటిని పరిశీలిస్తుంది. అభ్యంతరాల పరిశీలన తరువాత సవరించిన తుది జాబితాని ప్రకటిస్తారు. నిషేధిత భూముల నుంచి చుక్కల భూములతోపాటు ఇతర భూములను తొలగించి సెక్షన్ 22-ఎ1 (ఏ) టు (డి) కొత్త జాబితాని నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపుతారు. సెక్షన్ 22-ఎ1(ఇ) జాబితాని ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం దానిని గెజిట్‌లో ప్రచురిస్తుంది. ప్రభుత్వ ఆదేశాలు సక్రమంగా అమలు జరిగితే లక్ష మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. జనవరి 24వ తేదీ లోపల ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందువల్ల చుక్కల భూములు ఎక్కువగా ఉన్న జిల్లాలకు అదనంగా అధికారులను పంపించే అవకాశం కూడా ఉంది.

-శిరందాసు నాగార్జున, 9440222914

లోక్‌సభ సాక్షిగా అబద్ధాలా..?

- మొన్న హెచ్ఏఎల్‌కు లక్ష కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చామన్నారు
- ఇప్పుడు రూ.26 వేల కోట్ల ప్రాజెక్టులు ఓకే అయ్యాయంటున్నారు
- పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టిస్తారా?
- హెచ్ఏఎల్‌కు వేల కోట్ల ప్రాజెక్టులొస్తే.. జీతాల కోసం రూ.1000 కోట్ల అప్పులెందుకు..?
- రక్షణ మంత్రికి రాహుల్ సూటి ప్రశ్నలు..



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రిలయన్స్ డిఫెన్స్ అధినేత అనిల్ అంబానీకి మేలు చేసేందుకు మోడీ సర్కారు...ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)ను బలహీనపరుస్తోందని మండిపడ్డారు. విమానాల తయారీ కంపెనీని హెచ్ఏఎల్‌ను వ్యూహాత్మకంగానే బలహీనపరుస్తూనే రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ వేదికగా అబద్ధాలాడుతున్నారని విమర్శలు గుప్పించారు. హెచ్ఏఎల్‌కు ప్రభుత్వం లక్ష కోట్ల కాంట్రాక్ట్ ఇప్పించిందన్న నిర్మల వ్యాఖ్యలను ఖండిస్తూ రాహుల్ పై విధంగా స్పందించారు.ప్రభుత్వ రంగ విమానాల తయారీ సంస్థకు ప్రభుత్వం ఇప్పటికే 26 వేల కోట్ల ప్రాజెక్టులను అప్పగించిందని..మరో 73 వేల కోట్ల ప్రాజెక్టులు అందించేందుకు ప్రణాళికలు రచిస్తోందని లోక్‌సభలో సోమవారం నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనను ఖండిస్తూ రాహుల్ మండిపడ్డారు.

మాట మార్చేశారు..

నిన్న, మొన్నటి వరకు హెచ్ఏఎల్‌కు లక్షకోట్ల ప్రాజెక్టులు అప్పగించామని చెప్పుకొచ్చిన రక్షణ మంత్రి ... సోమవారం మాట మార్చి.. రూ.26 570 కోట్ల ప్రాజెక్టులు హెచ్ఏఎల్‌కు అప్పగించామని చెప్పడం అబద్ధం కాదా అని రాహుల్ ప్రశ్నించారు. హెచ్ఏఎల్ విషయంలో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తున్న క్రమంలోనే ఆ సంస్థ ఉద్యోగుల జీతాలు చెల్లించేందుకు మొదటి సారి ప్రభుత్వం రూ. 1000 కోట్లు అప్పుతీసుకుందని మీడియా కథనాలు వస్తున్నాయి. నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ రూ.20 వేల కోట్లను ఫ్రాన్స్‌కు చెందిన డసాల్ట్ ఏవియేషన్ కంపెనీకి భారత ప్రభుత్వం చెల్లించిం దని..అయినప్పటికీ ఫ్రాన్స్ కంపెనీ ఒక్క రాఫెల్ యుద్ధ విమానాన్ని పంపించలేకపోయిందని ఆరోపిం చారు. హెచ్ఏఎల్‌కు వేల కోట్ల ప్రాజెక్టులు అప్పగిస్తే.. ఆ కంపెనీ ఎందుకు రూ.15700 కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని ప్రశ్నించారు. హెచ్ఏఎల్ బలంగా ఉంటే రక్షణ సంబంధిత ప్రాజెక్టులు ఇతరులు అప్పగించడం సాధ్యంకాదనే ఉద్దేశంతోనే ఆ సంస్థను ప్రభుత్వం బలహీనపరుస్తోందని రాహుల్ ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి రక్షణ రంగ ఉత్పత్తులను అందిస్తున్న హెచ్ఏఎల్ ఎలాంటి ఉత్పత్తులు చేయలేని స్థితిలో ఉందని ప్రచారం చేయడమంటే.. అనిల్ అంబానీని అందలం ఎక్కించడమేనని రాహుల్ మండిపడ్డారు.

బైపాస్ సర్జరీకి అభ్యంతరాలు రాలేదా..?

ప్రధాని మోడీ, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను నేనొక్కడే ప్రశ్న అడుగుతున్నా..రాఫెల్‌కు మోడీ ఎప్పుడు బైపాస్ సర్జరీ చేశారని..? యూపీఏ కుదుర్చుకున్న ఒప్పందాన్ని కాదని 126 యుద్ధవిమానాలకు బదులు 36 యుద్ధవిమానాలు కొనుగోలు చేయాలని నిర్ణయిస్తే.. రక్షణశాఖ అధికారులుగానీ, వాయుసేన అధికారులు గానీ ప్రశ్నించలేదా..? ఈ ప్రశ్నలకు మోడీ సమాధానం చెప్పాలి. అని రాహుల్ ప్రశ్నించారు. హెచ్ఏఎల్‌ను నిర్వీర్యం చేస్తుండటంతో మేధావులైన ఇంజనీర్లు, సైంటిస్టులు జీతాలు అందక అనిల్ అంబానీ సంస్థల్లో చేరే పరిస్థితులు వస్తున్నాయని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు.

అంబానీ జేబులోకి రూ.30 వేల కోట్లు

దేశ ప్రజల రూ.30 వేల కోట్లను మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా అనిల్ అంబానీ జేబులో పెట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందన్నరాహుల్.. మోడీ దమ్ముంటే రాఫెల్‌పై 15 నిమిషాలపాటు చర్చలో పాల్గొనాలని సవాల్ విసిరారు. రాఫెల్‌పై మోడీ చర్చకు వస్తే నిజానిజాలన్నీ బయటపడతాయని రాహుల్ డిమాండ్ చేశారు. దేశ కాపాలాదారుడినని చెప్పుకుంటున్న మోడీ.. దొంగలకు రక్షణగా నిలుస్తున్నారని రాహుల్ విమర్శించారు.

మోడీకి పుతిన్ ఫోన్



న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్ చేశారు. మోడీకి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేసిన పుతిన్.. ఈ ఏడాది సెప్టెం బర్‌లో జరగనున్న ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్ లో పాల్గొనాలని ఆహ్వానించారు. రష్యాలోని సోచిలో గతేడాది మే నెలలో ఇరువురు నేతల మధ్య జరిగిన అనధికార భేటీలోని అంశాలను ప్రస్తావించిన పుతిన్... ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం..రక్షణ రంగంలో పరస్పర సహకారం, ఉగ్రవాదంపై ఉమ్మడిపోరాటం వంటి అంశాలపై చర్చించారు. సోమవారం క్రిస్మస్ పండగ జరుపుకుంటున్న రష్యా ప్రజలకు మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. గడిచిన నాలుగేళ్లలో ఇరువురు నేతలు సాధించిన విజయాలు..సంయుక్తంగా ముందుకుపోవాల్సిన అంశాలపై మోడీ- పుతన్ చర్చించుకున్నారు. బ్రిక్స్, ఎస్‌సివో సదస్సులతో ఏకమైన భారత్- రష్యా వ్యూహాత్మక రంగాల్లో పరస్పర సహకారంతో పనిచేస్తున్నాయి.


కొలువుదీరిన హసీనా సర్కార్



ఢాకా: షేక్‌హసీనా బంగ్లాదేశ్ ప్రధానిగా నాలుగోసారి సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ తాజా ఫలితాల్లో ఘన విజయం సాధించటంతో విపక్షాలు అధికార పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడిందని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో బంగ్లా అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హమీద్ బంగ్లాదేశ్ ప్రధానిగా హసీనా (71) తో ప్రధానిగా నాలుగోసారి ప్రమాణస్వీకారం చేయించారు. కాగా హసీనా మొదటిసారి ప్రధానిగా 1996లో ప్రమాణస్వీకారం చేశారు. రెండోసారి 2008లో, మూడోసారి 2014లో ప్రధానిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ ప్రధాని షేక్ హసీనాతోపాటు నూతన మంత్రులతోనూ ప్రమాణస్వీకారం చేయించారు. మొత్తం 24 కేబినెట్ మంత్రులు, 19స్టేట్ మంత్రులతో హసీనా ప్రభుత్వం బంగ్లాలో కొలువుదీరింది. కాగా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినవారిలో కొత్తవారికి హసీనా ప్రాధాన్యం ఇచ్చారు. 31మంది కొత్తవారికి మంత్రులుగా అవకాశమిచ్చారు. అయితే కీలక రంగాలను హసీనా తనవద్దే ఉంచుకున్నారు.

అటు రాఫెల్.. ఇటు సీబీఐ

అట్టుడికిన ఉభయసభలు



న్యూఢిల్లీ: రాజ్యసభ సోమ వారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లి పోయింది. రాఫెల్ జెట్ డీల్‌పై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు నినాదాలతో సభను హోరెత్తిం చారు. మరోవైపు ఎస్పీ, బీఎస్పీ, ఆప్, ఆర్జేడీ, టీఎంసీ పార్టీ సభ్యు లు కేంద్రం సీబీఐని దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో విపక్షాలు తమ ఆందోళన ఉధృతం చేయటంతో సభ నేటికి వాయిదా పడింది. ఎస్పీ, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సభ్యులు నిలబడి సీబీఐని కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రతీకారానికి వినియోగిస్తుందని ఆరోపిస్తూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. 2012, 2016లో యూపీ ప్రభుత్వంలో ఎస్పీ అధికారంలో ఉండగా అఖిలేశ్ యాదవ్ గనుల శాఖను తమ అధీనంలో ఉంచుకున్నారు. ఆ కాలంలో గనుల కేటాయింపు లో అక్రమాలు జరిగాయని సీబీఐ విచారణపై ఎస్పీ, బీఎస్పీ ఆందోళన చేపట్టారు. మరోవైపు శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం అనంతర చెలరేగిన హింసపై లెఫ్ట్ సభ్యులు ఆందోళన చేపట్టారు. అదే విధంగా రాఫెల్ సమస్యపై కాంగ్రెస్ ఎంపీ లు ఆందోళన చేయడంతో సభలో గందరగోళం నెల కొంది. ఈ నేప థ్యంలో రాజ్య సభ ఛైర్మన్ వెంక య్య నాయుడు మాట్లా డుతూ నిబంధనలు 267 ప్రకారం సభాకార్యాక్రమాలు రద్దు చేసి సభ్యుల నుంచి ఆయా సమస్యలపై అందిన నోటీసులుపై చర్చిద్దామని తెలిపినా సభ్యులు ఆందోళన విరమించలేదు. దీంతో ఛైర్మన్ సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సభా కార్యక్రమాలు జరిగేందుకు సహకరించాలని కోరారు. నిబం ధనల ప్రకారం అన్ని సమస్యలపై చర్చిద్దామన్నారు. అనంతరం సభ తిరిగి సమావేశ మైనా విపక్షాల సభ్యులు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ నారా యణ్ సింగ్ ఎదుట ఆందోళన చేపట్టి నినాదాలతో నిరసన తెలపటంతో సభను మరోసారి 15నిమిషాలుపాటు వాయిదా వేశారు.



న్యూఢిల్లీ: అక్రమ ఇసుక మైనింగ్ ఆరోపణలపై యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌పై సీబీఐను విచారణకు పురిగొల్పటాన్ని నిరసిస్తూ ఎస్పీ, బీఎస్పీ సభ్యులు సోమవారం లోక్‌సభలో ఆందోళన ఉధృతం చేశారు. మరోవైపు రాఫెల్ డీల్‌పై కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేపట్టడంతో లోక్‌సభ విపక్షాల ఆందోళనతో అట్టుడికింది. విపక్షసభ్యుల ఆందోళన నడుమ లోక్‌సభ పలుమార్లు వాయిదాపడి చివరకు ఒకరోజుపాటు వాయిదా పడింది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో స్పీకర్ లంచ్ సెషన్‌కు ముందు సభ మూడుసార్లు వాయిదా వేశారు. మొదటి సారి వాయిదాపడి తిరిగి సభ ప్రారంభమవగానే సమాజ్‌వాది పార్టీ సభ్యులు కేంద్రం సీబీఐని దుర్వినియోగంచేస్తుందని ఆరోపిస్తూ ప్రశ్నలు సంధించారు. ఎస్పీ సభ్యుడు ధర్మేంద్రయాదవ్ మాట్లాడుతూ ఎస్పీ, బీఎస్పీ కూటమిగా ఏర్పడి సమావేశమైన వెంటనే సీబీఐ దాడి చేసిందన్నారు. ఇది ప్రతిపక్షాలను భయ భ్రాంతులకు గురిచేయ టమే అన్నారు. మరోవైపు కాంగ్రెస్ సభ్యులు రాఫెల్ అంశంలో ప్రభుత్వం సభను తప్పుదోవ పట్టించిం దని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. తొలుత స్పీకర్ ఏఐఏడీఎంకే ఎంపీలను, టీడీపీ ఎంపీ ఒకరిని వారి ప్రవర్తనను తప్పుబడుతూ సస్పెండ్ చేశారు. కాగా తొలుత వాయిదా అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం రెండుగంటలకు ప్రారంభమవగా కాంగ్రెస్ సభ్యులు మరోసారి వెల్‌లోకి దూసుకొచ్చి రాఫెల్ డీల్‌పై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. మరోవైపు విపక్షాల ఆందోళన నడుమ పర్సనల్ లా చట్టసవరణ బిల్లు -2018ని సభ ఆమోదించింది. కాగా విపక్ష సభ్యులు ఎంతకీ ఆందోళన విరమించకపోవటంతో స్పీకర్ సభను నేటికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

వాద్రాకు ఈడీ షాక్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్‌వాద్రాకు కొత్త సమస్య వచ్చింది. రాబర్ట్‌వాద్రాతోపాటు మరికొంత మందికి సంబం ధం ఉన్న ఆరోపణలు ఉన్న స్కైలైట్ కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మనీలాండరింగ్ కేసు నమోదు చేశారు. హర్యానాలోని గురుగావ్‌లో 2008లో జరిగిన ల్యాండ్ డీల్‌లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలపై కేసు నమోదు చేశామని ఈడీ అధికారులు సోమవారం తెలిపారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం ప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థ క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ఈడీ అధికారులు రాబర్ట్ వాద్రాతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల మేరకు సోమవారం ఈడీ కేసు నమోదు చేసింది. హర్యానా పోలీసులు గత ఏడాది సెప్టెంబరులో రిజిస్టర్ చేసిన ఎఫ్ఐఆర్‌ను ఆధారం చేసుకుని తాజా ఆరోపణలతో కేసు నమోదు చేశామని ఈడీ అధికారులు తెలిపారు.

అఖిలేష్‌కు మాయావతి బాసట



న్యూఢిల్లీ: మైనింగ్ కుంభకోణంలో యూపీ మాజీ సీఎం, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను సీబీఐ ప్రశ్నించనుందన్న నేపథ్యంలో బీఎస్పీ చీఫ్ మాయావతి సోమవారం అఖిలేశ్‌కు బాసటగా నిలిచారు. సీబీఐదాడుల పేరిట బీజేపీ ప్రత్యర్థులను భయపెట్టే వ్యూహాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని మాయా వతి అన్నారు. కేంద్రం వేధింపులను ధైర్యంగా ఎదుర్కొని కుట్రను నీరుగార్చాలని అఖిలేశ్‌తో సమావేశమైన మాయావతి స్పష్టం చేశారని బీఎస్పీ ఓ ప్రకటనలో పేర్కొంది. మైనింగ్ కేటాయింపులో ప్రభుత్వ నిబంధనలును ఉల్లంఘిం చిన అధికారిణిపై ఎఫ్ఐఆర్ నమోదైతే దానికి మాజీ సీఎం అఖిలేశ్ ఏ విధంగా బాధ్యత వహిస్తారని ఎస్పీ, బీఎస్పీ నేతల సమావేశంలో బీఎస్పీ సతీశ్‌మిశ్రా ప్రశ్నించారు.

నేటి నుంచి దేశవ్యాప్త కార్మిక సమ్మె

న్యూఢిల్లీ: నేటినుంచి దేశవ్యాప్త సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. రెండురోజులపాటు జరిగే ఈ సమ్మెలో సుమారు 20కోట్లమంది కార్మికులు పాల్గొంటారని యూనియన్లు తెలిపాయి. ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చామని కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. నేటినుంచి జరిగే రెండు రోజుల సమ్మెలో 10 సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు (సీటీయూస్) చేరుతున్నాయని, 20కోట్లమంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పాటిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అధికసంఖ్యలో అన్నిరంగాల కార్మికులు సమ్మెలో పాల్గొంటారని విలేఖరులకు తెలిపారు.

పౌరసత్వ బిల్లుకు ఓకే

- కేంద్రం నిర్ణయంపై భగ్గుమన్న ఈశాన్య ప్రజలు
- నేడు ఈశాన్య రాష్ట్రాల బంద్‌కు పిలుపు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో భేటీ అయిన కేంద్రమంత్రి వర్గం అసోం పౌరసత్వ సవరణ బిల్లుకు ఆమోదముద్ర వేసింది. అసోంలోకి సరిహద్దు దేశాల నుంచి అక్రమ వలసలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇటీవల జాతీయ పౌరసత్వ నమోదు కార్యక్రమాన్ని (ఎన్ఆర్సి)ని నిర్వహించారు. అసోం లో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించేందుకు చేపట్టిన ఈ ప్రక్రియ ఎన్నో వివాదాల మధ్య ముగిసింది. ఈనేపథ్యంలో కేంద్ర కేబినెట్ పౌరసత్వ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ బిల్లును నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోందింప జేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. 2016 పార్లమెంట్ దృష్టికి వచ్చిన పౌరసత్వ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ లోక్‌సభలో ప్రజెంటేషన్ ఇచ్చిన గంటల్లోనే కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. తాజా నిర్ణయం తో బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ నుంచి అసోం వచ్చి స్థిరపడిన ముస్లిమేతరులకు మేలు జరగనుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పౌరసత్వ బిల్లు 1985 అసోం అకార్డ్ ను నిర్వీర్యం చేస్తుందని అసోంతో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారు. 1985 అసోం పౌరసత్వ చట్టం ప్రకారం 1971 తర్వాత విదేశాల నుంచి వలస వచ్చే ప్రజలకు స్థానం లేదు. అయితే తాజా బిల్లు సరిహద్దు దేశాల్లోని ముస్లిమేతరులకు అసోంలోకి ప్రవేశం కల్పించేది ఉందన్నది ఈశాన్య రాష్ట్రాల ప్రజల ప్రధాన అభ్యంతరం. తాజా బిల్లు ప్రకారం ఆఫ్ఘని స్తాన్,పాకిస్తాన్,బంగ్లాదేశ్ దేశాల నుంచి హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రిస్టియన్లు 6 ఏళ్లపాటు(గతంలో 12 ఏళ్లు) భారత్‌లో స్థిరనివాసముంటే ఎలాంటి పత్రాలు లేకున్నా వారిని పౌరులుగా గుర్తిస్తారు.



11 గంటల బంద్

విదేశీయులకు పౌరసత్వం కల్పించేలా రూపొం దించిన పౌరసత్వ సవరణ బిల్లు- 2016ను ఈశాన్య రాష్ట్రాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ నేడు బంద్ పాటించ నున్నట్లు ఈశాన్య రాష్ట్రాల విద్యార్థి సంఘం ప్రకటించింది. ఎన్ఈఎస్‌వో పిలుపునకు ఈశా న్య రాష్ట్రాల్లోని అన్ని విద్యార్థి సంఘాలు మద్దతు పలికా యి.

బీజేపీకి ఏజీపీ మద్దతు ఉపసంహరణ

కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అసోం గణపరిషత్ (ఏజీపీ) బీజేపీ ప్రభుత్వానికి తమ మద్దతు ను ఉపసంహరించుకుంది. అసోం ప్రజల మనోభావా లకు వ్యతిరేకంగా ఉన్న బిల్లును ఉపసంహ రించుకో వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా తమ వాదనను పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏజీపీ ప్రకటించింది.

ఉత్తమ్ పనికి రాడు

- టీపీసీసీ నాయకత్వంపై సర్వే ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వం పనికిరాదని మాజీకేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ అన్నా రు. పార్టీ ఓడిపోతే పదవులకు రాజీనామా చేయ డం ఆన వాయితీ అయితే, ఉత్తమ్, కుంతియాలకు చలనమే లేదని, ఓడిపోయినా జల్సాగా ఉన్నారని ఆయన విమర్శించారు. కనీసం తన భార్యాను కూడా గెలుపించుకోలేని ఉత్తమ్ టీపీసీసీ అధ్యక్ష పదవిలో కొనసాగడానికి అర్హుడు కాదన్నారు. ఉత్తమ్, కుంతియాలిద్దరూ తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని, తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించాలని ప్రజలు కోరుకుంటే ఉత్తమ్, కుంతియాలు కలిసి పార్టీని ముంచివేశారని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్త పీసీసీ, కొత్త సీఎల్పీ నాయకత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇడియట్స్ అని ముఖ్యమంత్రి కెసీఆర్ దూషించడంలో ఏమాత్రం తప్పులేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో రియల్ ఇడియట్స్ ఉత్తమ్, కుంతియాలను ఆయన అన్నారు.



జోన్ సంగతేంటి?

- రైల్వే మంత్రిని ఘెరావ్ చేసిన టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నేతల పరస్పర ఆరోపణలు, విమర్శలతో పార్లమెంట్ ఆవరణ వేడెక్కింది. సభ ప్రారంభమయ్యే ముందు ప్రతిరోజూ పార్లమెంట్ ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న తెలుగుదేశం పార్టీ ఎంపీలు సోమవారం కూడా యథావిధిగా ఆందోళన ప్రారం భించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినదించారు. అదే సమయంలో శబరిమల వ్యవహారంపై ధర్నా చేపట్టిన బీజేపీ ఎంపీలు ఆ ప్రాంతానికి చేరుకున్నారు.

శబరిమల వ్యవహారం గురించి మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అక్కడే ధర్నా చేస్తున్న తెలుగుదేశం పార్టీ ఎంపీలను ఉద్దేశించి కూడా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో జతకట్టడాన్ని తెలంగాణ ప్రజలు తిరస్కరించారని ఎద్దేవా చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లోనూ దుష్ట కూటమి కోసం చంద్రబాబు నాయుడు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ మాదిరిగానే ఏపీలోనూ బుద్ధి చెబుతారని అన్నారు. ప్రత్యేక హోదాకు బదులుగా కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీని ప్రకటించినప్పుడు తెలుగుదేశం నాయకులు సంబరాలు చేసుకున్నారని, అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారని గుర్తుచేశారు. ప్యాకేజీ ద్వారా హోదా కంటే అదనపు ప్రయోజనాలు సమకూరు తాయని టీడీపీ నాయకులు అన్నారని, ఇప్పుడు హోదా అంటూ డ్రామాలు చేస్తున్నారని పీయూష్ గోయల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

తమ ఎదురుగా నిలబడి విమర్శలు చేస్తున్న పీయూష్ గోయల్‌ను గమనించిన తెలుగుదేశం ఎంపీలు ఆయన్ను ఘెరావ్ చేశారు. ఆయన వెనుక నిలబడి నినాదాలు రెట్టించారు. రైల్వే జోన్ ఏమైందంటూ నిలదీశారు. ముందు జోన్ సంగతి తేల్చి ఆ తర్వాత మాట్లాడమని హితవు పలికారు. రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జోన్ గురించి టీడీపీ నేతల నినాదాలు విన్న మంత్రి పీయూష్ గోయల్ స్పందిస్తూ.. రైల్వే జోన్ ఏర్పాటు అంశం పరిశీలనలో ఉందని బదులిచ్చారు.


మోయలేని భారం!

- నాలుగేళ్లుగా పెరిగిన వ్యయాలు
- భారీగా పెరిగిన వేతనాలు, పెన్షన్లు
- బడ్జెట్ అంచనాకన్నా 7 శాతం అధికం
- పీఆర్‌సీపై ప్రభావం

ఆంధ్రప్రభ, హైదరాబాద్: ఫిబ్రవరిలో పీఆర్సీ ప్రకటన దిశగా బిస్వాల్ కమిటీ వేగం పెంచింది. మరోవైపు ఐఆర్‌పై కూడా ప్రభుత్వం సాలోచనలు చేస్తున్నట్లుగా అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రభుత్వ వేతనాల వ్యయం మొత్తం రెవెన్యూ వ్యయంలో 36.16 శాతానికి చేరినట్లు తేలడంతో భారీ మొత్తంలో పీఆర్సీ ప్రకటన అనుమానమేనని తెలు స్తోంది. ఇప్పటికే ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల వాటా కూడా రెవెన్యూ వ్యయంలో 11.07 శాతంగా నమోదవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా ఉద్యోగుల పెండింగ్ కోరికలైన ఐఆర్, పీఆర్సీలకు ఫిబ్రవరి తర్వాత కొంతమేర సానుకూల వాతావరణం నెలకొంటోంది. తెలం గాణ తొలి వేతన సవరణ అమలులో భాగంగా ప్రభుత్వ రాబడి, ఖర్చుల వివరాలను కూడా పరిగణలోకి తీసుకుం టున్నారు. తాజా బడ్జెట్‌లోనే వీటిపై స్పష్టత ఇవ్వనున్నారు.

ఐఆర్, పీఆర్సీలపై ప్రభావం...

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఏటా జనవరిలో ఒక విడత, జూలైలో మరో విడత కరవు భత్యం విడుదల చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వ డీఏ, కేంద్ర ప్రభుత్వ డీఏ ప్రకటనపై ఆధారపడి ఉంటుంది. పదో పీఆర్సీ గడువు జూన్ 30తో ముగిసింది. గతేడాది జూలై 1నుంచి కొత్తపీఆర్సీ అమలులోకి రావాల్సి ఉంది. అయితే బిస్వాల్ కమిటీ పలు విధాలుగా పరిశీలించిన తర్వాత ఎంతమేర పెంచితే ప్రభుత్వంపై ఎంత భారం పడుతుందనే అంచనాలను రూపొందించింది. ఇందులో ప్రధానంగా 15 శాతం మేర ఫిట్‌మెంట్ పెంచితే ఏడాదికి



రూ.2767కోట్లు, 20శాతమైతే రూ.3690కోట్లు, 25 శాతమైతే రూ. 4612 కోట్లు భారం పడుతుందని గుర్తించింది. 63శాతమైతే రూ.11600 కోట్ల భారీ భారం పడనుంది.

తొలి తెలంగాణ పీఆర్‌సీలో రిటైర్డ్‌ఐఏఎస్ అధికారి సీఆర్ బిస్వాల్ ఛైర్మన్‌గా మరో ఇద్దరు రిటైర్డ్ ఐఏఎస్‌లు సీ ఉమామహేశ్వరరావు, డాక్టర్ మహమ్మద్ అలీ రఫత్‌లు ఉద్యోగ సంఘాలతో భేటీ అయ్యారు. పలు సంఘాలనుంచి ఆన్‌లైన్‌లో విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం ఎదుట నివేదించారు. కానీ సమగ్ర నివేదికను మాత్రం ఇంతవరకు రూపొందించలేకపోయారు. తాజాగా బడ్జెట్ రూపకల్పన నేపథ్యంలో మరోసారి పీఆర్సీ చర్చ జోరందుకుంది. రెవెన్యూ పద్దుకింద ప్రభుత్వం చేస్తున్న ప్రధాన ఖర్చుల్లో వడ్డీ చెల్లింపులు, జీతాలు, వేతనాలు, పించన్లు, సబ్సిడీల వ్యయాల లెక్కలను ఆర్థిక శాఖ సిద్ధం చేస్తోంది. ఇందులో ఉద్యోగుల వేతనాల నిధులూ కేటాయిం చడం సహజంగానే జరుగుతుంది. యేటేటా ప్రభుత్వ ఉద్యో గుల వేతనాల భారం ప్రభుత్వంపై పెరుగుదల నమోదవు తోందని, బడ్జెట్ అంచనాలకంటే గతేడాది ఈ వ్యయం 7 శాతం ఎక్కువగా నమోదైందని గుర్తిం చారు. మొత్తం రెవెన్యూ వ్యయంలో జీతాలపై ఖర్చు 36.16 శాతానికి చేరుకుంది. 2014-15లో వేతనాలు, జీతాల ఖర్చు రూ.12, 200కోట్లుకాగా 2016-17 నాటికి రూ.21, 897కోట్లకు చేరు కున్నది. ఇందులో ప్రణాళికేతర పద్దులో రూ. 20557 కోట్ల, ప్రణాళికా పద్దులో రూ.1340కోట్లుగా ఉన్నది. ఇక వడ్డీ చెల్లింపుల కు2014-15లో రూ.5227కోట్లు అవసరం కాగా 2016- 17నాటికి రూ. 8609 కోట్లకు చేరుకున్నది. పించన్లు 2014-15 లో రూ.4210 కోట్లుకాగా 2016-17లో రూ.9011కోట్లుకు చేరింది. ఇక కీలకమైన సబ్సిడీలలో 2014-15లో రూ. 3587కోట్లుకాగా 2016- 17కు రూ. 5935కోట్లకు చేరాయి. మొత్తంగా 2014-15లో ఈ ఖర్చు లు రూ. 25224కోట్లుకాగా 2016-17కు రూ.45452 కోట్లకు చేరుకుంది.

పింఛన్ల మోత...

రాష్ట్ర ప్రభుత్వ పించనుదార్లకు, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలకు 2016-17లో ఖర్చు చేసిన మొత్తం రూ. 9011కోట్లు. ఇది రెవెన్యూ రాబడుల్లో 10.88శాతంగా నమోదైంది. రెవెన్యూ వ్యయంలో 11.07శాతంగా ఉన్నది. బడ్జెట్ అంచనాల కంటే అధికం కావడంతో సహజంగానే కొంత భారం పడుతోంది.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

వృద్ధి రేటు 7.2 శాతం

- వ్యవసాయం, తయారీరంగం ఊపు
- తలసరి ఆదాయం రూ. 1,25,397
- గత ఆర్థిక సంవత్సరం 6.7 శాతం వృద్ధి
- కేంద్ర గణాంకాల కార్యాలయం అంచనా
- ప్రయివేటు ఆర్థిక వేత్తల అంచనా 7శాతం లోపే



న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం 2018-19లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు లేదా జీడీపీ 7.2 శాతంగా నమోదు కావచ్చునని, గత ఆర్థిక సంవత్సరం 6.7 శాతంగా నమోదైంది. గత ఆర్థికసంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు మెరుగ్గా ఉంటుందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) సోమవారం నాడు విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వృద్ధిరేటు పుంజుకోవడానికి ప్రధాన కారణం వ్యవసాయరంగంతో పాటు తయారీరంగం జోరందుకోవడమేనని తేల్చి చెప్పింది. ఈ ఆర్థిక సంవత్సరం జాతీయ ఆదాయం ముందస్తు అంచనాలను సీఎస్ఓ విడుదల చేసింది. వాస్తవ జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్) విషయానికి వస్తే వృద్ధిరేటు 7 శాతంగా నమోదుకావచ్చునని.. అంతక ు ముందు ఆర్థిక సంవత్సరం 6.5 శాతమని అంచనా వేసింది. సీఎస్ఓ విడుదల చేసిన గణాంకాలను బట్టి చూస్తే.. వ్యవసాయం, అటవీ, చేపల రంగాల్లో ఈ ఆర్థికసంవత్సరం 3.8 శాతం వృద్ధిని సాధిస్తే.. క్రితం ఏడాది 3.4 శాతం మాత్రమే వృద్ధి కనిపించిందని తెలిపింది. అదే విధంగా తయారీరంగానికి వస్తే ఈ ఆర్థిక సంవత్సరం 8.3 శాతం వృద్ధిని సాధిస్తే.. క్రితం ఏడాది 5.7 శాతం వృద్ధి మాత్రమే కనిపించిందని పేర్కొంది. 2016-17లో జీడీపీ వృద్ధిరేటు 7.1 శాతంగా నమోదైతే.. 2015-16లో 8.2 శాతంగా నమోదైంది. అయితే కేంద్ర గణాంకాల కార్యాలయం విడుదల చేసిన దానికి .. రాయిటర్స్ వార్తాసంస్థ ప్రైవేట్ ఆర్థికవేత్తల అభిప్రాయాలను తీసుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7 శాతంగా నమోదు కావచ్చునని అంచనా వేయగా.. సెంట్రల్ బ్యాంకు మాత్రం 7.4 శాతంగా అంచనా వేసింది. దీనికి వీరు చెప్పే కారణాలు రెండే రెండు.. డిమాండ్ బలహీనంగా ఉండటంతో పాటు రుణాలకు డిమాండ్ తగ్గడమే కారణమని పేర్కొన్నాయి.


తిరిగి సీఎస్ఓ విడుదల చేసిన నివేదిక విషయానికి వస్తే.. గనులు, క్వారియింగ్ రంగాల్లో ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు మందగించే అవకాశాలున్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం 2.9 శాతం నుంచి ఈ ఆర్థిక సంవత్సరం 0.8 శాతానికి దిగిరావచ్చునని అంచనా వేసింది. వాణిజ్యం, హోటల్, రవాణా, కమ్యూనికేషన్స్, సేవల రంగంతో పాటు బ్రాడ్‌కాస్టింగ్ రంగం కూడా గత ఆర్థిక సంవత్సరం 8 శాతం వృద్ధిని సాధిస్తే.. ఈ ఆర్థికసంవత్సరంలో 6.9 శాతానికి పరిమితం కావచ్చునని సీఎస్ఓ పేర్కొంది. దీంతో పాటు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సేవల రంగాలు ఈ ఆర్థిక సంవత్సరం 8.9 శాతానికి దిగివస్తే.. క్రితం ఆర్థిక సంవత్సరం 10 శాతంగా నమోదైంది. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటి సేవలరంగంలో వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం 9.4 శాతం సాధిస్తే.. క్రితం ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతం సాధించింది. ఇక నిర్మాణరంగానికి వస్తే ఈ ఆర్థిక సంవత్సరం 8.9 శాతంగా అంచనా వేస్తే క్రితం ఆర్థిక సంవత్సరం 5.7 శాతం.. ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగాల్లో వృద్ధిరేటు 2017-18తో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం కాస్తా మెరుగ్గా నమోదై 6.8 శాతానికి ఎగబాకుతుందని, క్రితం ఆర్థిక సంవత్సరం 6.6 శాతంగా నమోదైంది.

తలసరి ఆదాయం

కేంద్ర గణాంకాల కార్యాలయం అంచనా ప్రకారం తలసరి జాతీయ ఆదాయం 2018-19లో రూ.1,25,397 గా అంచనా వేసింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదా యం రూ.1,12,835గా నమోదైంది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 11.1 శాతం వృద్ధిని సాధిస్తుందని పేర్కొంది. కాగా 2017-18లో వృద్ధిరేటు 8.6 శాతంగా నమోదైంది. గ్రాస్ ఫిక్సిడ్ క్యాపిటల్ ఫార్మేషన్ (జీఎఫ్‌సీఎఫ్) పెట్టుబడుల సూచి విషయా నికి వస్తే ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం చూస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.55.58 లక్షల కోట్లుగా తేలగా.. 2017-18లో రూ.47.79 లక్షలుగా తేలింది. 2011-12 స్థిరమైన ధరల ప్రకారం చూస్తే జీఎఫ్‌సీఎప్ రూ. 45.86 లక్షలుగా అంచనా వేస్తే.. 2017-18లో రూ.40.88 లక్షలుగా తేలింది. జీడీపీ ప్రాతిపదికన చూస్తే ప్రస్తుతం ఉన్న జీఎఫ్‌సీఎఫ్ రేట్ల ప్రకారం (2011-12) స్థిరమైన ధర ప్రకారం చూస్తే వరుసగా 2018-19లో 29.5 శాతం, 32.9 శాతంగా ఉం టుందని .. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం 2017-18లో ఇవి వరుసగా 28.5 శాతం, 31.4 శాతంగా ఉంటుందని సీఎస్ఓ పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి లేదా జీడీపీ రూ.1,49,331 కోట్లుగా తేలగా క్రితం ఆర్థిక సంవత్సరం 2017-18లో ఇది రూ.2,23,504 కోట్లని తెలిపింది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం ప్రభుత్వం వినియోగంపై వ్యయం అంచనా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.21.70 లక్షలు కాగా.. క్రితం ఆర్థిక సంవత్సరం రూ.19.08 లక్షల కోట్లు. (2011-12) స్థిరమైన ధరల ప్రకారం జీఎఫ్‌సీఎఫ్ అంచనా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15.28 లక్షల కోట్లు కాగా 2017-18లో రూ.14.0 లక్షల కోట్లుగా తేలింది.

ప్రభుత్వానికి ఆర్‌బీఐ మధ్యంతర డివిడెండ్
రూ. 40 వేల కోట్లు

- ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి
- మార్చిలోగా బదిలీ



న్యూఢిల్లీ : రిజర్వుబ్యాంకుకు కొత్త గవర్నర్ శక్తికాంతదాస్ వచ్చిన వెంటనే పరిస్థితులు మోడీ సర్కార్‌కు అనుకూలంగా మారిపోయాయి. గత నెల వరకు ఆర్‌బీఐ గవర్నర్‌గా ఉర్జిత్‌పటేల్, డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య చేసిన ప్రతిఘటన ప్రస్తుతం పూర్తిగా నీరుగారిపోయింది. ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరిగిపోయిందో లేక కొత్త గవర్నర్ శక్తికాంతదాస్ మోడీ సర్కార్ నుంచి మంచి మార్కులు కొట్టేయాలనుకున్నారో ఏమో తెలియదు కానీ.. మార్చి చివరి నాటికి ప్రభుత్వఖాతాకు 4.32 బిలియన్ డాలర్ల నుంచి 5.8 బిలియన్ డాలర్ల వరకు మధ్యతరం డివిడెండ్ రూ.30వేల నుంచి రూ.40వేల కోట్ల వరకు బదిలీ చేసే అవకాశాలు ఉన్నట్లు ఈ అంశానికి సంబంధించి మూడు రకాల వర్గాలు తెలియజేశాయి. మోడీ సర్కార్‌కు పెద్దమొత్తంలో డివిడెండ్ అందితే ఆయన పెరిగిపోతున్న ద్రవ్యలోటును అదుపుచేసుకోవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వానికి పన్ను వసూళ్లు బాగా తగ్గిపోయాయి. దీంతో ప్రభుత్వం ఆర్‌బీఐ మెడపై కత్తి పెట్టి నిధులు బదిలీ చేస్తారా లేదా అని ఒత్తిడి పెంచాయి. మోడీ సర్కార్ దెబ్బకు ఎటూ తేల్చుకోలేక ఆర్‌బీఐ గవర్నర్ పదవికి ఉర్జిత్ పటేల్ రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ప్రభుత్వం ఎలాంటి జాప్యం చేయకుండా శక్తికాంతదాస్‌ను తీసుకొచ్చి కూర్చోబెట్టింది. ప్రస్తుతం ఆయన సర్కార్‌కు అనుకూలంగా నిర్ణయాలు తీసుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఆయన ఆర్థికమంత్రిత్వశాఖలో పనిచేశారు. వచ్చే మే నెలలో లోకసభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఆర్‌బీఐ పై ఒత్తిడి పెంచి పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయించుకోవాలనుకుంటోంది.

ఇండియన్ బ్యాంకు
'ఐబీ-కామధేను ప్రచారం



హైదరాబాద్ : ప్రభుత్వరం గానికి చెందిన ఇండియన్ బ్యాంకు సోమవారం కరెంటు - పొదుపు ఖాతాలు.. ఐబి -కామధే ను ప్రచారాన్ని ప్రారంభిం చిం ది. బ్యాంకు జోనల్ మేనేజర్ ఆర్ మనోహర్ హిమాయత్‌నగర్, నారాయ ణగూ డ లో రోడ్‌షో నిర్వ హించారు. ఈ సందర్భంగా మనో హర్ మాట్లాడుతూ.. ఇండియన్ బ్యాంకు అతి పురాతన పీఎస్‌యు బ్యాంకు అని, లాభాల్లో దూసు కుపోతోం దని, ఎకనమిక్ టైమ్స్ అత్యుత్తమ బ్యాంకుగా అవార్డును ప్రకటించిం దన్నారు.

పాత బకాయిలపై 11లోగా తేల్చండి

- ఆర్‌కామ్, ఆర్ జియోకు సుప్రీమ్ సూచన

న్యూఢిల్లీ : డిపార్టుమెంట్ ఆఫ్ టెలికం (డాట్) చెల్లించాల్సిన బకాయిలపై ఈ నెల 11వ తేదీలోగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ జియోను సుప్రీంకోర్టు కోరింది. కాగా డాట్ ఆర్‌కామ్‌కు స్పెక్ట్రమ్ అమ్మకాలపై క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో పాటు ఆర్ జియోను స్పెక్ట్రమ్ గైడ్‌లైన్స్ ప్రకారం గ్యారంటీ ఇవ్వాలని కోరింది. దీనికి ముఖేష్ అంబానీకి చెందిన జియో ఆర్‌కామ్ పాతబకాయిలకు తాము జవాబుదారి కాదని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఆర్‌ఎఫ్ నారిమన్, వినీత్‌శర్మలు.. మీరిద్దరు (ఆర్‌కామ్, ఆర్‌జియో)లు ఇద్దరు కలిసి కూర్చుని ఈ అంశాన్ని జనవరి 11వ తేదీలోగా పరిష్కరించుకోవాలని.. మీరిద్దరు ఒక ఒప్పందానికి రాకుంటే తాము కూడా చేయగలిగిందేమీ లేదని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఇదిలా ఉండగా ఆర్‌కామ్ ఫైల్ చేసిన ధిక్కార పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణ స్వీకరించింది. ఆర్‌కామ్ ఆరోపణ ఏమిటంటే ఆర్‌జియోకు స్పెక్ట్రమ్ అమ్మకానికి డాట్ నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వడం లేదని.. డాట్ కోరినట్లు అన్నీ ష్యూరిటీలు ఇచ్చామని కోర్టుకు తెలియజేసింది. ఇదిలా ఉండగా రిలయన్స్‌జియో డాట్‌కు ఒక లేఖ రాస్తూ.. ఆర్‌కామ్ పాతబకాయిలకు తాము జవాబుదారి కాదని లేఖ రాసిందని సుప్రీం కోర్టు పేర్కొంది. మొత్తానికి ఈ కేసు లోతుగా పోకుండా కోర్టు ఆర్‌జియోను స్పెక్ట్రమ్ అమ్మకాల గైడ్‌లైన్స్ ప్రకారం అండర్‌టేకింగ్ ఇవ్వాలని కోరింది. కాగా ఆర్‌జియో తరపున సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే మాట్లాడుతూ.. ఈ డీల్‌కు సంబంధించి వివిధ స్థాయిలో ఒప్పందాలు జరిగాయి. ఆర్‌కామ్ పాత బకాయిల గ్యారంటీ గురించి పూర్తిగా తెలుసుకోకుండా తాము ఎలాంటి రిస్కు తీసుకోలేమని స్పష్టంచేశారు. ముందుగా డాట్, ఆర్‌కామ్‌లు స్పెక్ట్రమ్ అమ్మకాల ఒప్పందం పరిష్కరించుకోవాలని, పాత ఒప్పందాలకు సంబంధించి ఆర్‌జియో బకాయిలు చెల్లించాలంటే ఎలా కుదరుతుందని ప్రశ్నించారు. ఆర్‌కామ్ డిపాజిట్లు, బ్యాంకు గ్యారంటీ గైడ్‌లైన్స్‌కు ఆర్‌జియో కట్టుబడి ఉంటుందన్నారు. ఆర్‌కామ్ తరపున సీనియర్ అడ్వకేట్లు, కపిల్‌సిబల్, ముకుల్ రోహత్గి వాదిస్తూ.. ఆర్‌కామ్ పాతబకాయిలు రిలయన్స్ జియో చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పెక్ట్రమ్ పాత బకాయిలను ఆర్‌కామ్ తీరుస్తుందని.. ఆర్‌జియోను భవిష్యత్తులో పాతబకాయిలు తీర్చమని కోరమని కోర్టుకు విన్నవించుకున్నారు. ఈ వాదనలు విన్న కోర్టు ఆర్‌కామ్, ఆర్‌జియోలు కలిసి చర్చించుకుని జనవరి 11వ తేదీలోగా దీనిపై ఒక ఒప్పందానికి రావడం మేలని పేర్కొంది.



ఎరిక్‌సన్ బకాయిల్లో రూ.131 కోట్లు డిపాజిట్

ఇదిలా ఉండగా రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఎరిక్‌సన్‌కు చెల్లించాల్సిన రూ.550 కోట్ల బకాయిల్లో రూ.131 కోట్లు సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో సోమవారం నాడు జమచేసింది. ఆర్‌కామ్‌పై ఎరిక్‌సన్ కోర్టులో దాఖలు చేసిన కోర్టు ధిక్కారం కేసు పిటిషన్ సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఎరిక్‌సన్‌కు కొంత మొత్తం చెల్లించాలని ఆదేశించడంతో ఆర్‌కామ్ రూ.131 కోట్లు కోర్టులో జమచేసింది.

నేడు, రేపు సార్వత్రిక సమ్మె

- నేడు ఆటోల బంద్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మంగళ, బుధవారాలలో దేశంలోని ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన సమ్మె పిలుపునకు వామపక్షాలతో పాటు అనుబంధ సంఘాలన్నీ మద్దతు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తు న్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకం గా సమ్మె జరుపుతున్నారని, ఈ సమ్మె న్యాయసమ్మతమైంది కాబట్టి మద్దతు ఇస్తున్నామని, సమ్మెలో కార్యకర్తలు భాగస్వాములవుతారని పేర్కొన్నారు.సమ్మెకు మద్దతుగా ఆటో మోటార్ రంగ కార్మిక సంఘాలు కూడా పాల్గొంటున్నాయి. కేం ద్ర ప్రభుత్వం మోటారు వాహన చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ తెలంగాణ అంతటా మంగళవారం ఆటోలు, స్కూల్ వ్యాన్‌లు, క్యాబ్‌లు బంద్ పా టించ నున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎంవీ చట్ట సవరణ బిల్లును బలవంతంగా రుద్దుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఆటోల బంద్, బుధవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ ఫైనాన్షియర్ల దోపిడీని అరికట్టాలని కోరారు.

కొన్ని బ్యాంకులు కూడా బంద్

రెండు రోజుల సార్వత్రిక సమ్మెలో బ్యాంక్ ఉద్యోగ సంఘాలు కూడా పాల్గొంటున్నాయి. ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ), బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)లు ఈ బంద్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. దీంతో ఐడీబీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా సహా పలు బ్యాంకుల సేవలలో అంతరాయం కలగనుంది.

క్యూ3 కార్పొరేట్ లాభాలు...
రెవెన్యూ అంతంతే!

ముంబై : డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఫలితాలు జనవరి 10 నుంచి మొదలుకానున్నాయి. ముందుగా ఐటి దిగ్గజాలు, టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాల విడుదలతో సీజన్‌కు శ్రీకారం చుడుతుంది. అయితే దేశీయ రేటిగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా ప్రకారం కార్పొరేట్ ఫలితాలు పెద్ద ఆశాజనకంగా ఉండవని.. రెవెన్యూలో వృద్ధి 8 శాతం తగ్గి సరాసరి 12-13 శాతానికి పరిమితం కావచ్చునని సోమవారం నాడు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ద్రవ్యోల్బణం పెరిగిపోవడంతో పాటు కొన్ని రంగాలపై కొన్ని అంశాలు పనిచేశాయని అందుకే రెవెన్యూ తగ్గుతుందని పేర్కొంది.

ఆటో కంపెనీల విష యానికి వస్తే రెవెన్యూ కేవలం నాలుగు శాతం వృద్ధి కనిపిస్తుందని తెలిపింది. ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలకు ద్ర వ్యం కొరత వల్ల రుణాలు సులభంగా లభించడం లేదని తేల్చి చెప్పింది. అలాగే ఎఫ్‌ఎంసీజీ రంగానికి వస్తే.. వృద్ధిరేటు 8 శాతానికి పరి మితం కావచ్చునని, దీనికి ప్రధాన కారణం గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గడంమేనని స్పష్టం చేసిం ది. అలాగే చక్కెర, అల్యూమినియం, టెలికం రం గాల రెవెన్యూలపై ఒత్తిడి పెరుగుతుందని అమ్మకాలు అంతంత మాత్రంగా ఉంటాయని తెలియజేసింది.కార్పొరేట్‌ల నిర్వహణా లాభంలో వృద్ధిరేటు 10 శాతం తగ్గుముఖం పడుతుందని, అంతకు ముందు మూ డు త్రైమాసికాల పాటు రెవెన్యూ 15 శాతం చొప్పున వృద్ధిని సాధిం చాయని నివేదికలో వెల్ల డించింది. కమాడిటీ ఆధారిత రంగాల రెవె న్యూలో వృద్ధిరేటు మెరుగ్గా కనిపిస్తుందని.. ఉదాహ రణకు సహజ వాయువు 37 శాతం, ఉక్కు ప్రొడక్టులు 27 శాతం, సిమెంట్ 10 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పా టు నిర్మాణం రంగంలో వృద్ధిరేటు 12 శాతానికి పరి మితం అవుతుందని పేర్కొంది. డిసెంబర్‌తో ముగి సిన త్రైమాసికంలో డాలర్ మారకంతో రూపాయి 11 శాతం వరకు బలహీనపడింది. దీంతో ఎగుమతుల ఆధారిత రంగాలు ఉదాహరణకు సాఫ్ట్‌వేర్, ఫార్మారం గాలు వరుసగా 21 శాతం, 10 శాతం చొప్పున వృద్ధిని సాధించవ చ్చునని తెలిపింది. కమాడిటి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారి త రంగాలు డిసెంబర్ త్రైమాసికం లో రెవెన్యూ పెరగవచ్చునని క్రిసిల్ సీనియర్ డైరెక్టర్ ప్రసాద్ కోపార్కర్ చెప్పారు. వినియోగ ఆధారితంగా వ్యయం చేసే రంగాలు ఉదాహరణకు ఎయిర్‌లైన్స్, రిటైల్ రంగాల రెవెన్యూ పెరుగు తుందని, ఈ రంగాల్లో డిమాండ్ అనుకూలంగా ఉందని, క్రిసిల్ నివేదికలో తేటతెల్లం చేసింది.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు
రూ. 8.74 లక్షల కోట్లు

- ఏప్రిల్ – డిసెంబర్‌లో 4.1 % వృద్ధి
- రీఫండ్స్ రూ. 1.30 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 14.1 శాతం వృద్ధితో రూ.8.74 లక్షల కోట్లకు చేరాయని ఆర్థికమంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. రీఫండ్స్ విషయానికి వస్తే ఇదే కాలంలో రూ. 1.30 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయని పేర్కొంది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే ఇవి 17 శాతం అధికమని తెలిపింది. ప్రత్యక్ష పన్నుల విషయానికి వస్తే... రూ.3.64 లక్షల కోట్లు అడ్వాన్స్‌టాక్స్ కింద వసూలు అయ్యాయి. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 14.5 శాతం అధికమని ఆర్థికమంత్రిత్వశాఖ ప్రకటనలో వివరించింది. నికర వసూళ్లు (రీఫండ్స్ తదితరాలు సర్దుబాటు) చేసిన తర్వాత వసూళ్లు 13.6 శా తం పెరిగి రూ.7.43 లక్షల కోట్లకు చేరాయని పేర్కొంది. బడ్జెట్ అంచనాలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 64.7 శాతం ఉంటాయి. కాగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్ల అంచనా రూ.11.50 లక్షల కోట్లు. కాగా కార్పొరేట్ టాక్స్ 14.8 శాతం, వ్యక్తిగత ఆదాయం పన్ను వసూళ్లు 14.8 శాతంగా ఉంటాయి. 2017-18 ఆర్థికసంవత్సరంలో స్వచ్ఛంద ఆదాయం స్కీం అమల్లోకి తీసుకురావడం జరిగింది. 2016లో మూడోది లేదా చివరి ఐడీఎస్ వాయిదా కింద రూ.10,844 కోట్లు వసూళ్లు అయ్యాయి. అయితే ఈ వసూళ్లు తాజా ఆర్థిక సంవత్సరంలో కలపలేదని పేర్కొంది.

'డిక్కీ' తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడిగా రవికుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దళిత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(డిక్కీ) తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడిగా కె.రవికుమార్ నియమితులయ్యారు. అలాగే భానోతు రమేష్ నాయక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా, మునిదర్ అరుణ దాసరి వైస్ ప్రెసిడెంట్‌గా, డిక్కీ జాతీయ ఛైర్మన్ మిలింద్ కాంబ్లీ ఈ మేరకు వారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ చాప్టర్‌కు ఇప్పటివరకు ప్రెసిడెంట్‌గా ఉన్న రాహుల్ కిరణ్ డిక్కీ దక్షిణాది విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి పొందారు. డిక్కీ వైస్ ప్రెసిడెంట్‌గా మొదటిసారిగా ఓ మహిళకు అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, దళిత వర్గాల యువకులను వ్యాపార, పారిశ్రామికపరంగా ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే డిక్కీ చేస్తున్న కృషిని కొనసాగిస్తూ ఎస్సీ ఔత్సాహికులను మరింతగా ప్రోత్సహిస్తామని అన్నారు.

సిమెంట్ రంగం
గరం గరం!

- గృహనిర్మాణాల డిమాండ్, ఇన్‌ఫ్రాల అండ : ఇక్రా రేటింగ్



ముంబై : దేశీయ మార్కెట్లో ఈ ఆర్థిక సంవత్సరం 2018-19లో సిమెంట్ డిమాండ్ 7 శాతంగాను వచ్చే ఆర్థికసంవత్సరం 2019-20లో సిమెంట్ డిమాండ్ 8 శాతానికి ఎగబాకుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజా నివేదికలో వెల్లడించింది. సిమెంట్ డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణం గ్రామీణ గృహ నిర్మాణానికి, అదే విధంగా చౌకరకంగా గృహాలకు ప్రభుత్వం పెద్దపీట వేయడమే కారణమని తెలిపింది. దీంతో పాటు ప్రభుత్వం మౌలికరంగం ఉదాహరణకు రోడ్లు, మెట్రో, నీటిపారుల ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టడంతో సిమెంట్‌కు డిమాండ్ పెరుగుతుందని ఇక్రా నివేదికలో వివరించింది. సిమెంట్ డిమాండ్ ఈ ఆర్థిక సంవత్సరం, వచ్చే ఆర్థిక సంవత్సరం సుమారు 15-18 ఎంటీపీఏ.. (ఏడాదికి మిలియన్ టన్నులు) ఉండవచ్చునని అంచనా వేసింది. దేశీయంగా సిమెంట్ డిమాండ్ 7-8 శాతం వృద్ధిని సాధించినా.. దేశీయ సిమెంట్ వినియోగం సామర్థ్యం యధావిధిగా 70 శాతం వరకు ఉంటుందని, ఈ ఆర్థిక సంవత్సరం వచ్చే ఆర్థిక సంవత్సరం ఇలానే ఉంటుందని తెలిపింది. దీంతో ధరలపై ఒత్తిడి పెరగడంతో పాటు లాభాల మార్జిన్‌పై ఒత్తిడి ఉంటుందని పేర్కొంది.సిమెంట్ ఉత్పత్తికి కావాల్సిన సరఫరాలు పూర్తి స్థాయిలో అందడం లేదని ముఖ్యంగా సున్నపురాయి గనుల లీజులు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని తెలిపింది. దీంతో గ్రైండింగ్ సామర్థ్యం తగ్గుతుందని, అదే సమయంలో క్లింకర్ సామర్థ్యం పెరుగుతోందని.. మొత్తానికి కొత్త ప్లాంట్‌లలో ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతుందని పేర్కొంది. అయితే సిమెంట్ రంగంలో సరఫరా కంటే డిమాండ్ ఎక్కువగా ఉంటుందని.. డిమాండ్ 22-26 మిలియన్ టన్నుల వరకు ఉంటే సరఫరా మాత్రం దీనికంటే తక్కువగా ఉంటుందని తెలిపింది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో సిమెంట్ ప్లాంట్‌లు ఉత్పత్తి సామర్థ్యం 67 శాతంగా పనిచేస్తే.. వచ్చే ఆర్థిక సంవత్సరం 70 శాతం వరకు పనిచేస్తాయని అంచనా వేసింది. ఆగస్టు 2018 నుంచి పెట్ కోక్ ధరల్లో కొంత కరెక్షన్ జరిగినట్లు గుర్తించామని ఇక్రా పేర్కొంది.

గ్లోబల్ మార్కెట్ల చలవ!

- 155 పాయింట్ల వృద్ధి
- క్యూ3 ఫలితాలపై అనుకూల అంచనాలు
- ఫెడ్ వడ్డీ రేట్ల పెంపుపై అనుమానాలు
- చైనా– అమెరికా చర్చలపై ఆశలు

ముంబై : స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 155 పాయింట్లు లాభపడి 35,850 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రావడంతో పాటు, ఫెడ్ రిజర్వువడ్డీరేట్ల జోలికి పోయే అవకాశాలు తగ్గముఖం పట్టడం, చైనా - అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు ఒక కొలిక్కి వస్తాయని అంచనాలు మార్కెట్లను లాభాలతో ముందుకు నడిపించాయి. ఇక దేశీయ మార్కెట్లకు వస్తే ద్రవ్యపరిస్థితి మెరుగుపడ్డంతో పాటు వచ్చే క్యూ3 ఫలితాల సీజన్ అనుకూలంగా ఉంటుందన్న సెంటిమెంట్ మార్కెట్లను ముందుకు నడిపింది.

ఇక ట్రేడింగ్ విషయానికి వస్తే సోమవారం ఉదయం నుంచే మార్కెట్ లాభాలతోనే మొదలైంది. అటు తర్వాత 36వేల మార్కును దాటి 36,076.95 మార్కుకు ఎగబాకింది. అయితే చివరి గంటలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో 155.06 పాయింట్ల లాభంతో 35,850.16 వద్ద స్థిరపడింది. కాగా శుక్రవారం నాడు బీఎస్ఈ 181 పాయింట్లు లాభపడిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ విషయానికి వస్తే 44.45 పాయింట్ల లాభంతో 10,771.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,835.95 వద్ద గరిష్ఠానికి 10,750.15 కనిష్ఠానికి దిగివచ్చింది. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లు ఇలా ఉన్నాయి. రియల్టీ, టెక్, విద్యుత్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్, చమురు సహజవాయువు షేర్లున్నా యి.



అమెరికా - చైనా ఇరు దేశాలు వాణిజ్య యుద్ధాన్ని సమాప్తం చేద్దామని నిర్ణయించుకున్నాయి. ఇరు దేశాలకు చెందిన ప్రతినిధులు సోమవారం, మంగళవారం నాడు చర్చలు జరుపనున్నారు. గ్లోబల్ మార్కెట్లు లాభాలతో ట్రేడ్ కావడంతో సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. ప్రస్తుతం అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలు సఫలం కావాలని గ్లోబల్ మార్కెట్లని కోరుకుంటున్నాయి. దేశీయ మార్కెట్ల విషయానికి వస్తే ద్రవ్యచలామణి పరిస్థితి మెరుగుపడ్డంతో పాటు డాలర్ మారకంతో రూపాయి బలపడ్డంతో ఇన్వెస్టర్లు ఎఫ్‌ఎంసీజీ, ఐటి, ప్రైవేట్ రంగానికి చెందిన బ్యాంకు షేర్లు కొనుగోలు చేశారు. ఈ రంగాలకు చెందిన కంపెనీల ఫలితాలు అనుకూలంగా ఉంటాయన్న అంచనాతో పైన తెలిపిన షేర్లు పెరిగాయి. ఇక దేశంలో అతి పెద్ద సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్‌లు క్యూ3 ఫలితాలు జనవరి10, 11వ తేదీన విడుదల చేయనున్నాయి. ఇదిలా ఉండగా చైనా సెంట్రల్ బ్యాంకు గత శుక్రవారం నాడు పరపతి విధానాల్లో నిర్ణయాలను సడలించింది. అక్కడ నగదు నిల్వల నిష్పత్తిలో 100 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో సువారు 116 బిలియన్ డాలర్లు రుణాలు ఇవ్వడానికి వీలవుతుందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తిరిగి దేశీయ మార్కెట్లకు వస్తే.. గత శుక్రవారం నాడు విదేశీ సంస్థాగత మదుపరులు రూ.240.60 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.157.72 కోట్ల షేర్లు విక్రయించినట్లు స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేసున్నాయి. సెన్సెక్స్‌లో అత్యధికంగా లాభపడిన షేర్లలో యాక్సిస్ బ్యాంకు ఏకంగా 2.84 శాతం లాభపడితే, టాటా మోటార్స్ 2.64 శాతంలాభపడింది. మిగిలిన షేర్లు ఇలా ఉన్నాయి. ఇన్ఫోసిస్, మారుతి సుజుకి, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, టీసీఎస్, పవర్‌గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఏషియన్ పెయింట్స్, ఇండస్‌ఇడ్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, ఎంఅండ్‌ఎం, రిల్, ఐటీసీ లిమిటెడ్, భారతి ఎయిర్‌టెల్, హిందూ యూనీలీవర్, వేదాంత, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు,కొటక్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ షేర్లు 1.57 శాతం వరకు లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి.

విద్య ఉద్యోగాల్లో

అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లు

• కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం • నేడు పార్లమెంట్ ముందుకు బిల్లు • ఎన్నికల జిమ్మిక్కు: విపక్షాల ధ్వజం

మోడీ ఎన్నికల బాణం!



న్యూఢిల్లీ: అగ్రవర్ణాల్లో వెనుకబడిన పేదలుగా పేర్కొనేందుకు కేంద్రం కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించినట్లు తెలుస్తోంది.. దీని ప్రకారం ఒక వ్యక్తి వార్షికాదాయం రూ. 8 లక్షలకు మించి ఉండకూడదు. అదేవిధంగా, 5 ఎకరాలలోపు సొంత వ్యవసాయభూమి, వెయ్యి చదరపు అడుగుల కంటే తక్కువ విస్తీర్ణంలో ఇల్లు, నోటిఫైడ్ పురపాలిక పరిధిలో 100 గజాల కంటే తక్కువ విస్తీర్ణంలో, నోటిఫైడ్ కాని పురపాలిక పరిధిలో 200 గజాల లోపు విస్తీర్ణంలో నివాస స్థలం కలిగివున్న వారినే అగ్రవర్ణ పేదలుగా గుర్తించనున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు రిజర్వేషన్ల వల్ల ఎలాంటి ప్రయోజనం పొందని, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రిజర్వేషన్ ప్రయోజనాలు అందుతాయని ప్రభుత్వం పేర్కొంది. 1992లో సుప్రీం కోర్టు విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లను గరిష్టంగా 50 శాతానికి పరిమితం చేస్తూ తీర్పునిచ్చింది. అయితే, 2010 జులై నాటి తీర్పులో శాస్త్రీయ పద్ధతి మేరకు పొడిగించుకునే అవకాశాన్ని రాష్ట్రాలకు దఖలు పరుస్తూ సడలింపు ఇచ్చింది.

ఆచరణ సాధ్యమేనా?

కాగా, గతంలో రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు తీర్పు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 50 శాతాన్ని మించకూడదని సర్వోన్నత ధర్మాసనం గిరిగీసిన నేపథ్యంలో అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే రాజ్యాంగా సవరణ తప్పనిసరి కానుంది. ఈ క్రమంలో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందేలా కేంద్రం వ్యవహరిస్తుందా లేక నామమాత్రపు చర్యలతో ఎన్నికలకు వెళ్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. నేటి సమావేశాల్లో దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఇది మాస్టర్ స్ట్రోక్ మాత్రమే..: కేంద్రమంత్రి అథవాలె



అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించనున్నట్లు మోడీ సర్కార్ చేసిన ప్రకటనను కేంద్ర సామాజిక, న్యాయశాఖ మంత్రి రాందాస్ అథవాలె స్వాగతించారు. ఈ నిర్ణయాన్ని మాస్టర్ స్ట్రోక్‌గా అభివర్ణించారు. పార్లమెంట్ ముందుకొచ్చే ఈ బిల్లును ఇతర పార్టీలు వ్యతిరేకించేసాహసం చేయవు. ఇదొక మాస్టర్ స్ట్రోక్ మాత్రమే. ముమ్ముందు మరిన్ని సంచలనాలుంటాయ్. మోడీ మరిన్ని సిక్సర్లు, ఫోర్లు బాదేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి వ్యాఖ్యానించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడైన అథవాలె అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లకు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ నిర్ణయంతో బ్రాహ్మణులు, బనియన్లు, క్రిస్టియన్లు, ముస్లింలకు లబ్ధి కలగనుంది. ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను అర్థంచేసుకుంది. వారి మనోభావాలను గౌరవించింది. దీన్ని రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి విజయ్ సంప్లా వెల్లడించారు. కాగా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మా పార్టీకి అగ్రవర్ణాలు దన్నుగా నిలిచాయి. అందువల్ల ఓట్ల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామన్న విమర్శలు సరికాదు. ఉత్తరప్రదేశ్‌లో గత లోక్‌సభ ఎన్నికల్లోనూ, తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లోనూ భాజపా తిరుగులేని విజయం సాధించింది. ఈ నేపథ్యంలో దీనికి రాజకీయ కోణం ఆపాదించడం సరికాదని మరో కేంద్రమంత్రి శివ్‌ప్రసాద్ శుక్లా అభిప్రాయపడ్డారు.

ఎన్నికల రాజకీయం: కాంగ్రెస్

నాలుగున్నరేళ్ల కాలంలో దీని గురించి ఎందుకు పట్టించుకోలేదు. సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందే ఎందుకు ప్రకటించారు? కేంద్రం వ్యవహార తీరును చూస్తుంటే ఇదొక ఎన్నికల జిమ్మిక్కుగా కనిపిస్తోంది కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. నాలుగేళ్ల 8 నెలలు అధికారంలో ఉన్న బీజేపీ, ఉన్నఫలాన ఇప్పుడు సంచలన ప్రకటన చేయడం శోచనీయమని విమర్శించాయి. దళితులు, గిరిజనులు, ఓబీసీ రిజర్వేషన్లకు ఆటంకం లేకుండా అగ్రవర్ణపేదలకు రిజర్వేషన్లు ఇస్తే తమకెలాంటి అభ్యంతరం లేదని ఆ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జెవాల స్పష్టం చేశారు. ఈబీసీ రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో తాము కూడా మద్దతిస్తామని, దీనిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అలాకాకుండా, కేవలం ఎన్నికల లాభాపేక్షతో ప్రజలను మోసం చేయాలని చూస్తే రణక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

పచ్చిమోసం

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల ప్రకటన పచ్చిమోసం. దీనికి న్యాయపరమైన చిక్కులున్నాయి. రాజ్యాంగ సవరణకు పార్లమెంట్ సమావేశాల్లో సమయం కూడా లేదు.

– యశ్వంత్ సిన్హా, మాజీ కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నేత.

ఆర్టికల్ 15, 16 ఎస్సీ,ఎస్టీ, సామాజిక వెనుకబాటు రిజర్వేషన్లకు ఉద్దేశించినది. ఒకవేళ అగ్రవర్ణాలకు ఇలాంటి చట్టాన్ని తీసుకురావాలని భావిస్తే పార్లమెంట్‌లో దీనిపై చర్చించాలి. సంచలన ప్రకటనలతో, పతాక శీర్షికల్లో నిలవడమే బీజేపీ ప్రభుత్వం ప్రాధాన్యతగా కనిపిస్తోంది.

– మనోజ్ ఝా, ఆర్జేడీ నేత

బాబా సాహెబ్ అంబేడ్కర్ కుల ఆధారిత రిజర్వేషన్లు కాకుండా, ఆర్థిక అసమానతల ఆధారిత రిజర్వేషన్లు ఉండాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయం ఇందుకు అనుగుణంగానే ఉంది. ఎంతమేరకు ఆచరణ సాధ్యమవుతుందో? కేంద్రం ఎలాంటి అడుగులు వేస్తుందో? చూడాలి.

– సావంత్, శివసేన ఎంపీ.

ఈ సమావేశాల్లోనే పార్లమెంటు ముందుకు తేవాలి. ఉభయసభల్లో రాజ్యాంగ సవరణకు చొరవచూపాలి. లేదంటే ఎన్నికల స్టంట్‌గానే భావించాల్సి ఉంటుంది. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు మేం మద్దతిస్తాం.

– కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

ఇప్పటికే చాలా ఆలస్యమైంది. నాలుగున్నరేళ్లుగా ఈ అంశాన్ని విస్మరించి, ఇప్పుడు ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారు. దీనిద్వారా లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందా లనుకునే కుట్రను ప్రజలు తిప్పికొడతారు.

– హరీష్ రావత్, ఉత్తరాఖండ్ మాజీ సీఎం

భాజపా అమ్ములపొదిలో చివరి అస్త్రం ఇదే. బ్యాంకు ఖాతాల్లో రూ 15లక్షలు, రామ మందిరం లాంటి జిమ్మిక్కుగానే మిగిలిపోతుంది. మోడీ ఇచ్చే చివరి లాలిపాప్ ఇదే. వారి మోసాలను ప్రజలు నమ్మరు. **– హార్దిక్ పటేల్, గుజరాత్ నేత**

ముందు మా వాటా తేల్చండి

• జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి • మోడీకి దమ్ముంటే బీసీలకు 53 శాతం రిజర్వేషన్లపై తేల్చాలి: ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన కేంద్ర కేబినెట్ నిర్ణయంపై బీసీ సంఘాలు, బీసీలు మండిప డుతున్నారు. తమకు జనాభా దామాషా ప్రకారం రావల్సిన రిజ్వేషన్లను అమలు చేసిన తరువాతనే ఇతరుల గురించి ఆలోచించాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పేదల రిజర్వే షన్లపై ఈబీసీ సంక్షేమ సంఘం హర్షం ప్రకటించింది. అలాగే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించే కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని సీపీఎం స్వాగతించగా లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్‌నారాయణ స్వాగతించారు.

రాజ్యాంగ సవరణ చేయాలి

ప్రధాని నరేంద్ర మోడీకి దమ్ముంటే బీసీలకు 53 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయం అనంతరం ఆయన సంఘం నేతలు గుజ్జ కృష్ణ, రామలింగం, జైపాల్ ముదిరాజ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం రిజర్వేషన్ల మూలసిద్ధాంతానికి విరుద్ధమని మండిపడ్డారు. రిజర్వేషన్లు పేదరికనిర్మూలన కోసం రూపొందించినవి కావని కులవివక్ష, సామాజిక వివక్ష ఎదుర్కొంటున్న వారిని మిగిలిన వారితో సమానంగా తీసుకురావడం కోసం రిజర్వేషన్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అగ్రవర్ణాల్లో పేదలు ఉంటే వారిని ఆర్థికంగా ఆదుకోవాలని సూచించారు. కానీ వారికోసం రిజర్వేషన్లను అమలు చేస్తామనడం సరికాదన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం రాజకీయ అవసరాల కోసమే బీజేపీ ఇటువంటి నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. సామాజికంగా ఉన్నతస్థానంలో ఉన్న అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రిజర్వేషన్లపై చట్టపరంగా, న్యాయపరంగా, ప్రజా ఉద్యమాలతో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దండప్రయోగం చేస్తామంటే ఊరుకోమని, ఆధిపత్యం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని, అలాగే కేంద్రం బెదిరింపులకు బీసీలు భయపడేది లేదన్నారు. రాజ్యాంగ సవరణ చేయాలంటే అగ్రవర్ణాల కోసం కాకుండా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లను ఇవ్వడం కోసం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. 29 రాష్ట్రా లకు గవర్నర్లు ఉన్నారని వారిలో ఒక్కరు కూడా బీసీ లేడని.. అదేవిధంగా 29 జాతీయ బ్యాంకులున్నాయని వాటికి ఛైర్మన్‌గా ఒక్క బీసీ కూడా లేడని అన్నారు. మోడీకి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించడంపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీల సంగతి తేల్చండి

జనాభా దామాషా ప్రకారం ముందుగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని.. ఆ తరువాతనే అగ్రవర్ణ పేదల గురించి ఆలోచించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని ఆయన మండిపడ్డారు. వివిధ సంఘాల నేతలు కనకాల శ్యాం కురుమ, టి విక్రంగౌడ్, జాజుల లింగం గౌడ్, వరికుప్పల మధు, మల్లిఖార్జున్ యాదవ్, బత్తిని రాజుతో కలిసి ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ఎందుకు కల్పించరని ప్రశ్నించారు. రిజర్వేషన్ల మూల సిద్ధాంతానికి విరుద్ధంగా అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించకుండా అగ్రవర్ణాల లబ్ధికి యత్నించడం అత్యంత విచారకరమన్నారు. దేశంలో ఉన్న గుప్పెడు మంది చేతిలో గంపెడు అధికారాలున్నాయని.. కానీ గంపెడు ఉన్న బీసీలకు మాత్రం గుప్పెడు అధికారాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ విధించి ఇప్పుడు అగ్రవర్ణ పేదల కోసం రిజర్వేషన్లు అంటే ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. రూ. 24 లక్షల కేంద్ర బడ్జెట్‌లో 56 శాతం ఉన్న బీసీలకు కేటాయించింది కేవలం రూ. 900 కోట్లేనని మండిపడ్డారు.


చారిత్రక నిర్ణయం : ఈబీసీ సంక్షేమ సంఘం

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రక నిర్ణయమని ఈబీసీ సంక్షేమ సంఘం అభిప్రాయపడింది.

కోర్టులో నిలుస్తుందో లేదో చెప్పలేం


హైదరాబాద్, ఆంధ్రప్రభ: రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు నిర్ణయానికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం మరో పది శాతం ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్ల ప్రతిపాదన చేయడం కోర్టులో ఏ మేరకు నిలుస్తుందో అనుమానమేనని సీనియర్ అడ్వకేట్ ఎస్.రామచంద్రరావు అన్నారు. సమానత్వం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలని సుప్రీంకోర్టు భావిస్తే కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం నిలువదని రామచంద్రరావు అన్నారు. రాజ్యాంగ సవరణ చేసి ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లు పెంచినప్పటికీ సుప్రీంకోర్టు తోసిపుచ్చే అవకాశాలు లేకపోలేదని రామచంద్రరావు అన్నారు. రాజ్యాంగ సవరణ అంతగా పట్టించుకోనవసరం లేదని, ప్రభుత్వాలు కుడిచేతితో ఇచ్చి ఎడమచేతితో తీసుకుంటున్నప్పుడు ఈ సవరణలకు ప్రాధాన్యత ఏముంటుందని అన్నారు. రిజర్వేషన్లు 60 శాతానికి పెరిగితే మిగిలిన 40 శాతంలో కూడా ఈ రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులు అర్హత సాధించవచ్చని, అలాంటప్పుడు సమానత్వానికి అర్థం లేకుండా పోతుందని ఆయన అన్నారు.

రిజర్వేషన్లను స్వాగతించిన సీపీఎం



ఈబీసీలకు విద్యా, ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ చేసిన నిర్ణయాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతించింది. అగ్రవర్ణాలలోని పేదలకు రిజర్వేషన్లను కల్పించాలనీ, కర్పూరీ ఠాకూర్ ఫార్ములాన్ని అమలు చేయాలని సీపీఎం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తకుండా ఎన్నికల ముందే ఈ నిర్ణయాన్ని ప్రకటింటం ఎన్నికల జిమ్మిక్కని స్పష్టమవుతుందన్నారు.

మోడీ నిర్ణయం మంచిదే



ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికి ఉద్యోగాలలో పది శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ ఎన్. జయప్రకాష్ నారాయణ స్వాగతించారు. ఇది ఒక మంచి ని ర్ణయమేనని తాను భావిస్తున్నానని, అయితే ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందో చూడాల్సివుందన్నారు. రిజర్వేషన్లపై కలహాలు చోటు చేసుకుం టున్న తరుణంలో పేదరికంలో కొట్టుమిట్లాడుతున్న వారికి రిజర్వేషన్లు కల్పించాలని లోక్‌సత్తా కూడా అదినుండి డిమాండ్ చేస్తూనే ఉందని సోమవారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జయప్రకాష్‌నారాయణ తెలిపారు.

అందరికి సమాన అవకాశాలు



అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఈ రిజర్వేషన్ల వల్ల అందరికీ సమాన అవకాశాలు కలుగుతాయన్నారు. గతంలో ఎన్డీఏ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం కమిషన్ వేశారని, తర్వాత వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కమిషన్‌ను పరిశీలించకుండా పక్కకు పెట్టిందని పేర్కొన్నారు.

రిజర్వేషన్ల తుట్టెను కదిపారా?

• 10 శాతం నిర్ణయం 2019 ఎన్నికల్లో కలిసొస్తుందా? • మండల్ -కమండల్ అనుభవం ఏం చెబుతోంది? • బీజేపీని అగ్రవర్ణాల పార్టీగా భావించే ప్రమాదముందా? • రిజర్వేషన్ల కోసం మరిన్ని వర్గాల నుంచి ఆందోళనలు?



న్యూఢిల్లీ: అగ్రవర్ణాల ఓట్ల కోసమే సరిగ్గా ఎన్నికల ముందు ప్రధాని మోడీ రిజర్వేషన్ ఎత్తుగడ వేశారని, దీంతో బీజేపీకి పెద్దగా లాభించేది ఏమీ ఉండదని పరిశీలకులు అంటున్నారు. జనరల్ కేటగిరిలోని ఆర్థికంగా వెనుకబడిన వారికి పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలన్న బీజేపీ నిర్ణయం అగ్ర వర్ణాల వారి మనస్సులను చూరగొంటుందా అన్నది ప్రశ్నార్థకమేనంటున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దళిత నేతలు మండిపడుతున్నారు. అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్లు దళిత వర్గాల ప్రయో జనాలకు వ్యతిరేకం కాదన్న అభిప్రా యాన్నీ వ్యక్తం చేస్తున్నారు.

కొత్త అధ్యాయం

మోడీ కారణంగా అగ్రవర్ణాల్లో చీలి కలు ఏర్పడతాయని, వారిలో పేద, ధనిక తేడా లతో విభేదాలకు ఆజ్యం పోసినట్లవుతుందనే భావన వ్యక్తమవుతోంది. మధ్యప్రదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాడు తున్న మాజీ ఐఏఎస్ అధికారి హీరాలాల్ త్రివేది మాట్లాడుతూ.. అగ్రవర్ణాలకు ఇచ్చే రిజర్వేషన్లు యాభై శాతం పరిధిలోకి తీసుకొని రావాలన్నారు. రిజర్వు చేయని కోటాలో పది శాతం అగ్ర వర్ణాలకు కేటాయించడం సుప్రీంకోర్టు నిర్ణయానికి విరుద్ధమన్నారు. కులాల ఆధారంగా రిజర్వేషన్లను రద్దు చేయాలని వాదిస్తున్న హీరాలాల్... తాజా చర్యతో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌కి తొలి అడుగు పడిందన్నారు.

మండల్-కమండల్‌తో నష్టపోయిన కాంగ్రెస్

2014 సాధారణ ఎన్నికల్లో నరేంద్రమోడీ ప్రధాని అభ్యర్థిగా బీజేపీ అగ్రవ ర్ణాల పార్టీ కాదనే భావనను జాతీయ స్థాయిలో కల్పిం చడంలో విజయం సాధిం చారనే భావన వ్యక్తమ వుతోంది. దీంతోనే వెనుబ డిన వర్గాలతో పాటు, దళితులు సైతం బీజేపీకి పెద్ద యెత్తున ఓట్లేశారని విశ్లేషకులు అంటున్నారు. మోడీ ప్రభుత్వం తాజా నిర్ణయం విపక్షాలకు ఎన్నికల్లో ఆయుధం గా మారుతుందనే వాదిస్తున్నారు. 2014లో అభివృద్ధే లక్ష్యంగా ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీకి 2019 సార్వత్రిక ఎన్నికల్లో కులాలు, రిజర్వేషన్ల అంశం ప్రధాన ప్రచార అంశం కావడం ఓట్ల పరంగా ఇబ్బందే అనే వాదనా ఉంది. ఈ అయిదేళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలు, చేసిన అభివృద్ధి తెర వెనక్కి పోయే ప్రమాద ముందనీ హెచ్చరిస్తున్నారు. మోడీ ప్రభుత్వం తాజా నిర్ణయంతో రిజర్వేషన్ల తేనెతుట్టెని కదిపినట్లవుతుందని, గుజరాత్‌లో పటీదార్లు, ఆంధ్రప్రదేశ్‌లో కాపులు, హరియాణాలో జాట్లు తమకు కూడా రిజర్వేషన్లు కావాలని మరింత ఉధృతంగా ఉద్యమం చేసే అవకాశముందనే భావన వ్యక్తమవుతోంది. ఇక రాజస్థాన్‌లో గుజ్జర్లు తమను ఓబీసీ కేటగిరీ నుంచి ఎస్టీ జాబితాలో మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక ఉత్తరప్రదేశ్‌లో సవాజ్‌వాదీ పార్టీ, బీహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ వంటి పార్టీలకు కేంద్రం తాజా నిర్ణయం ఎన్నికల అస్త్రంగా మారే అవకాశముందంటున్నారు. ఆయోధ్యలో రామమందిరం నిర్మాణం అంశంతో హిందువుల ఓట్లను రాబట్టాలనే వ్యూహం కూడా తాజా నిర్ణయంతో దెబ్బ తినే ప్రమాదముందంటున్నారు. 1990ల్లో మండల్- కమండల్ చర్చతో కాంగ్రెస్ పార్టీ అటు అగ్రవర్ణాలు, ఇటు వెనుక బడి న తరగతుల ఓటు బ్యాంకును పోగొ ట్టుకున్న దృష్టాంతాన్ని విశ్లేషకులు గుర్తు చేస్తున్నా రు. ఇక మోడీ, రాహుల్ వ్యక్తిత్వాల పరంగా 2019 ఎన్నికలను ఎదుర్కో వాలని భావిస్తున్న బీజేపీకి తాజా నిర్ణయం ఒకింత దెబ్బే అనే అంటున్నా రు. అగ్ర వర్ణాలకు రిజర్వేషన్లే ప్రధాన ఎన్నికల ప్రచార అస్త్రంగా మారుతుందని, దీంతో ప్రధాని మోడీ వ్యక్తిత్వం, నాయకత్వం మరుగున పడే ప్రమాదముందని, దీని ఫలితంగా కూడా బీజేపీ ఓటు శాతం తగ్గే ప్రమాదముందనీ హెచ్చరిస్తున్నారు.


అగ్ర పేదలను ఎలా గుర్తిస్తారు?

అయితే అగ్రవర్ణాల్లో పేదలు గుర్తించడం అత్యంత కష్టమైన పని అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ అఖిల భారత సర్వీసుల అధికారి అభిప్రాయపడ్డారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉన్న అగ్రవర్ణాలు కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం లబ్ధి పొందరని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయం జనరల్ కేటగిరిలోని అభ్యర్థులను మరింత ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. జనరల్ కేటగిరీని సబ్ కేటగిరీలుగా విడదీయడం కూడా కష్టసాధ్యమేనన్నారు.

రాజ్యసభ సమావేశాలు ఒకరోజు పొడిగింపు

ఎంపీలకు విప్ జారీ చేసిన బీజేపీ, కాంగ్రెస్

10 శాతం అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ బిల్లు నేపథ్యంలో రాజ్యసభ సమావేశాలను బుధవారం వరకు పొడిగించారు. నేడు లోక్‌సభకు వస్తున్న ఈ బిల్లును, పెద్దల సభకూడా ఆమోదించాల్సి ఉంది. అందుచేత సమావేశాలను ఒకరోజు పొడిగించాల్సిందిగా ప్రభుత్వం, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడికి విజ్ఞప్తి చేసింది. ఇందుకు ఉపరాష్ట్రపతి ఆమోదం తెలిపారు. కాగా, కీలక బిల్లు పార్లమెంటు ముందుకు వస్తున్నందున, సభ్యులంతా తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని ఆదేశిస్తూ కాంగ్రెస్, బీజేపీ తమ పార్టీ ఎంపీలకు విప్ జారీచేసింది. కాగా డిసెంబర్ 11నుంచి ప్రారంభమైన శీతాకాల సమావేశాల్లో ఇప్పటి వరకు 11 బిల్లులు ఆమోదానికి నోచుకున్నాయి.



ముంబై : ప్రపంచంలోనే అతి పొడవైన సీసీఆర్ రియాక్టర్ ఇది. ముంబై నుంచి నైజీరియాలోని డాగోనైట్ ఆయిల్ రిఫైనరీకి తరలిస్తున్న దృశ్యం

•నామినేషన్ల పర్వం

తొలిరోజు 3030

• సిద్దిపేటలో అత్యధికంగా 257 నామినేషన్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తొలిదశలో 30 జిల్లాల పరిధిలోని 4337 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్రంలో అన్ని పంచాయతీలకు కలిపి సర్పంచ్ స్థానాలకు 3030 నామినేషన్లు దాఖలయ్యాయి. సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా 257నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ 186 గ్రామ పంచాయతీలకు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 258 పంచాయతీల్లో 239, నల్లగొండజిల్లాలో 304పంచాయతీల్లో 213 నామినేషన్లు దాఖలయ్యాయి. మహబూబ్ నగర్ జిల్లాలో 195 నామినేషన్లు , అదిలాబాద్‌లో 53, ఆసిఫాబాద్‌లో 34, మంచిర్యాలలో 59, నిర్మల్‌లో 93, జగిత్యాల్‌లో 124, కరీంనగర్‌లో 121, పెద్దపల్లిలో 134, భద్రాద్రి కొత్తగూడెంలో 23, ఖమ్మంలో 123 నామినేషన్లు దాఖలయ్యాయి. జోగులాంబ గద్వాలలో 25, నాగర్‌కర్నూల్‌లో 88, వనపర్తిలో 36, మెదక్‌లో 110, సూర్యాపేటలో 113, యాదాద్రి భువనగిరిలో 97, కామారెడ్డిలో 162, మేడ్చెల్ మల్కాజిగిరిలో 28, నిజామాబాద్‌లో 206, రంగారెడ్డిలో 100, వికారాబాద్‌లో 88నామినేషన్లు దాఖలయ్యాయి. జనగాంలో 53, జయశంకర్ భూపాలపల్లిలో 77, మహబూబాబాద్‌లో 55, వరంగల్ రూరల్‌లో 89, వరంగల్ అర్బన్‌లో 35నామినేషన్లు దాఖలయ్యాయి.

వార్డులకు 3827 నామినేషన్లు

రాష్ట్రంలో తొలిదశ కింద ఎన్నికలు జరుగుతున్న వార్డు స్థానాలకు కూడా నామినేషన్లు మందకొడిగానే మొదలయ్యాయి. తొలిదశలో 39100 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో సోమవారం 3827 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఉమ్మడి కరీంనగర్‌లో మందకొడిగా...

• సర్పంచ్‌లకు 462 నామినేషన్లు

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో: కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల పర్వం మందకొడిగా సాగింది. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని కొన్ని గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మరో రెండు రోజులు నామినేషన్ల ఘట్టం ఉండటంతో మంగళ, బుధవారాల్లో జోరుగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని 334 పంచాయతీలకు గాను సర్పంచ్ స్థానాలకు 378 నామినేషన్లు, 3036 వార్డులకు గాను 520 నామినేషన్లు దాఖలయ్యాయి.

● కరీంనగర్ జిల్లాలో 97 గ్రామపంచాయతీలకు గాను 126 నామినేషన్లు, 928 వార్డులకు 271 నామినేషన్లు దాఖలైనాయి. కరీంగనర్, కొత్తపల్లి మండలాల్లోని 25పంచాయతీల్లో సర్పంచ్ స్థానానికి 35 నామినేషన్లు, వార్డు సభ్యులకు 130 నామినేషన్లు వచ్చాయి. చొప్పదండి మండలంలో 16 సర్పంచ్ స్థానాలకు 11 నామినేషన్లు, 154 వార్డులకు 42, రామడుగు మండలంలో 23 పంచాయతీల్లో సర్పంచ్‌కు 33, వార్డు మెంబర్లకు 67 నామినేషన్లు వచ్చాయి. గంగాధర మండలంలో 33 పంచాయతీలకు 47, 296 వార్డు మెంబర్లకు 42 నామినేషన్లు దాఖలయ్యాయి.

● జగిత్యాల జిల్లాలో 131 గ్రామ పంచాయతీలకు గాను 69 గ్రామ పంచాయతీల్లో 124 నామినేషన్లు దాఖలైనాయి. మొత్తం 1146 వార్డులకు గాను 136 నామినేషన్లు దాఖలైనాయి. వెల్గటూరు మండలంలో 20 పంచాయతీలలో 38 నామినేషన్లు 274 వార్డుల్లో 51 నామినేషన్లు, ధర్మ పురిలో 17 జీపీల్లో 26, 224 వార్డుల్లో 15 నామినేషన్లు, బుగ్గారంలో 4 జీపీల్లో 5 నామినేషన్లు, 104 వార్డుల్లో 7నామినేషన్లు దాఖలయ్యాయి. సారంగాపూర్‌లో 11 జీపీల్లో 16, 144 వార్డుల్లో 24 నామినేషన్లు, బీర్‌పూర్‌లో 9 జీపీల్లో 18, 124 వార్డులకు 6 నామినేషన్లు, రాయికల్‌లో 8 మండలాల్లో సర్పంచ్ స్థానానికి 18 నామినేషన్లు, 278 వార్డులకు 33 నామినేషన్లు దాఖలైనాయి.

● పెద్దపల్లి జిల్లాలో మొదటి విడత మొదటి రోజు 106 గ్రామ పంచాయతీలకు గాను 134 నామినేషన్లు దాఖలైనాయి. మొత్తం 962 వార్డు సభ్యులకు గాను 113 నామినేషన్లు దాఖలైనాయి. మండలాల వారీగా మంథనిలో 34 పంచాయతీలకు 44 నామినేషన్లు, 276 వార్డులకు 35 నామినేషన్లు, మంథని ముత్తారం మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లో 9 నామినేషన్లు, 134 వార్డులకు గాను 3 నామినేషన్లు, కమాన్‌పూర్‌లో 9 గ్రామ పంచాయతీలకు గాను 12 నామినేషన్లు, 92 వార్డులకు గాను 10 నామినేషన్లు, రామగిరిలో 16 జీపీలకు గాను 14 , 168 వార్డులకు 18, పాలకుర్తి మండల పరిధిలలోని 19 జీపీలకు గాను 33 నామినేషన్లు, 180 వార్డులకు 40 నామినేషన్లు దాఖలైనాయి. అంతర్గాం మండలంలో 14 జీపీలకు గాను 22 నామినేషన్లు, 122 వార్డులకు ఏడు నామినేషన్లు దాఖలైనాయి.

● రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడతలో గ్రామపంచాయతీలకు 81 నామినేషన్లు, వార్డు మెంబర్లకు 132 నామినేషన్లు దాఖలయ్యాయి. వేములవాడ అర్బన్ మండలంలో 11 గ్రామాల్లో సర్పంచ్‌కు 23 నామినేషన్లు, వార్డు మెంబర్‌కు 29 నామినేషన్లు దాఖలయ్యాయి. వేములవాడ రూరల్‌లో సర్పంచ్‌కు 13, వార్డుమెంబర్‌కు 35 నామినేషన్లు, చందుర్తి మండలంలో సర్పంచ్‌కు 13, వార్డుమెంబర్‌కు 1 నామినేషన్, రుద్రంగి మండలంలో సర్పంచ్‌కు 05, వార్డుమెంబర్‌కు 13 నామినేషన్లు, బోయినపల్లిలో సర్పంచ్‌కు 27, వార్డు మెంబర్‌కు 54 నామినేషన్లు దాఖలయ్యాయి.


ఉమ్మడి రంగారెడ్డిలో 223

• వార్డు సభ్యులుగా 336 • శంషాబాద్‌లో 35

రంగారెడ్డి, ప్రభన్యూస్: పాడ్యమి తిథియ సోమవారం మంచిరోజు కావడంతో ఆశావహులు జోరుగా నామినేషన్లు వేశారు. శంషాబాద్ మండలంలోనే అత్యధిక నామినేషన్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని షాద్‌నగర్, తాండూరు, కొడంగల్, మేడ్చల్ నియోజకవర్గాల పరిధిలో మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో సోమవారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో సర్పంచ్ పదవులకు 100 నామినేషన్లు, వార్డుమెంబర్లకు 193 నామినేషన్లు వేశారు. తాండూరు నియోజకవర్గంలో సర్పంచికి 54, వార్డుమెంబర్లకు 49, కొడంగల్ నియోజకవర్గంలో సర్పంచి పదవికి 34, వార్డుమెంబర్లకు 22 నామినేషన్లు వేశారు. శంషాబాద్ మండలంలో సర్పంచికి 35 నామినేషన్లు వార్డులకు సంబంధించి 72 నామినేషన్లు వేశారు. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని కీసర మండలంలో సర్పంచులకు 15 నామినేషన్లు, వార్డుమెంబర్లకు 68 నామినేషన్లు దాఖలు చేశారు. శామీర్‌పేట మండలంలో సర్పంచి పదువులకు గాను 13 నామినేషన్లు, వార్డుమెంబర్ల ఎన్నికకు గాను 52 నామినేషన్లు దాఖలు చేశారు.

షరతులు పెట్టారని..

ఒగులాపూర్ సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్యాయత్నం



జగిత్యాల , ప్రభన్యూస్ : జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండలం ఒగులాపూర్ గ్రామపంచాయతీ ఏకగ్రీవం వివాదాస్పదమైంది. జగిత్యాల మండలంలో ఇప్పటివరకు తండాగా ఉన్న ఒగులాపూర్ ఇటీవలే గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులను గ్రామస్తులు రెండు రోజుల క్రితం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రూ.5 లక్షలు గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం ఇచ్చిన వారినే సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని గ్రామస్తులు షరతు విధించడంతో, దేవదాస్ రూ.2 లక్షలు ఇచ్చాడు. మిగతా రూ.3 లక్షలు కొద్దిరోజుల్లో ఇస్తానని చెప్పడంతో, అతనినే సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా రూ.5 లక్షలను ఒకేసారి ఇవ్వాలని, లేకపోతే ఏకగ్రీవం చెల్లదని కొందరు ప్రచారం చేయడంతో, మనస్తాపానికి గురైన దేవదాసు సోమవారం సాయంత్రం విషగుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు దేవదాసును మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.



అక్కడ 'ఆమె'దే అధికారం

• సర్పంచ్ సహా వార్డు సభ్యులు అందరూ మహిళలే • రెండు పర్యాయాలు అదే ఆనవాయితి.. ఏకగ్రీవ బాటలోనే పయనం
• భయాన్ని తరిమిన చద్మల్...
• ఆదర్శంగా నిలిచిన పంచాయతీ



నిజామాబాద్ , ప్రభన్యూస్ బ్యూరో: ఒకనాడు ఆ గ్రామం పేరు చెబితే భయపడేవారు. నక్సలైట్లకు స్థావరంగా ఉండేది. జిల్లాలోనే అత్యంత భయంకరమైన ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం అది. అక్కడ ఎన్నికలంటేనే ప్రజలు దూరంగా ఉండేవారు. ఎక్కడైతే భయం నెలకొందో అక్కడే ఆదర్శం మొదలైంది. ప్రజలంతా ఏకమయ్యారు. అనేక సంవత్సరాల తర్వాత ఆ గ్రామ ప్రజలు ఒక్కటిగా ఆలోచించారు. రాష్ట్రంలో మన గ్రామం ఆదర్శంగా నిలవాలని సంకల్పించారు. వినూత్న తీర్పుకు శ్రీకారం చుట్టారు. జిల్లా ప్రజలే కాదు. ఏకంగా రాష్ట్ర ప్రజలను ఆలోచించేలా చేసింది ఆ గ్రామ ప్రజల తీర్పు. నిత్యం పోలీసుల బూట్ల చప్పుళ్లతో మావోయిస్టుల మారణకాండతో దద్దరిల్లే చద్మల్ గ్రామమే ఓ వినూత్న తీర్పుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలోని గాంధారి మండలంలో చద్మల్ గ్రామం ఉంది. రెండు పర్యాయాలుగా అక్కడి సర్పంచ్ సహా వార్డు సభ్యులందరూ మహిళలే. పదేళ్లుగా అతివల పాలనతో ఆ గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది.



వినూత్నంగా ఉండాలనే మహిళలతో పాలకవర్గం

చద్మల్ గ్రామం అభివృద్ధితో పాటు వినూత్నంగా ఉండేలా జిల్లా లోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచేందుకు మహిళ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాం. ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా గ్రామస్థులంతా ఐక్యమత్యంగా తీసుకున్న నిర్ణ యం రెండు పర్యాయాలు గ్రామంలో చక్కని వాతా వరణాన్ని తీసుకువచ్చింది. ప్రభుత్వం నజరా నాతో పాటు ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా గ్రామం లో అభివృద్ధి జరుగుతోంది.

అతివల పాలనలో చద్మల్ ఆదర్శం


ఎన్నికలు అంటే ఎంతో భయపడ్డ ఆ గ్రామం రాష్ట్రంలోనే వినూత్న తీర్పుకు సిద్ధమైంది. గ్రామ ప్రజలంతా ఐక్యంగా ఏకగ్రీవంగా రెండు పర్యాయాలు మహిళలనే గ్రామ పాలకవర్గంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రిజర్వేషన్లు కొంతమేర అనుకూలించగా, మరికొంత మేర వెసులుబాటు చేసుకుని సర్పంచ్‌తో సహా వార్డు సభ్యులను అందరినీ మహిళలతో కొలువుదీర్చారు. గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకుని జిల్లాలోని అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. 2007, 2013 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహిళ సర్పంచులు, వార్డు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకోవడమే కాదు. గ్రామాన్ని అభివృద్ధి దిశగా మలిచి మహిళలు పాలనలో రాణిస్తారని నిరూపించారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా అభివృద్ధే లక్ష్యంగా రెండు పర్యాయాలు మహిళ పాలకవర్గం రాణించింది. అధికారులు ఆ గ్రామం అభివృద్ధి పట్ల ఓ కన్నువేసి గ్రామాభివృద్ధికి సహకారం అందించారు. అభివృద్ధికి ఆమడ దూరంగా మావోల కదలికతో బిక్కుబిక్కుమన్న గ్రామంలో నేడు ప్రజలు ప్రజాస్వామ్య రీతిలో తమ హక్కులను సాధించుకున్నారు.

2013 పాలకవర్గం ఇదే

2013లో ఏకగ్రీవంగా సర్పంచ్ సహాపది మంది వార్డు సభ్యులను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా శశికళ మరాఠీ, ఉపసర్పంచ్‌గా లక్ష ప్రేమ్‌సింగ్‌లు ఎన్నుకోబడ్డారు. వార్డు మెంబర్లుగా చాకలి హన్మవ్వ, మలోత్ కోంటి, మేకే ఆశవ్వ, మంజ్యా సుంద్రాబాయి, మంధ్యా పద్మ, బామన్ లక్ష్మీ, మాలి సంగీత, బన్సి సంగీత, బన్సీ కృష్ణ, బన్సీ గీతాబాయిలు వార్డు మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

అదృష్టం దక్కింది

చద్మల్ మహిళ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశం నాకు దక్కింది. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో గ్రామస్థులు నాకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో నిలపడంలో నావంతు కృషి చేశాను. రాబోయే పాలకులు కూడా చద్మల్ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి భావి తరాలకు స్ఫూర్తిగా నిలవాలి.



రెండుసార్లు ఏకగ్రీవం

చద్మల్ గ్రామం అంతచిన్నదేమీ కాదు. 2954 మంది జనాభా ఉన్న గ్రామంలో మహిళలు, పురుషులు దాదాపు సరిసమానమే. అయినా మహిళ సాధికారత కోసం గ్రామ ప్రజలు తీసుకున్న నిర్ణయం మహిళలను ఉన్నత స్థానంలో నిలిపింది. 2954 గ్రామ జనాభాలో పురుషులు 1458 మంది కాగా మహిళలు 1496 మంది ఉన్నారు. సర్పంచ్‌తో పాటు పది మంది వార్డు సభ్యులు ఉన్నారు. మొత్తం ఓటర్లు 1426 మంది కాగా 702 మంది పురుషులు, 722 మంది మహిళలు ఉన్నారు. ఇదిలా ఉంటే రెండు పర్యాయాలు 2007, 2013లో ఏకగ్రీవంగా గ్రామపాలక వర్గాన్ని ఎన్నుకుని రాష్ట్ర ప్రభుత్వ నజరానాను అందుకుంది చద్మల్ గ్రామం. 2007లో కళావతి, బంతీలాల్ ఏకగ్రీవంగా ఎన్నుకోగా 2013లో శశికళ మరాఠీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సారి కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి గ్రామస్థులు చొరవ తీసుకుంటున్నారు. ఎలాంటి వేలంపాటలు, డబ్బులు చెల్లింపులు లేకుండా ప్రజాస్వామ్యయుతంగా పాలకవర్గాన్ని ఎన్నుకుని ఆదర్శంగా నిలవడంలో చద్మల్ గ్రామం ముందు వరుసలో ఉంది.

పోలవరం.. ప్రపంచ రికార్డ్

దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు



ఏలూరు, ప్రభన్యూస్: ప్రపంచంలోనే ఎవరూ సాధించలేని రికార్డ్‌ను పోలవరం ప్రాజెక్ట్ ద్వారా తమ ప్రభుత్వం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం పనుల్లో గిన్నీస్‌రికార్డ్ సాధించినట్లు చెప్పారు. ప్రాజెక్ట్ కాంక్రీట్ పనుల్ని సందర్శించిన చంద్రబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. పాత రికార్డు 21,580 క్యూబిక్ మీటర్లను తాజా పనుల ద్వారా అధిగమించి ప్రపంచ రికార్డు సాధించగలిగామన్నారు. ఈ రికార్డ్‌ను భవిష్యత్తులో ఎవరూ అధిగమించలేరని స్పష్టం చేశారు. ఇదంతా రాత్రికి రాత్రే సాధించిందికాదన్నారు. ఈ పనులవెనుక నాలుగేళ్ళ శ్రమ ఉందని బాబు పేర్కొన్నారు. పనుల్లో ఎన్నో ఆటంకాల్ని ఎదుర్కొన్నాము.. పోరుగు రాష్ట్రాలే కాదు... ప్రతిపక్షాలుకూడా పనుల్ని అడ్డుకోవడానికి కుట్రలు పన్నాయన్నారు. జాతీయ హోదా ప్రకటించిన కేంద్రం దీని నిర్మాణానికి సంబంధించి అవార్డులిచ్చిందని, అయితే ఇవ్వాల్సిన నిధులివ్వకుండా అడ్డుకుందని ఆరోపించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో కలిపి మొత్తం ప్యాజెక్ట్ వ్యయం 58వేల కోట్లు అవుతుందన్నారు. 50వేల కోట్లు ప్రాజెక్ట్ కాస్ట్ డిపిఆర్ ఇచ్చామన్నారు. ప్రాజెక్ట్ అంచనాల్లో 33,335కోట్లు ఆర్ఆర్ ప్యాకేజీకి అవసరమౌతాయన్నారు. ప్రాజెక్ట్ కోసం 15,581.17 కోట్లు ఖర్చుపెట్టామన్నారు. ఇందులో 6,727కోట్లు మాత్రమే కేంద్రమిచ్చిందన్నారు. జాతీయ హోదా ప్రకటించిన కేంద్రం నిధులివ్వకపోవడంతో ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరాన్ని అష్టకష్టాలు పడైనా పూర్తి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర నిధుల్ని వెచ్చించి పనుల్ని కొనసాగించామన్నారు. రాష్ట్రం చేసిన వ్యయాన్ని కేంద్రం తిరిగివ్వాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇప్పటివరకు 59.33 శాతం కాంక్రీట్ పనుల్ని పూర్తి చేశామన్నారు. స్పిల్‌వే 82.7, స్పిల్ ఛానెల్ 39.1 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి ప్రాజెక్టు రాదు.. ప్రపంచంలో కూడా ఎవరూ నిర్మించలేరంటూ బాబు పేర్కొన్నారు. పోలవరానికి సంబంధించి ప్లానింగ్, ఇంప్లిమెంటేషన్, ఎగ్జిక్యూషన్ లలో అవార్డు తీసుకున్నామన్నారు. దక్షిణ భారతదేశంలో అన్ని రాష్ట్రాలకు నీటి సమస్యలున్నా యన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోచేపట్టిన నదుల అనుసంధానంతో ఈ సమస్యను అధిగమించగలి గామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ద్వారా 40నదులు అనుసంధానం కానున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఏర్పాటైన కీయా మోటార్స్ ఉత్పత్తి మొదలైందని, మొదటి కారు త్వరలోనే విడుదల కానుందన్నారు. కీయా మోటార్స్ రాకతో పరిసరాల్లోని భూముల ధరలు పెరిగాయన్నారు.

పోలవరంలో కన్నుల పండువగా కాంక్రీట్ పనులు రికార్డు స్థాయిలో జరిగాయని, అందుకు నవయుగ కంపెనీని అభినందిస్తున్నా మని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పోలవరం కాంక్రీట్ పనులు ప్రపంచ వరల్డ్ రికార్డును గిన్నిస్ బుక్‌లో సొంతం చేసుకోవడం గర్వకారణమని చెప్పారు. పోలవరం ప్రాజె క్టులో జరుగుతున్న కాంక్రీట్ పనులను సోమవారం చంద్రబాబు స్వ యంగా పర్యవేక్షించారు. మళ్లీ 2019 మార్చిలో జరిగే

2019లో రికార్డును తిరగరాయాలి


కాంక్రీట్ పనులు మళ్లీ మరో రికార్డును తిరగరాయాలని చంద్ర బాబు నవయుగ కంపెనీని కోరారు. 2019లో గ్రావిటీ ద్వారా నీరు రైతులకు అందించి తీరతామని, పట్టిసీమ ద్వారా పవిత్ర నదు ల అనుసంధానానికి శ్రీకారం చుట్టామని అనవసరంగా ఈ ప్రాజెక్టుకు అడ్డుపడ వద్దని కేంద్రానికి హితవు పలికారు. ప్రపం చంలో అత్యున్నత నీరు విడుదల సామ ర్థ్యం కలిగిన స్పిల్‌వే ఒకటిగా నలిచిందని 50లక్షల క్యూసెక్కుల వద్ద ఇది ప్రపంచంలో అతి పెద్ద డ్యామ్‌గా గుర్తించబడుతోందని చెప్పారు.



పోలవరం నిర్వాసితుల్లో 56 వేల ఎస్టీ కుటుంబాలు

• రాజ్యసభలో కేంద్ర మంత్రి జవాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులలో 56,495 కుటుంబాలు షెడ్యూల్డు తెగలకు చెందిన వారు ఉన్నారని, వీరిలో ఇప్పటి వరకు కేవలం 1317 కుటుంబాలను మాత్రమే పునరావాస కాలనీలకు తరలించడం జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపిందని కేంద్ర జల వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ సోమవారం రాజ్య సభకు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా నిర్వాసితులైన ఎస్టీ కుటుంబాలకు పునరావాస కల్పించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నట్లుగా జాతీయ ఎస్టీ కమిషన్ భారత రాష్ట్రపతికి సమర్పించిన నివేదికలో పేర్కొన్న విషయం వాస్తవమేనా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిచ్చారు. పునరావాసం కల్పించిన నిర్వాసిత ఎస్టీ కుటుంబాలకు సేద్యానికి పనికిరాని భూములు పంపిణీ చేశారా, దీని వలన నిర్వాసితులైన కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయిన విషయం వాస్తవమేనా అన్న మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే నిర్వాసితులైన ఎస్టీ కుటుంబాలకు సేద్యానికి యోగ్యమైన భూములనే పంపిణీ చేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని చెప్పారు.ఇందిరా సాగర్ పోలవరం ప్రాజెక్ట్ వలన నిర్వాసితులైన గిరిజనులు అన్న అంశంపై జాతీయ ఎస్టీ కమిషన్ ఒక ప్రత్యేక నివేదిక రూపొందించిన విషయం వాస్తవమేనని మంత్రి అంగీకరించారు.




కోటి ఉద్యోగాలు హుష్‌కాకి

• భారత్‌లో కోరలుచాస్తున్న నిరుద్యోగం..
• 2018 ఊడిన 1.09 కోట్ల ఉద్యోగాలు
• 2017లో నిరుద్యోగం 4.78 శాతం
• 2018 డిసెంబర్ నాటికి 7.38 శాతం
• తాజా నివేదికలో సీఎంఐఈ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతోంది. ఏడాది కాలంలో 1.09 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనామీ (సీఎంఐఈ) సేకరించిన సమాచారం ప్రకారం దేశంలో 2017 తో పోలిస్తే 2018లో నిరుద్యోగం గణనీయంగా పెరిగిపోయింది. 2017 డిసెంబర్‌లో 4.78 శాతంగా ఉన్న నిరుద్యోగం..2018 డిసెంబర్ నాటికి7.38 శాతానికి ఎగబాకింది. గతేడాది నవంబర్- డిసెంబర్ నెలల్లోనూ నిరుద్యోగం రేటు చాలా పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశం. 2018 నవంబర్‌లో 6.62 శాతంగా ఉన్న నిరుద్యోగం.. డిసెంబర్ నాటికి 7.38 శాతానికి ఎగబాకింది. ఇది 2016 సెప్టెంబర్ కంటే కొంచెమే తక్కువని సీఎంఐఈ తన నివేదికలో వెల్లడించింది.2016 సెప్టెంబర్‌లో నిరుద్యోగత అత్యధికంగా 8.46 శాతంగా నమోదైందని.. తాజా గణాంకాలు చూస్తుంటే మళ్లీ అలాంటి ప్రమాద ఘంటికలు మోగే అవకాశం ఉందని సీఎంఐఈ హెచ్చరించింది. రోజురోజుకూ నిరుద్యోగత పెరగడం.. కార్మిక భాగస్వామ్య రేటు తగ్గడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది.

158000 కుటుంబాలపై అధ్యయనం

నిరుద్యోగ రేటుపై ఎప్పటికప్పుడు నివేదికలు సిద్ధం చేసే సీఎంఐఈ తన డేటాబేస్ ద్వారా 1,58,000 కుటుంబాలపై సర్వే నిర్వహించింది. డిసెంబర్ 2017 లో 26.94 కోట్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాలు కలిగిఉండగా.. 2018 డిసెంబర్ నాటికి ఆ శాతం 26.03 కి పడిపోయింది. మిగతా 18 లక్షల మంది పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారే. పట్టణ ప్రాంతాల్లో ఇదే కాలంలో 13.84 నుంచి 13.66 కు నిరుద్యోగత పడిపోయింది. సీఎంఐఈ అందించిన సమాచారం ప్రకారం కార్మిక భాగస్వామ్య రేటు రోజురోజుకూ పడిపోతుండగా.. పనిచేసే శక్తి,సామర్థ్యాలున్న వారు సరైన ఉపాధి దొరకగా నిరుద్యోగులుగా మారిపోతున్నారు. ఫలితంగా కార్మిక భాగస్వామ్య రేటు అంచనాలు 2017 డిసెంబర్‌లో 43.57 శాతం ఉండగా..2018 డిసెంబర్ నాటికి 42.47 కి పడిపోయింది. 2016 డిసెంబర్‌లో ఇదే శాతం 45.15 గా ఉండగా..2017 సెప్టెంబర్ నాటికి 47.84 కు పెరిగింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో నిరుద్యోగత తగ్గడం ఆందోళన కలిగించే అంశమని సీఎంఐఈ పేర్కొంది.



మా ఊరు-మా రాజ్యం



నక్సల్స్ కోటలో 'ఆదర్శ'ం బాట

కొత్త చరిత్ర లిఖించిన వీర్నపల్లి పంచాయతీ

- మండల కేంద్రంగా మారి ఖ్యాతి
- జాతీయ స్థాయిలో ఆదర్శ పంచాయతీగా ఎంపిక
- కేంద్రం ప్రశంస
- రైలుబండి లాంటి బడితో సృజన

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : పూర్వపు కరీంనగర్ జిల్లాలో మంథని అటవీ డివిజన్ తరువాత సిరిసిల్ల డివిజన్‌లో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉండేది. గతంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని వీర్నపల్లి గ్రామం నక్సల్స్ ప్రభావిత ప్రాంతం. వీర్నపల్లి పేరు వింటేనే నేతలు వణికిపోయే నాటి రోజులు పోయి నేడు ఈ గ్రామం దేశంలోనే ఆదర్శ గ్రామాల్లో ఒకటిగా ఎంపికైంది. ఈ గ్రామం నేడు విర్నపల్లి మండలంగా ఏర్పడి మండల కేంద్రంగా ఎదిగింది. ఈ గ్రామం రూపురేఖలు మారి నేడు గ్రామస్తులు ఏదో ఒక పని చేసుకుంటూ పిల్లలను చదివిస్తూ ఆదర్శంగా జీవిస్తున్నారంటే ఈ గ్రామంలో కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్‌కుమార్ దత్తత తీసుకోవడమే ప్రధాన కారణం. ప్రధాని మోడీ పిలుపుతో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు 'సన్సద్ ఆదర్శ గ్రామ్ యోజన పథకం' కింద నియోజకవర్గంలోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించడంతో కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ వీర్నపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు.

అంచెలంచెలుగా అభివృద్ధి

సంసాద్ ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా ఎంపీ వినోద్‌కుమార్ దత్తత గ్రామం అంచెలంచలుగా అభవృద్ధి సాధించింది. 3684 జనాభా కలిగిన ఈ గ్రామం చుట్టూ 9 గిరిజన తండాలున్నాయి. గత 60 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న నిరుపేదలకు ఎంపీ చొరవ చూపి పట్టాలు ఇప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం 1.62 కోట్ల రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసింది. ఏడు అంగన్‌వాడీ కేంద్ర భవనాలకు ఏసీపీ నిధుల నుంచి 50 లక్షల రూపాయలు మంజూరైనాయి. 177 మంది నిరుపేదలకు ఇందిరా ఆవాస్ యోజన కింద ఇళ్లు కేటాయించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖను ఏర్పాటు చేశారు. బీఎస్ఎన్ఎల్ త్రీజీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అల్మాస్‌పూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పోరేషనన్ క్రింద పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. ఆవీఎంఎస్ పథకం క్రింద పాఠ శాల భవనంకు 41.35 లక్షలు మంజూ రయ్యాయి. వీర్నపల్లి నుంచి మద్దిమల్ల వరకు 49 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. వీర్నపల్లి నుంచి రాశిగుట్ట తండా, గోన్యానాయక్ తండా వర కు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.

ఆదర్శ గ్రామంగా ఎంపిక



ఎంపీలు ఎంపిక చేసుకున్న గ్రావాలలో జరిగిన అభివృద్ధి పై కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ కు చెందిన అధికారుల బృందం క్షేత్రస్థాయిలో అధ్యయం చేసి మొదట 47 గ్రామాలను దేశ వ్యాప్తంగా ఎంపిక చేసింది. వీటిలో వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకొని 15 ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసింది. ఇందులో వీర్నపల్లి 9వ స్థానంలో ఎంపిక కావడం విశేషం. తెలంగాణ రాష్ట్రంలో ఎంపీ వినోద్‌కుమార్ తీసుకున్న గ్రామం మాత్రమే తొలి 15 ఆదర్శ గ్రామాల్లో ఎంపికైంది. ప్రధాని మోడీ దత్తత తీసుకున్న గ్రామానికి కూడ తొలి 15 గ్రామాల జాబితాలో చోటు దక్కలేదు. ఈ గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్ర మంత్ర్వశాఖ ఐదు నిమియాల విడితో లఘు చిత్రాన్ని రూపొందించాలని నిర్ణయించింది.

టాప్‌టెన్‌లో నిలిపాం

ఒకప్పుడు నక్సలైట్ ఉద్యమంలో ప్రభావితమైన వీర్నపల్లిన అనేక రంగాల్లో అభివృద్ధి చేశామని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ 'ఆంధ్రప్రభ'కు తలిపారు. టాప్ టెన్ ఆదర్శ గ్రామాల్లో వీర్నపల్లి నిలవడం ఆనందంగా ఉంది. వరంగల్ పూర్వ జిల్లా పరిధిలోని గంగదేవరపల్లి గ్రామాన్ని చూసిన తరువాత మారుమూల ప్రాంతమైన వీర్నపల్లిని అభివృద్ధి చేయాలని నిర్ణయించా వందశాతం అక్షరాస్యత సాధించడంతోపాటు త్రీజీ ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత 65 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న పేద కుటుంబాలకు సీఎం కేసీఆర్ పుట్టిన రోజున పట్టాలను పంపిణీ చేశాం. ఈ గ్రామాన్ని మరింత అభవృద్ధి చేయడమే తన ధ్యేయం.



సర్పంచ్ 'రామన్న'!

ఆ తర్వాత మంత్రిగా ఎదుగుదల

- జోగు రామన్న రాజకీయ ప్రస్థానం
- క్రీడలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో జనంచెంతకు
- 'దీపాయిగూడ'లో రాజకీయ ఆరంగేట్రం



ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో: సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి అంచెలంచెలుగా ఎదిగి తెలంగాణ రాష్ట్రంలో జిల్లా నుంచి తొలి మంత్రిగా పనిచేసిన జోగు రామన్న ఏడు సంవత్సరాల పాటు తన సొంత గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే యువకుడిగా పేరున్న జోగు రామన్నను దీపాయిగూడ గ్రామస్థులు 1988లో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1988 నుంచి 1995 వరకు సర్పంచ్‌గా పనిచేసిన జోగు రామన్న గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారు. విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే జోగు రామన్న క్రీడల్లోను ప్రతిభ కనబర్చేవారు. గ్రామపంచాయతీ పరిధిలోని యువకులను క్రీడల పట్ల ప్రోత్సహించేవారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ భజన బృందం సభ్యునిగా కొనసాగి ప్రజల మన్ననలు పొందారు. వ్యవసాయం మక్కువ ఉన్న జోగు రామన్న గ్రామంలో రైతులతో మమేకమై ఉండి నూతన వ్యవసాయ విధానాలను వారికి ఒంటబట్టించారు. ఎల్లప్పుడు ప్రజలతో మమేకమై ఉండే జోగు రామన్నకు రాజకీయంగా కలిసి వచ్చింది. సర్పంచ్‌గా ఉంటూనే 1995లో జైనథ్ మండల పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఐదు సంవత్సరాల పాటు మండల పరిషత్ అధ్యక్షునిగా కొనసాగిన ఆయన 2001లో జైనథ్ జడ్పీటీసీగా ఎన్నికై తన జైత్రయాత్రను కొనసాగించారు. 2004లో ఆదిలాబాద్ నుంచి టీడీపీ అభ్యర్థిగా శాసన సభకు పోటీ చేసి ఓడిపోయారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి 2012లో ఎమ్మెల్యే పదవికి, టీడీపీకి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీలో చేరి ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత టీఆర్ఎస్ పార్టీ టికెట్టుపై విజయం సాధించి కెసీఆర్ కేబినెట్‌లో రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అధికార బాధ్యతలు చేపట్టి ఐదేళ్ల పాటు పనిచేశారు. 2018 శాసన సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా ఆదిలాబాద్ నియోజక వర్గం నుంచి ఘనవిజయం సాధించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన జోగు రామన్న తన గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆ రోజులు మరిచిపోలేను: జోగు రామన్న

సర్పంచ్‌గా పనిచేసిన రోజులు నేనెన్నటికి మరువలేను. ఆ రోజుల్లో గ్రామంలో సర్పంచ్‌గా పనిచేస్తున్నప్పుడు గ్రామ ప్రజలందరు సర్పంచ్‌ను తల్లిదండ్రిగా చూసేవారు. కష్టసుఖాల్లో వారికి అండగా ఉండి అన్నీ తానై పనిచేసేవాడిని. ఏడేళ్ల పాటు దీపాయిగూడకు సర్పంచ్‌గా పనిచేశాను. ప్రజలు సహాయసహకారాలు అందించేవారు. దీపాయిగూడ నాకు రాజకీయంగా ఎదిగేందుకు వేదికైంది. గ్రామాన్ని కన్నతల్లిలా చూసుకుంటాను.

గతంలో సర్పంచ్‌గా పనిచేసిన వారిని కుటుంబ సభ్యులుగా ప్రజలు చూసుకునేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. అప్పటి సర్పంచులకు, ఇప్పటి సర్పంచులకు పర్వతానికి పరమాణువుకు ఎంత తేడా ఉందో అంత తేడా కనిపిస్తుంది.

గ్రామ స్వరాజ్యమే ప్రజాస్వామ్యం!



మనం ఇప్పుడు చూస్తున్న పంచాయతీ వ్యవస్థ 1993, ఏప్రిల్, 24న భారత రాజ్యాంగానికి 73వ సవరణ చేయడం ద్వారా అమల్లోకి వచ్చింది. దీంతో పంచాయతీ వ్యవస్థకు రాజ్యాంగపరమైన హోదా దక్కింది.ఇదే సవరణను ఎనిమిది రాష్ట్రాల్లో గిరిజన ప్రాంతాలకు కూడా విస్తరించారు. అందులో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మహరాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, రాజస్థాన్‌లలో గిరిజన ప్రాంతాల్లో పంచాయతీల ఏర్పాటు 1996 డిసెంబర్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. 1992 నాటి పంచాయతీ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీలు 29 అంశాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడం, ప్రణాళికలు రూపొందించడం, అమలు చేసే అధికారాలుంటాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందే నిధులను వ్యయం చేసే అధికారంతో పాటు సొంతంగా నిధులు సమకూర్చేనే వెసులుబాటును కూడా పంచాయతీలకు కల్పించారు. స్థానికంగా పన్నులు, లెవీలు, టోల్ టాక్స్‌లు విధించడం, వాటిని వసూలు చేయడం, అలా వసూలు చేసిన వాటిని గ్రామాభివృద్ధికి ఖర్చు పెట్టే అధికారం కూడా పంచాయతీలకు ఉంది. పంచాయతీలకు ప్రతి అయిదేళ్లకు ఒకమారు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇరవై లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో మూడు దశల్లో ఉండే పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటుకి చట్టంలో వీలు కల్పించారు. పంచాయతీలకు ఎన్నికయ్యే ప్రజా ప్రజాప్రతినిధుల్లో ఎస్సీలు, ఎస్టీలు, మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు.కేంద్ర ప్రణాళికా సంఘం గతంలో మంజూరు చేసేది. తరువాత ఈ బాధ్యత నీతి అయోగ్ చేతిలోకి వెళ్లింది. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల అమలుకి నిధుల కేటాయింపు కేంద్రస్థాయిలో జరిగినా వీటి విడుదల మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలు స్టేట్ ఫైనాన్స్ కమిషన్స్ ద్వారా జరుగుతాయి. ఈ విధంగా కేంద్ర నిధులు గ్రామాలకు చేరాలంటే.. అది రాష్ట్రాల ద్వారానే సాధ్యమవుతుంది. దేశంలో అన్ని రాష్ట్రాల్లో పంచాయతీ వ్యవస్థ ఉందా అంటే, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, ఒక్క ఢిల్లీ మినహా మిగిలిన కేంద్ర పాలిత రాష్ట్రాల్లో ఢిల్లీ మినహా మిగిలిన వాటిలో ఈ మూడంచెల స్థానిక పరిపాలనా వ్యవస్థ లేకపోవడం విశేషం.

సమాచార లేమే అసలు సమస్య!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన గ్రామాలను, తండాలను కూడా పంచాయతీ రాజ్ వ్యవస్థ కిందకు తీసుకొచ్చినా వాటి వద్ద తగిన సమాచారం లేకపోవడంతో నిధుల కేటాయింపులో న్యాయం జరగడం లేదనే ఆరోపణ ఉంది. బడ్జెట్ కేటాయింపుల్లో పంచాయతీలకు సంబంధించిన క్షేత్ర స్థాయి సమాచారం, గణాంకాలు లోపించడంతో నిధులు కేటాయింపుతో పాటు ఆయా ప్రాంతాలకు అవసరమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం లేదనే విమర్శ ఉంది. చిన్నపాటి పంచాయతీలకు సర్పంచులుగా ఉన్నవారు కూడా అవగాహనా లేమితో తమ గ్రామ అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో సామర్థ్యలేమిని కూడా గుర్తిం చారు. రాజ్యాంగ ప్రకారం పంచాయతీలకు అధికార హోదా కల్పించినా, బడ్జెట్‌లో నిధులు కేటాయిం చినా, ఆ అధికారాన్ని ఉప యోగిం చుకోవడం, నిధుల విని యోగంలో సర్పం చులు పూర్తీ స్థాయిలో వ్యవ హరిం చలేకపోతున్నారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. పంచాయతీలను పరిపుష్టం చేయాలంటే గ్రామ స్థాయి సమాచారం, గణాంకాలు విధాన నిర్ణేతల వద్ద ఉండడం అవసరం. సంబంధిత సమాచారాన్ని, గణాంకాలను ప్రభుత్వం వద్దకు సర్పంచులే చేర్చే వ్యవస్థను రూపొందించాల్సిన అవసరముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారతదేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పూర్తీ స్థాయిలో పని చేయాలంటే, కేంద్రస్థాయికి, గ్రామ స్థాయికి మధ్య వాస్తవిక అనుబంధం ఏర్పడాలంటే ఈ దిశగా ఎంతో కృషి చేయాల్సిన అవసరముందని ఈ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పంచాయతీలతోనే గిరిజనులకు విశేష అధికారాలు!

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రజాస్వామ్యమంటే గ్రామాల్లో స్థానిక స్వయం పరిపాలనగా అర్థమిచ్చారు. పెసా చట్టం ప్రకారం గిరిజన ప్రాంతాల్లోని గ్రామ సభలకు 11 అధికారాలను దాఖలు చేశారు. పరిపాలన, ఆదాయం, వనరుల నిర్వహణ ఈ గ్రామ సభలకు ఉంటుంది. దీని కింద ఈ ప్రాంతాల్లో భూసేకరణ చేయాలంటే, పునరావాసం కల్పించాలంటే, భూకేటాయింపులు జరపాలంటే, ఖనిజాల తవ్వకాలకు, విషపూరితాలను వినియోగించాలంటే, చిన్నపాట అటవీ ఉత్పత్తుల యాజమాన్యంపైనా, గ్రామీణ మార్కెట్లు, నీటి వనరుల నిర్వహణపైనా, రుణాల మంజూరుపై గ్రామ సభలదే అంతిమ నిర్ణయంగా ఉంటుంది. గ్రామ సభల అంగీకారం లేకుండా ఏ పై స్థాయి అధికారిక వ్యవస్థ కూడా వీటిలో ప్రత్యక్ష జోక్యం చేసుకోవడానికి వీలు పడదు. మారుమూల గిరిజన ప్రాంతాల స్వయం పాలన కోసం చట్ట పరంగా ఎన్నో అధికారాలను కల్పించినా ఆచరణలో అవి అమలుకు నోచుకోకపోవడం విషాదం. దీంతో పౌర సమాజాలు, ఎన్జీవోలు గిరిజనులకు ఉన్న హక్కులను తెలియచేస్తూ, రాజ్యాంగ పరంగా వారికి దాఖలైన అధికారాల గురించి వివరిస్తూ పంచాయతీ రాజ్‌పై అవగాహన పెంచడానికి విశేష కృషి చేస్తున్నాయి.

రంగారెడ్డి, ప్రభన్యూస్ : ఆ ఊరి పేరు చెబితే టక్కున ప్రముఖుల పేర్లు గుర్తుకు వస్తాయి...ఎందరో ప్రముఖులకు జన్మనిచ్చింది....కానీ అభివృద్ధిలో మాత్రం వెనకబడిపోయింది. వాస్తవానికి జిల్లాలోనే ఆ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల్సింది....కానీ స్థానిక రాజకీయాలతో అనుకున్న అభివృద్ధి జరగలేదు...పేరులోనే పెద్ద ఉన్నా అభివృద్ధిలో మాత్రం చిన్నదే అదే పెద్దమంగళారం గ్రామం. కొండా వెంకటరంగారెడ్డి....డాక్టర్ మర్రి చెన్నారెడ్డి....కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చిరాగ్ ప్రతాప్‌లింగంగౌడ్....కొండా లక్ష్మారెడ్డి.....మందడి యాదిరెడ్డి ఇలా చెప్పుకుంటూపోతే చాలామంది ప్రముఖుల పేర్లు చెప్పాల్సి ఉంటుంది. హైదరాబాద్ సంస్థానాన్ని అప్పట్లో ఆంధ్రాలో విలీనం చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించి అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూతో పోరాటం చేసిన ప్రముఖ వ్యక్తి కొండా వెంకటరంగారెడ్డి పుట్టింది ఇదే గ్రామంలో ....సమైక్య రాష్ట్రానికి ముచ్చటగా మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జన్మించింది ఇక్కడే......ఎమ్మెల్యేలుగా పని చేస్తున్న చిరాగ్ ప్రతాప్‌లింగంగౌడ్....కొండా లక్ష్మారెడ్డిలు పుట్టి పెరిగింది కూడా పెద్దమంగళారం గ్రామంలోనే.....చేవెళ్ల ఎంపీగా కొనసాగుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి కూడా ఇదే గ్రామం....తెలంగాణ ఉద్యమానికి జవసత్వాలు కల్పించిన మందడి యాదిరెడ్డి కూడా పుట్టి పెరిగింది ఈ గ్రామంలోనే. 2011 సంవత్సరంలో ఏకంగా పార్లమెంట్ ముందు ఆత్మహత్య చేసుకున్న యాదిరెడ్డి సేవలను తెలంగాణ జాతి నేటికీ మరిచిపోదు......



ప్రముఖుల పుట్టిల్లు......

ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన కొండా వెంకటరంగారెడ్డి పుట్టి పెరిగింది పెద్దమంగళారం గ్రామంలోనే. హైదరాబాద్ సంస్థానాన్ని ఆంధ్రాలో విలీనం చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1952-57 మధ్యకాలంలో ఎమ్మెల్యేగా 1959లో రెవెన్యూ మంత్రిగా ఆ తరువాత ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆయన హయాంలో విద్యారంగం ఎంతగానో అభివృద్ధి చెందింది. ఆయన అల్లుడే మర్రి చెన్నారెడ్డి. ఈయన కూడా పెద్దమంగళారం గ్రామంలోనే జన్మించారు. సమైక్య రాష్ట్రానికి 6వ ముఖ్యమంత్రిగా పని చేశారు. రాష్ట్రంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి కూడా ఆయనే. తన మామగారైన కొండా వెంకటరంగారెడ్డి పేరుమీద 1978 రంగారెడ్డి జిల్లాను అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న మర్రి చెన్నారెడ్డి ఏర్పాటు చేశారు. ఇటీవల జిల్లాల పునర్విభజనలో భాగంగా ఇదే పేరుతో రంగారెడ్డి జిల్లా కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్రం కోసం ఏకంగా పార్లమెంట్ ముందు ఆత్మహత్య చేసుకున్న మందడి యాదిరెడ్డి పుట్టి పెరిగింది కూడా ఇదే గ్రామంలో. 1978-82వరకు ఎమ్మెల్యేగా కొనసాగిన చిరాగ్ ప్రతాప్‌లింగంగౌడ్ సొంత గ్రామం కూడా పెద్దమంగళారమే. 1983-85 వరకు చేవెళ్ల ఎమ్మెల్యేగా కొనసాగిన కొండా లక్ష్మారెడ్డిది కూడా పెద్దమంగళారమే. ఎమ్మెల్యేగా రెండేళ్లపాటు పని చేశారు. తరువాత జర్నలిస్టుగా కొనసాగుతున్నారు. చేవెళ్ల ఎంపీగా కొనసాగుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిది కూడా పెద్దమంగళారమే. తాను హైదరాబాద్‌లో జన్మించిన తన పూర్వీకులంతా ఇక్కడే పుట్టి పెరిగారు.



పేరు గొప్ప.. ఊరు దిబ్బ

అభివృద్ధి ఎరుగని పెద్ద మంగళారం మేజర్ పంచాయతీ

అనుబంధ గ్రామాల్లో సమస్యలు ఎక్కువే.....

పెద్దమంగళారం గ్రామ పంచాయతీ కింద చిన్నషాపూర్, అమీర్‌గూడ అనుబంధ గ్రామాలున్నాయి. ఈ రెండు గ్రామాల్లో సమస్యలు నెలకొన్నాయి. చిన్న చిన్న సమ స్యలు పరిష్కరించినా ఇంకా పరిష్క రించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయి. అమీర్‌గూడ గ్రామం లో నేటికీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చిన్నషాపూర్ గ్రామంలో పెద్దమం గళారం నుంచి గ్రామం వరకు రోడ్డు నిర్మాణం లేక ఇబ్బందులు పడుతున్నారు.


ఈ గ్రామంలో డ్వాక్రా, అంగన్‌వాడీ భవనాలు నిర్మించాల్సి ఉంది. ఐదేళ్లకాలంలో దాదాపుగా రూ. 2.20కోట్లమేర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తాజా మాజీ సర్పంచి గీతావనజాక్షి తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ, ఎమ్మెల్సీల నిధులతో కార్యక్రమాలు చేపట్టామన్నారు. సిమెంట్‌రోడ్లు వేసినా మిషన్‌భగీరథ కార్యక్రమంలో భాగంగా పైప్‌లైన్లు వేయడం ద్వారా ధ్వంసమైనట్లు తిరిగి వాటిని నిర్మించాల్సి ఉందన్నారు.

పేరుకే పెద్ద.. అభివృద్ధిలో చిన్న

చేవెళ్ల నియోజకవర్గంలో కొన్ని మేజర్‌పంచాయతీలుండగా అందులో పెద్దమంగళారం కూడా ఒకటి. గ్రామంలో ఐదువేల వరకు జనాభా ఉండగా 3800మంది ఓటర్లు ఉన్నారు. ప్రముఖుల పుట్టినిల్లు కావడంతో ఈ గ్రామం ఎప్పుడో అభివృద్ధి చెందాల్సి ఉంది. కానీ ఇప్పటికీ గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయంటే పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. పెద్దమంగళారం గ్రామ పంచాయతీ పరిధిలో అమీర్‌గూడ, చిన్నషాపూర్, ఎల్కగూడ అనుబంధ గ్రామాలు కూడా ఉన్నాయి. ఇందులో ఇటీవల ఎల్కగూడ గ్రామాన్ని పంచాయతీ చేయగా చిన్నషాపూర్, అమీర్‌గూడ గ్రామాలు ఇంకా అనుబంధ గ్రామాలుగానే కొనసాగుతున్నాయి. చిన్న చిన్న గ్రామాల్లో అంతర్గత రోడ్లు సిమెంట్ రోడ్లుగా మారిపోయాయి. కానీ పెద్దమంగళారం గ్రామంలో మాత్రం ఇంకా సిమెంట్‌రోడ్లు నిర్మించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా నేటికీ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చాలా ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండిపోతోంది. చాలా ప్రాంతాల్లో అండగ్ డ్రైనేజీలు నిర్మిస్తున్నా ఇక్కడ మాత్రం ఉన్న వాటికి సరియైన విధంగా క్లీనింగ్ చేయకపోవడంతో మురుగు రాజ్యమేలుతోంది. గ్రామాల మధ్య లింక్‌రోడ్లు ఇంకా తారురోడ్లుగా మారలేదు. కంకరతేలిన రోడ్లపైనే ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మిషన్‌భగీరథ కార్యక్రమంలో భాగంగా సిమెంట్‌రోడ్లు మధ్యలో తొవ్వేశారు . దీంతో గ్రామం మధ్యలోంచి వెళ్లాలంటే నరకమే. తాజాగా సిమెంట్ రోడ్లు నిర్మిస్తేనే రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. గ్రామంలో ఒకప్పుడు అంతా ఒకేమాటపై ఉండేవాళ్లు. రానురాను ఎవరికివారే యమునాతీరే అనే విధంగా వ్యవహరించడంతో గ్రామంలో అనుకున్నమేర అభివృద్ధి జరగలేదు. సమైక్య రాష్ట్రంలో జన్మభూమి కార్యక్రమాలను బహిష్కరించడం ద్వారా గ్రామానికి రావల్సిన నిధులు కూడా ఆగిపోయాయి. పేరుకు తగ్గట్లుగా గ్రామ పంచాయతీ భవనం కూడా లేని పరిస్థితి. చిన్నపాటి భవనంలోనే పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది.



క్రీడాప్రభ



టీమిండియా బ్యాటింగ్, బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. 71 ఏళ్ల తరువాత ఆసీస్ గడ్డపై కోహ్లీ సేన సిరీస్ కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది. దేశం గర్వపడేలా విరాట్ కెప్టెన్సీలో విజయం సాధించడం ఎప్పటికీ మరిచిపోలేనిది. టెస్టు సిరీస్ గెలిచిన కోహ్లీ సేనకు అభినందనలు. మెరుగైన ఆటతీరును ఇలాగే కొనసాగించి ప్రపంచంలో టీమిండియాకు ఓ ప్రత్యేక స్థానానికి తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను.

- రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్రపతి.



ఇది చారిత్రాత్మక విజయం. సిరీస్‌ను కైవసం చేసుకున్నందుకు భారత్ జట్టుకు అభినందనలు. ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని కోరుకుంటున్నాను. అద్భుతమైన టీమ్‌వర్క్‌తో దేశం గర్వించేలా గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌లకు ఈ టూర్ వేదికైంది.

- నరేంద్ర మోడీ, ప్రధాని



భళా భారత్

71 ఏళ్ల తర్వాత చారిత్రాత్మక విజయం

టీమిండియా.. క్రికెట్ కే వన్నె తెచ్చింది. అసాధారణ ప్రదర్శనతో రాణించి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ముద్దాడింది. నాల్గో టెస్టు ఐదో రోజు కూడా వరుణుడు కరుణించకపోవడంతో ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించడంతో టీమిండియా 71 ఏళ్ల తరువాత ఆసీస్ గడ్డపై విజయ కేతనం ఎగురవేసింది. ఆస్ట్రేలియాను సొంత గడ్డపైనే మట్టికరిపించి తన సత్తాను క్రికెట్ ప్రపంచానికి చాటింది. 4 టెస్టుల సిరీస్‌ను 2-1 తేడాతో ట్రోఫీని కైవసం చేసుకుని కోహ్లీ సేన, 71 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. మొదటి ఇన్నింగ్స్‌లో పరుగుల వరద పారించిన టీమిండియా 622-7 (167.2) వద్ద డిక్లేర్ చేసింది. భారత్ బౌలర్లు రెచ్చిపోవడంతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్ ఫాలోఆన్‌లోనే ప్రారంభించింది. ఐదో రోజు ఆట రద్దు కావడంతో టీమిండియాకు విజయం వరించింది.

- *సొంత గడ్డపై ఆసీస్‌ను చిత్తు చేసిన టీమిండియా*
- *2-1 తేడాతో టెస్టు సిరీస్ కైవసం*
- *ఆసియా జట్లలో మొదటి కెప్టెన్‌గా విరాట్*
- *విదేశీ గడ్డలపై నాలుగు టెస్టు సిరీస్‌లలో విజయం*
- *పుజారాకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్*

సిడ్నీ : దేశానికి స్వాతంత్రం వచ్చిన కొన్ని నెలల తరువాత (1947-48లో) లాలా అమర్‌నాథ్ సారథ్యంలో టీమిండియా ఆస్ట్రేలియాను సొంత గడ్డపై ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. 71 ఏళ్ల తరువాత విజయం సాధించిన జట్టులోని ఎవరూ అప్పటికింకా పుట్టను కూడా లేదు. వారికి తెలియని చరిత్రను ప్రస్తుత టీమిండియా తిరగరాసింది. టీమిండియా సారథి లాలా అమర్‌నాథ్, ఆసీస్ కెప్టెన్ బ్రాడ్‌మాన్ మధ్య జరిగిన రసవత్తర పోరులో భారత్ విదేశీ గడ్డపై విజయ బావుట ఎగురవేసింది. లాలా అమర్‌నాథ్ తరువాత విరాట్ నేతృత్వంలోని జట్టు సిరీస్‌ను కైవసం చేసుకోవడంపై సర్వత్రా సంతోషం నెలకొంది. గతంలో 1980-81, 1985-86, 2003-04 ఆసీ స్ పర్యటనల్లో భారత్ సిరీస్ డ్రా చేసుకుంది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా 47 టెస్టులు ఆడితే 7 మ్యాచుల్లో విజయం సాధించింది.

71 ఏళ్ల తరువాత విజయం సాధించడంపై దేశ వ్యాప్తంగా క్రికెట్ అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. 622 పరుగులతో టీమిండియా మొదటి ఇన్నింగ్ డిక్లేర్ చేసింది. బ్యాటింగ్ దిగిన ఆసీస్ జట్టు 300 (104.5 ఓవర్లు) పరుగులకే ఆలౌట్ అయ్యింది. కుల్దీప్ యాదవ్ రెచ్చిపోవడంతో ఆసీస్ ఫాలోఆన్ నుంచి తప్పించుకోలేదు. 31.5-6-99-5తో కుల్దీప్ యాదవ్ రాణించాడు. ఇక 3-1 తేడాతో సిరీస్ తమదే అనుకున్న టీమిండియాకు వరుణుడు అంతరాయం కలిగించాడు. నాలో రోజు వరుణుడు అడ్డుతగలడం, సరైన వెలుతురు లేకపోవడంతో ఆటను రద్దు చేశారు. ఐదో రోజు (సోమవారం) కూడా అదే పరిస్థితి ఉండటంతో చివరి టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో సిరీస్‌ను 3-1తో ముగించాలన్న భారత్ ఆశలు మాత్రం నెరవేరలేదు. అయినా 71 ఏళ కల మాత్రం నెరవేరింది.

మూడో టెస్టు గెలుపుతోనే భారత్‌కు సిరీస్ విజయం దాదాపు ఖాయమైందనే చెప్పుకోవాలి. ఆసీస్‌ను ఫాలోఆన్‌లోకి నెట్టినా చివరి టెస్టు విజయంపై వరుణుడు నీళ్లు చల్లాడు. ఆసీస్ మొదటి ఇన్నింగ్ ఆలౌట్ సమయానికే భారత్‌కు 322 పరుగుల ఆధిక్యంలో ఉంది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ వికెట్ నష్టపోకుండా 6 పరుగులు మాత్రమే చేసింది. ఈ సిరీస్‌లో మూడు సెంచరీలు బాదిన భారత్ నయావాల్ పుజారా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను గెలుచుకున్నాడు. పుజారా ఈ మొత్తం సిరీస్‌లో 74 సగటుతో 521 పరుగులు చేశాడు. బుమ్రా 21 వికెట్లు తీసుకున్నాడు.

1	ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలిచిన తొలి ఆసియా కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ చరిత్రలోకెక్కాడు
18 / 4	విరాట్ టాస్ గెలిచిన ప్రతీ టెస్టులో విజయం సాధించడం జరిగింది. కోహ్లీ నేతృత్వంలో భారత్ 18 టెస్టులు గెలవగా, 4 డ్రా అయ్యాయి
50	ఈ సిరీస్‌లో ఇండియన్ పేసర్లు 23.54 సగటుతో తీసుకున్న వికెట్లు
40	ఆసీస్ ఆటగాళ్లు 32.27 సగటుతో తీసుకున్న వికెట్లు
31	1988 తరువాత సిడ్నీలో తన సొంత గడ్డపై ఆసీస్‌ను భారత్ ఫాలోఆన్‌లో ఆడించింది.
1	పుజారాకు తన టెస్టు కెరీర్‌లో ఇదే మొదటి మ్యాన్ ఆఫ్ ది సిరీస్
13	ఇంగ్లండ్ రికార్డు స్థాయిలో 13 సార్లు ఆసీస్ గడ్డపై సిరీస్ విజయాలు నమోదు చేయగా, విండీస్ నాలుగు సార్లు గెలుపొందింది. దక్షిణాఫ్రికా మూడు సార్లు, న్యూజిలాండ్, భారత్ ఒక్కోసారి సిరీస్ విజయాలను నమోదు చేశాయి

ఆసీస్ జట్టులో డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్ లేకపోవడం టీమిండియా ఫాల్ట్ కాదు. మెరుగైన క్రికెట్ అందించాలనే కారణంతోనే ఇద్దరిపై బాల్ ట్యాంపరింగ్ విషయంలో ఏడాదిపాటు నిషేధం విధించింది. ఇందులో భారత్ చేసేదేమీ లేదు. 71 ఏళ్ల తరువాత ఆసీస్ గడ్డపై సిరీస్ కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ జట్టులోని సభ్యుల్లో ఫిట్‌నెస్ ఎంతో బాగుంది.

- సునీల్ గవాస్కర్

సిరీస్ మొత్తంలో ఛటేశ్వర్ పుజారా, జస్ప్రిత్ బుమ్రా ఎంతో బాగా రాణించారు. దేశ కీర్తి ప్రతిష్టలో కోహ్లీ పతాక స్థాయిలో ఉంచింది. ఇందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇలాగే టీమిండియాకు విజయాలు సాధించిపెట్టాలి.

- బిషన్ సింగ్ బేడి

ఇండియా క్రికెట్‌కు ఇది మరిచిపోలేని రోజు. చారిత్రాత్మక విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. టీమిండియాను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది. సీనియర్ ప్లేయర్స్‌తో కలిసి యువ ఆటగాళ్లు ఎంతో అద్భుతంగా రాణించారు. పుజారా, పంత్ ఎంతో బాగా రాణించారు. ఇలాగే మున్ముందు రాణించాలని కోరుకుంటున్నాను.

- సచిన్ టెండూల్కర్

పంత్ రోజురోజుకూ మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నాడు. క్రికెట్‌లో అతనికి మంచి భవిష్యత్తు ఉంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా టూర్‌లో శతకాలు చేశాడు. ఆస్ట్రేలియాతో 7 ఇన్నింగ్స్‌లో 350 పరుగులు చేశాడు. పుజారా తరువాత పంత్. 71 ఏళ్ల తరువాత విజయం సాధించినందుకు ఆనందంగా ఉంది.

- సౌరవ్ గంగూలీ

చారిత్రాత్మక విజయం సాధించినందుకు టీమిండియాకు అభినందనలు. సభ్యులందరూ కలిసికట్టుగా జట్టును విజయ తీరానికి చేర్చారు. బౌలర్లు అద్భుతంగా రాణించారు. గెలుపు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ గెలుపును అందరూ ఆస్వాదించండి. ఆల్ ది బెస్ట్

- వీవీఎస్ లక్ష్మణ్

భారత్‌లో క్రికెట్‌ను ప్రేమించే ప్రతి ఒక్కరు ఎంతో గర్వంగా ఫీల్ అవుతున్నారు. ప్రతీ ఒక్క ఆటగాడు కష్టపడ్డాడు. క్రికెట్ చరిత్రలో భారత్‌ను ఓ మంచి గుర్తింపు లభించిందని భావిస్తున్నాను. ఇలాగే వన్డే సిరీస్‌ను కూడా కైవసం చేసుకోవాలి.

- వీరేంద్ర సెహ్వాగ్.

టీమిండియా ఆటగాళ్లను చూసి ఎంతో గర్వపడుతున్నాను. ఛటేశ్వర్ పుజారా గెలుపులో ఎంతో కష్టపడ్డాడు. ఇండియా బ్యాటింగ్ లైనప్‌కు వెన్నుముకగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించాడు. జస్ప్రిత్ బుమ్రా బౌలింగ్ అత్యద్భుతం.

- హర్భజన్ సింగ్

గతంలో గెలిచింది ఇప్పటి వరకు ఎవరూ చూడలేదు. 71 ఏళ్ల తరువాత సిరీస్‌ను గెలవడం చూస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. చారిత్రాత్మక విజయం అందించినందుకు అభినందనలు. వర్షంతో ఆట రద్దు అయినా ఎంజాయ్ మెంట్ మాత్రం ఆగొద్దు.

- సురేష్ రైనా

టీమిండియాకు అభినందనలు. చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఆస్ట్రేలియా గడ్డపై 71 ఏళ్ల తరువాత సిరీస్‌ను కైవసం చేసుకోవడం గర్వంగా కూడా ఉంది. భారత్ బౌలింగ్ ఎటాక్‌తో పాటు ఛటేశ్వర్ పుజారా ఆట బాగుంది. బుమ్రా బౌలింగ్ చూస్తుంటే థ్రిల్లింగ్‌గా అనిపించింది.

- మిచెల్ జాన్సన్, మైఖేల్ క్లార్క్

భారత్ చారిత్రాత్మక విజయం సాధించడం ఎంతో గర్వంగా ఉంది. జట్టు గెలుపునకు ప్రతీ ఒక్కరు కష్టపడ్డారు. కెప్టెన్, కోచ్‌తో పాటు ప్రతీ క్రీడాకారుడికి అభినందనలు తెలియజేస్తున్నాను. అందరికీ గుర్తుండిపోయే ఆటతీరును ప్రదర్శించారు.

వినోద్ రాయ్, అడ్మినిస్ట్రేషన్ కమిటీ చీఫ్

విరాట్ కెప్టెన్సీలో టీమిండియా ఆసీస్ గడ్డపై సిరీస్‌ను కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది. అందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను. వన్డే సిరీస్‌ను కూడా ఇలాగే కైవసం చేసుకోవాలని కోరుకుంటున్నాను.

- సీకే ఖన్నా, బీసీసీఐ అధ్యక్షుడు



ఆసీస్‌పై టీమిండియా గెలుపు 1983 ప్రపంచ కప్ గెలుపుకంటే పెద్దది కాదని భావిస్తున్నాను. 1983లో ప్రపంచ కప్, 1985లో ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో టీమిండియాకు అతిపెద్ద విజయాలు. ఎందుకంటే ఇది టెస్టు మ్యాచ్ కాబట్టి ప్రపంచ కప్‌కు ప్రాధాన్యత ఉంటుంది. పాస్ట్ హిస్టరీ అయితే, ఫ్యూచర్ మిస్టరీ అనుకుంటున్నాను. ఆసీస్‌పై సిరీస్‌ను కైవసం చేసుకున్నందుకు కెప్టెన్ విరాట్‌కు నేను సెల్యూట్ చేస్తున్నాను. విరాట్‌లా ఎవరూ ఓపికగా టెస్టు క్రికెట్ ఆడరు. ఇలాంటి కెప్టెన్‌ను ఇప్పటి వరకు చూడలేదు. జట్టు మొత్తం విరాట్‌ను గమనిస్తూ ఉంటుంది. అతన్ని అనుకరించడానికి ఇష్టపడుతారు. పుజారా, బుమ్రా, పంత్, అగర్వాల్ ఆటతీరు అద్భుతంగా ఉంది. ఇదే ఊపుతో వన్డే సిరీస్‌ను కూడా కైవసం చేసుకోవాలి.

- రవి శాస్త్రి, కోచ్

ఇది నా అతిపెద్ద విజయం



టీమిండియా జట్టు క్రికెట్ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. ఆసీస్‌ను సొంత గడ్డపై ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకోవడం నా కెరీర్‌లో అతిపెద్ద విజయంగా భావిస్తున్నాను. ప్రపంచ కప్ గెలిచిన సమయంలో నేను యంగ్ ప్లేయర్‌గా ఉన్నాను. చాలా మంది భావోద్వేగానికి గురవ్వడం చూశాను. ఆ సమయంలో నాకు ఆ ఫీలింగ్ లేదు. విదేశీ గడ్డపై సిరీస్‌ను టీమిండియా సొంతం చేసుకోవడం, ఆ జట్టుకు నేను కెప్టెన్‌గా ఉండటం నాకెంతో గర్వంగా ఉంది. ఆటగాళ్లందరినీ కలిసికట్టుగా ముందుకు తీసుకెళ్లడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. సిరీస్ విజయాన్ని ఎంతో ఆస్వాదిస్తున్నాను. టెస్టు కెప్టెన్‌గా ఆసీస్ గడ్డపైనే బాధ్యతలు చేపట్టి, సిరీస్‌ను కైవసం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. సిరీస్‌ను సొంతం చేసుకోవడంలో పుజారా కృషి వెలకట్టలేనిది. మయాంక్ అగర్వాల్, రిషబ్‌పంత్, బుమ్రా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. ఈ సిరీస్‌ను బౌలర్లకు అంకితం చేస్తున్నాను. నమ్మకం అనేది చాలా ముఖ్యమైందని, మా ఉద్దేశం కూడా ఎంతో మంచిదని, ఇవే క్రికెట్ ప్రపంచంలో ఇండియాను ముందుకు తీసుకెళ్తున్నాయి. ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాల్లో కూడా బౌలర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. ఈ సిరీస్‌ను సొంతం చేసుకోవడం యువ జట్టుకు ఓ పునాది రాయి లాంటిదని భావిస్తున్నాను. ఆసీస్ జట్టుతో ఎప్పుడూ పోటీ కొనసాగుతూనే ఉంటుంది.

మైదానంలో టీమిండియా స్టెప్పులు

2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న అనంతరం టీమిండియా మైదానంలో స్టెప్పులేసింది. పుజారాతో డ్యాన్స్ చేయించడానికి సభ్యులు ప్రయత్నించారు. 'బ్యాటింగే వచ్చు.. కానీ డ్యాన్స్ రాదు' అంటూ జారుకోవాలని భావించినా అందరూ కలిసి స్టెప్పులేయించారు. ఈ సిరీస్‌లో పుజారా 521 పరుగులు చేశాడు. అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను అందుకున్నాడు. వికెట్ కీపర్ రిషబ్ పంత్ కొరియోగ్రఫీ చేయగా టీమిండియా సభ్యులు డ్యాన్స్ చేశారు. పుజారా డ్యాన్స్‌పై కోహ్లీని ప్రశ్నించగా.. 'రిషబ్ వచ్చి ఇలా చేయాలని చూపించాడు. మేం దాన్నే ఫాలో అయ్యాం. చాలా ఈజీ స్టెప్పు అది. కానీ పుజారా మాత్రం చేయలేకపోయాడు' అంటూ సమాధానమిచ్చాడు. మేరే దేశ్ కీ ధర్తీ అనే పాటకు కోహ్లీ సేన స్టెప్పులేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



ఆడిలైడ్ ఓటమి టర్నింగ్ పాయింట్



2-1 తేడాతో సిరీస్‌ను కోల్పోవడం బాధాకరం. ఆడిలైడ్‌లో మా ఓటమే ఇండియాకు టర్నింగ్ పాయింట్ అయ్యింది. ఎన్నో అవకాశాలు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోలేదని భావిస్తున్నాను. ఇండియా బౌలింగ్ ఎటాక్ ఎంతో బాగుంది. ముగ్గురు బౌలర్లు అద్భుతంగా రాణించారు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. మార్కస్, ట్రావిస్ లాంటి వాళ్లు కూడా కొద్దిగా తడబడ్డారు. పెర్త్‌లో గెలిచి ఉంటే మెల్‌బోర్న్‌లో అద్భుతంగా ఆడేవాళ్లం. అప్పుడు సిడ్నీలో వాషౌట్ చేసేవాళ్లం. భారత్ మాకంటే ఎంతో బాగా ఆడింది. వార్నర్, స్టీవ్ స్మిత్ లాంటి వాళ్లు లేకపోవడంతోనే సిరీస్‌ను చేజార్చుకున్నాం. వన్డే సిరీస్‌ను మాత్రం తప్పకుండా మేమే కైవసం చేసుకుంటాం.

సంక్షిప్త స్కోరు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 (167.2 ఓవర్లు) డిక్లేర్.
చటేశ్వర్ పుజారా (193), రిషబ్ పంత్ (159 నాటౌట్), రవీంద్ర జడేజా (81), మయాంక్ అగర్వాల్ (77).
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 300/10 (104.5) **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ :** ఉస్మాన్ ఖవాజా (4 నాటౌట్), మార్కస్ హ్యారిస్ (2 నాటౌట్). **మొత్తం :** 6/0 (4).

సభ్యుడు కావడం ఆనందంగా ఉంది



ఈ విజయం గొప్ప అనుభూతి ఇస్తోంది. టీమిండియాలో నేను భాగస్వామిగా ఉండటం సంతోషంగా ఉంది. సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు ఎంతో కష్టపడ్డాం. అందుకే ఆసీస్‌పై విజయం సులువైంది. విజయం సాధించడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. భారత్ బౌలింగ్ ఎటాక్ ఎంతో అద్భుతంగా ఉంది. నలుగురు బౌలర్లతో 20 వికెట్లు తీసుకోవడం అంతా ఈజీ కాదు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఫాస్ట్, స్పిన్ బౌలర్లకే ఈ క్రెడిట్ దక్కుతుంది. గెలుపులో బ్యాట్స్‌మెన్‌గా నా వంతు న్యాయం చేశాను. ద.ఆఫ్రికా, ఇంగ్లండ్‌లో ఆడటంతో కూడా టెక్నిక్‌లు నేర్చుకున్నాను. ఆడిలైడ్‌లో చేసిన సెంచరీ నాకెప్పుడూ ప్రత్యేకం. భారత్‌లో కొన్ని ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడుతున్నాను. మరో టెస్టు సిరీస్‌కు 6 నుంచి 7 నెలల సమయం ఉంది. అప్పటి వరకు ఇంకా బాగా ప్రిపేర్ అవుతాను. టెస్టు మ్యాచులు ఆడటానికి ఇష్టపడతాను. ప్రపంచంలోనే బెస్ట్ బౌలింగ్ లైనప్ టీమిండియాకే సొంతం.

అనుష్కతో విరాట్ నడక



ఐదో రోజు ఆట రద్దు అని, సిరీస్ భారత్ సొంతమైందని ప్రకటించగానే అనుష్క ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఆమె ఉండటంతోనే టీమిండియా ఓడిపోయిందని చేసిన కామెంట్లకు ఈ విజయం తెరదించింది. టీమిండియా విజయం సాధించిన తరువాత అనుష్క మైదానంలోకి వెళ్లి విరాట్‌ను ప్రేమగా హత్తుకుని అభినందనలు తెలిపింది. టీమిండి గెలుపునకు కెప్టెన్‌గా వ్యవహరించిన నిన్ను చూస్తే ఎంతో ఆనందంగా ఉందంటూ మురిసిపోయింది. అనంతరం ఇద్దరూ కలిసి మైదానంలో కాసేపు నడిచారు. ఈ వీడియో కూడా నెట్టింట్లో వైరల్‌గా మారింది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
L ively
I nteraction
F or
E ver
లైఫ్ I
మంగళవారం 8 జనవరి 2019

ఒక పశువు! విచక్షణ మరచి మీద పడతాడు. లైంగికవాంఛ తీర్చుకుని తన దారిన తాను పోతాడు. ఆ దాడిని ఎదుర్కునేంత శారీరక బలం లేని మహిళ ఆ పశువాంఛకు బలి అవుతారు. ఛీ! కుక్క ముట్టుకుందని అసహ్యించుకుని శరీరాన్ని కడివెడు నీళ్లతో కడిగేసుకోవచ్చు. కాని తనను మనసున్న మనిషిలా, ఒక వ్యక్తిలాగా కాకుండా కామం తీర్చుకోవడానికి పనికొచ్చే వస్తువులా చూడటాన్ని మహిళ అవమానంగా భావిస్తుంది. మన శరీరాన్ని మనకిష్టం లేకుండా ముట్టుకుని అవమానిస్తే రక్తం మరిగిపోదూ? అటువంటివాడికి మరణశిక్ష కూడా చాలా చిన్నదే. కాని మనదేశంలో లైంగిక అత్యాచారాలు చేయడం మగవాడి హక్కు లాగా తయారయింది. రేప్ అనేది ఒక కల్చర్ అయింది. దీనికి పోలీస్ స్టేషన్లలో పెద్ద ప్రాముఖ్యత కూడా లేదు. వ్యవస్థ మద్దతు లేదు. రేప్ జరిగితే బాధితురాలి బాధ ఒకవైపైతే పనికిమాలిన సమాజం ఆమెను బతికుండగానే చంపేస్తుంది. కుటుంబం వెలివేస్తుంది. రేప్ చేసినవాడు నిస్సిగ్గుగా తిరుగుతుంటే సమాజం బాధితురాలిని నిందితురాలిగా చిత్రీకరించి చిత్రవధ చేస్తుంది. ఏ మద్దతు లేక బాధిత మహిళ మానసికంగా కుంగిపోతుంది. న్యాయం కోసం ఆమె చేసే పోరాటంలో తోడు ఎవరూ నిలవరు. అటువంటి బాధితులందరికీ న్యాయం చేకూర్చడానికి, వారి తరపున మేమున్నామని అండగా నిలబడటానికి రాష్ట్రీయ గరిమ అభ్యాన్ నిలబడింది. సంస్థ ముంబైటు ఢిల్లీ అనే డిగ్నిటీ మార్చి ఆరంభించింది. ఎన్నో రాష్ట్రాలలో ఈ డిగ్నిటీ మార్చి కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో భూమిక కొండవీటి సత్యవతి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ లో డిగ్నిటీ మార్చి జరిగింది.





ఆ బాధ... అగాధం!

గాయం... గళమై... గమనమై..!



18 ఏళ్లు పైబడినవారి మీదనే ఎక్కువగా అత్యాచారం కేసులు అవుతాయని అందరూ అనుకుంటారు. కాని కాని 75 కేసులు మైనర్లవే. 22 ఫిబ్రవరి వరకు ఈ మార్చి పూర్తవుతుంది. కాని పోరాటం అప్పటికే పూర్తి అయినట్లు కాదు. తర్వాత కూడా అది నడుస్తూనే ఉంటుంది. కొంతమంది తమకు జరిగిన అన్యాయాలను ఇలా పంచుకున్నారు.


నా కూతురుకి నాలుగేళ్లు. అరవై ఏళ్ల ముసలోడు పొలంలోకి తీసుకువెళ్లాడు పాపని. ఆ సమయంలో నేను ఇంట్లో లేను. అక్కడ మా ఆడపడుచు ఉంది. కాని అది పెద్ద విషయంగా పట్టించుకోలేదు. పెద్దమనిషి పాపని తీసుకెళ్తున్నాడు బయటకి అనుకుంది. అతను కూడా పాపని అక్కడికి ఇక్కడికి తిప్పి ఎవరూ లేని చోట పొలంలోకి తీసుకెళ్లాడు. ఎంతసేపటికి పాప రాకపోతే మేం ఊళ్లో వాకబు చేయడం మొదలుపెట్టాం. నూనె సీసా కొని తీసుకువెళ్లాడు. ఆ నూనెను ఉపయోగించి ఆ పాప మీద అత్యాచారం చేశాడు. వెంటనే పోలీసు కేసు పెట్టారు. అత్యాచారం జరిపిన వృద్ధుడికి ఉరిశిక్ష పడింది. కాని మా పాపకి జరిగినదాని వలన షాక్‌కు గురై శారీరక, మానసిక పెరుగుదల కోల్పోయింది.

☆ నాకు కొత్తగా పెళ్లై అత్తవారింటికి వెళ్లాను. మా మామ(భర్త తండ్రి) తాగి తమాషా చేస్తుండేవాడు. ఒకరోజు ఇంట్లో నా భర్త, మరిది ఇద్దరూ ఇంట్లో లేరు. బయటికెళ్లారు. మామ నా గదిలోకి వచ్చి నాతో అసభ్యంగా ప్రవర్తించసాగాడు. నన్ను కింద పడేశాడు. నా శరీరం మీద ఇష్టం వచ్చినట్లు ముట్టుకోసాగాడు. నేను గట్టిగా అరవడం మొదలుపెట్టాను. నా అరుపులు విని నా అత్త వచ్చింది. ఆమెతో చెప్పాను. మామ నాతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని. కాని, దానికి సమాధానంగా, మా ఇంట్లో ఉండటానికి వస్తే మాకు నచ్చినట్టుగా నువ్వు ఉండాలి అని చెప్పింది. మేం ఏం చెప్తే అది చేయాలి అన్నది. నేను ఏడుస్తూ వేరొక గదిలోకి పరిగెత్తి పారిపోయాను. అక్కడ నేను లోపలనుంచి గడియ పెట్టేసుకున్నాను. పొద్దున్న నా భర్త, మరిదికి జరిగింది చెప్పాను. నా భర్తను కూడా బాగా కొట్టారు వాళ్లు. నన్ను, నా భర్తను ఇంటి నుంచి బయటకు పంపించేశారు. ఇప్పుడు నేను, నా భర్త వేరే ఇంట్లో అద్దెకి ఉంటున్నాం. తాగుబోతని నా భర్త మీద ఆరోపణలు చేస్తున్నారు. నా భర్త , నా తల్లిదండ్రులు నాకు పూర్తి మద్దతునిస్తున్నారు. నాపై జరిగిన విషయం మీద పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం కాని ఎటువంటి న్యాయం జరగలేదు. దీన్ని గృహహింస కేసుగా రిజిస్టర్ చేశారు. కాని అత్యాచార ప్రయత్నం కింద కేసు రిజిస్టర్ కాలేదు. నా తండ్రి ఈ విషయం మీద పోరాడుతుంటే ఆయన్ని కూడా కొట్టారు.



☆ మా అమ్మాయి వయసు 15 ఏళ్లు. 2017 రాత్రి 11.30కి మా పక్కింట్లో ఉండే అబ్బాయి మా అమ్మాయిని మా ఇంట్లో నుంచి లాక్కెళ్లి తన ఇంట్లో దాచేశాడు. మా ఇంట్లో నా భార్య, మిగిలిన పిల్లలు ఏడవడం మొదలుపెట్టారు. మేం పోలీసులకు ఫోన్ చేశాం. పోలీసులు వచ్చారు. మా అమ్మాయిని అతను తీసుకెళ్లిపోయాడు. అతని ఇంటిని సోదా చేయండి అని అడిగాం. పోలీసులు వచ్చిన సమయంలో అతను ఇంటి బయట పడుకుని ఉన్నాడు. మా అమ్మాయిని లోపల బంద్ చేసి పెట్టాడు. కాని పోలీసులు మేం చెప్పిన మాటని వినిపించుకోలేదు. అతను బయట పడుకుని నిద్ర పోతున్నాడు. మీరు అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని చెప్పి అతని ఇంటిని సోదా చేయలేదు. పొద్దున్న మేం రిపోర్టు రాయించడానికి పోలీస్ స్టేషన్ వెళ్తే మీ అమ్మాయి దొరికిందని ఇచ్చారు. అతని మీద ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దాని గురించే న్యాయ పోరాటం చేస్తున్నాను.

☆ మా అమ్మాయి ఆరవ తరగతి చదువుకునేది. రోజూ స్కూల్‌కి వెళ్లేది. ఒకరోజు స్కూల్‌లో బాత్‌రూమ్‌కి వెళ్లింది. అక్కడికి మగ టీచర్ వెనక నుంచి వచ్చాడు. ఆమె మీద అత్యాచారం జరిపాడు. తర్వాత నుంచి పాపను బెదిరించసాగాడు. నువ్వు నీ తల్లిదండ్రులకు ఈ విషయం చెపితే నిన్ను వేరే అబ్బాయితో సంబంధం ఉందని చెప్పి నీమీద నిందలు వేసి అవి అందరికీ తెలియచేసి అవమానం చేస్తాను. నీ తల్లిదండ్రులను చంపేస్తాను అని భయపెట్టాడు. ఆ భయంతో రెండు రోజులు స్కూల్‌కి వెళ్లలేదు. ఇంత కష్టపడి నిన్ను చదివిస్తున్నాను. నువ్వు ఎందుకు చదువుకోవడానికి వెళ్లడం లేదని నిలదీశాను. నాకు ఏం చెప్పాలో తెలియక, స్కూల్‌కి వెళ్లలేక ఉత్తరం రాసిపెట్టి విషం తిన్నది. నాకు పొట్టలో నొప్పిగా ఉందని చెప్పింది. నేను దగ్గరకు వెళ్లేసరికి పాప నోటి నుంచి మందు వాసన వచ్చింది. హాస్పటల్‌కి తీసెకువెళ్లాం. అక్కడ చికిత్స ఇప్పించాం. తర్వాత టీచర్ పాప మీద చేసిన అత్యాచారాన్ని స్కూల్ యాజమాన్యం దగ్గరకు తీసుకువెళ్లాం. నేనేం చేయలేదు. నా మీద ఆరోపణలు చేస్తున్నారని టీచర్ అబద్ధం చెప్పాడు. నేను పోలీస్ స్టేషన్ వెళ్లాను. కాని వాళ్లు రిపోర్టు రాసుకోవడానికి నిరాకరించారు. అటువంటి రిపోర్టులు మేం రాయం. మీ అమ్మాయిని ఇక్కడికి తీసుకువస్తే రాస్తాం అన్నారు. మీడియాను పిలిచాం. అప్పుడు కాని రిపోర్టు రాయలేదు. కాని ఇన్ని నెలలయింది. ఇప్పటివరకు మా ఫిర్యాదు మీద యాక్షన్ తీసుకోలేదు. కాని ఆ టీచర్ తరపు వాళ్లు వచ్చి మీకు పది లక్షల రూపాయలు ఇస్తాం. కేసు విరమించుకోమన్నారు. మేం తీసుకోం అనడంతో ఆ డబ్బును పోలీసులకు తినిపించి కేసు లేకుండా చేశారు.



☆ నేను ఒకరోజు మా పొలంలో పనిచేసుకుంటున్నాను. ముగ్గురు వ్యక్తులు వచ్చి నా మీద అత్యాచారం చేశారు. అందులో నా తప్పేం ఉంది. నేనేం చేశాను. కాని మా ఊరిలో అందరూ నన్ను చాలా చెడ్డగా తిట్లు తిడతారు. నువ్వు చెడు పని చేసుకుని వచ్చావు అని, మా అబ్బాయికి ఇంకో పెళ్లి చేస్తాం అని చెప్పి నా భర్త, అత్తమామలు నన్ను ఇంటి నుంచి బయటకు గెంటేశారు.

సహజీవనంలో పెళ్లి ప్రమాణాలు?

ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు. పెళ్లికొడుకు మోసగాడు. అంతకుముందే ఒక అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో వంచించాడు. అంటే వెంటనే పెళ్లి ఆగిపోతుంది. అందరూ నిర్ఘాంతపోతారు. పోలీసులు వచ్చి అతన్ని అరెస్టు చేస్తారు. ఇటువంటి సీన్‌లు చాలా సినిమాల్లో చూసి ఉంటాం. కాని ఇప్పుడు సుప్రీం కోర్టు అటువంటి సంఘటనలకు వేరే అర్థం చెప్తోంది.

మానస ఒక హాస్పటల్‌లో నర్స్‌గా పనిచేస్తోంది. తనతోపాటే పనిచేసే డాక్టర్, ఈమె ప్రేమలో పడ్డారు. ఇద్దరూ కలిసి ఒకే ఇంట్లో జీవించడం ఆరంభించారు. ఇద్దరూ మానసిక, శారీరక ఆనందం కలిసి అనుభవించారు. లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లు ఇప్పుడు చాలా సాధారణం అయ్యాయి. కాబట్టి వారికీ



తప్పనిపించలేదు. అంతేకాదు ఇద్దరూ పెళ్లి చేసుకుందాం అని బాసలు కూడా చేసుకున్నారు. కాని ఒక అమ్మాయి తన ప్రేమలో మునిగిపోగానే ఆమెతోనే నిజాయితీగా ఉండాలని ప్రతి మగవాడు అనుకోడు కదా. కొన్నాళ్లు మోజు తీరాక తన దోవ తాను చూసుకోవచ్చు. అదే చేశాడా డాక్టర్. నర్స్‌తో లివ్ ఇన్‌ను ఒక అవకాశంగా వాడుకున్నాడు. అతను ఆమె పైన చూపే ఇష్టంలో నిబద్ధత లేదు. కట్టుబడి ఉండాలనీ అనుకోలేదు. ప్రేమ వేరు పెళ్లి వేరు అనుకున్నాడు. అందుకే పెళ్లి చేసుకుంటానని నర్స్‌తో చేసిన ప్రమాణాలకు ఏమాత్రం విలువ ఇవ్వకుండా ఇంకో పెళ్లి చేసుకున్నాడు. సాధారణంగా అమ్మాయిలకు ప్రేమలో పడ్డాక ప్రియుని మీద విపరీతమైన నమ్మకం ఏర్పడిపోతుంది. తనను మోసం చేస్తాడనే తలంపే రాదు. అతనికి తానే లోకం అనుకుంటుంది. కాని పెళ్లి పేరుతో వచ్చే కట్న కానుకలు, కుటుంబాల పరువు ప్రతిష్టలు అన్నిటిముందు తనను నమ్మి తనతో కలిసి నివసించే అమ్మాయి అతనికి విలువ(లు)లేని వ్యక్తిగా అనిపిస్తుంది. ప్రేమ ముసుగు వేసుకుని ఆమెతో శారీరక అవసరాలు తీర్చుకోవడానికి కులం, కుటుంబం అడ్డు రాదు కాని పెళ్లికి అవన్నీ అడ్డు వస్తాయి. కాబట్టి దర్జాగా పెళ్లి చేసుకున్నాడు. అప్పుడు ఆ అమ్మాయి ఏం చేయాలి? తనను మోసం చేసిన అతని మీద కేసు వేయాలి. ఏమని వేయగలదు. బాధితురాలు ఆ డాక్టర్ మీద అత్యాచారం కేసును బాంబే హైకోర్టులో వేసింది. కాని ఆమె చెప్తున్నట్లు తాను ఆమె మీద అత్యాచారం చేయలేదని తన ఇష్టపూర్వకంగానే తనతో ఉన్నదని, తన పరిస్థితులను అర్థం చేసుకోవాలని నిందితుడి అభ్యర్థనను బాంబే హైకోర్టు తోసిపుచ్చితే అతను సుప్రీం కోర్టుకు వెళ్లాడు. కోర్టుకు ఏం అనిపిస్తుందంటే...ఈ కేసును జాగ్రత్తగా విచారించాలి. ఒకవేళ నేరం మోపబడుతున్న డాక్టర్ తన లైంగికావసరాలు తీర్చుకోవడానికి ఆమెకు మాయమాటలు చెప్పాడా. అలా అయితే అది చీటింగ్. అలా కాకుండా ఆమె అతని మీద ప్రేమతో, కోరికతో తన ఇష్టపూర్వకంగా లైంగిక సంబంధం కలిగి ఉంటే, అంటే అతను ఆమెను ఏవిధమైన బలవంతం చేయకుండా ఉండి ఉంటే, అతని చేతుల్లో లేని పరిస్థితుల వలన, ఊహించని విధంగా అతను తాను ఆ నర్స్‌ను పెళ్లి చేసుకుంటాను అని చేసిన ప్రమాణాలను ఉల్లంఘించవలసి వస్తే ఆమె అతని మీద వేసిన కేసు సరికాదు. ఆమె అంతట ఆమె తన ఇష్టం మేరకు పెళ్లి చేసుకోకుండానే అతనితో కలిసి నివసిస్తూ శారీరక సంబంధం కలిగిఉంది. ఆమెను అతను లైంగిక అత్యాచారం చేయలేదు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు ఉన్నవి ఉన్నట్లు తీసుకోకూడదని చెప్పింది. సుప్రీంకోర్టు, ఒకప్పుడు భార్యకు ఇష్టం లేకుండా భర్త ఆమెతో లైంగికంగా కలిస్తే అది రేప్ అనకూడదని చెప్పింది. ఇప్పుడు సహజీవనంలో కూడా అటువంటి నియమమే వర్తిస్తుందని చెప్తోంది. కాబట్టి అమ్మాయిలూ...నమ్మడం ఎందుకు? మోసపోవడం ఎందుకు? భావావేశాలతో కాదు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. మెలకువతో బతకాలి.

ప్రపంచం అంతా హిందీకి సలామ్!

10న ప్రపంచ హిందీ దివస్

ఇది కాదు భయ్యా! ఆ ముందు గల్లీలోకి వెళ్లాలి. హైదరాబాద్‌లో గత పదేళ్లుగా ఉద్యోగం చేస్తున్న హరీష్ సొంతూరు గుడివాడ. అక్కడ బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్లడానికి ఆటో తీసుకున్నాడు. ఇప్పుడు సందులు, వీధులు అనే అలవాటు పోయింది. గల్లీ అనే మాట గమ్‌లా అతుక్కుంది. ఆటో అతను వెనక్కి తిరిగి చూడటంతో సర్దుకుని, అదే..ముందు సందులోకి తిప్పు అంటున్నా అన్నాడు. హైదరాబాద్ నుంచి వస్తున్నారా సార్ అన్నాడు. అలా హైదరాబాదీల భాష వెంటనే అర్థం అయిపోతుంటుంది. మనకి హిందీ వచ్చినా రాకపోయినా తెలుగుతోపాటు చాలా హిందీ పదాలు కలిపి మాట్లాడటం అలవాటై పోయింది. తెలుగు భాషనయినా పూర్తి స్వచ్ఛంగా ఎవరు మాట్లాడుతున్నారు. రైలును ధూమశకటం అంటే నవ్వి పోరూ! కాబట్టి ఇంగ్లీషుని, హిందీని కూడా మన భాషలాగే సొంతం చేసేసుకున్నాం. కాని ఏ భాష అయినా పూర్తిగా మాట్లాడితేనే అందం. భాషను, భాషలోని స్వచ్ఛతను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ప్రస్తుతం తెలుగు భాష గురించి కాదు. హిందీ గురించి మాట్లాడుకుంటున్నాం. స్వచ్ఛమైన హిందీ భాషను మన దేశ ప్రతిష్టగా ప్రపంచానికి చాటి చెప్తున్నాం. వాస్తవానికి మనదేశంలో ప్రజలందరికీ హిందీ రావాల్సిందే. ఎందుకంటే రాష్ట్ర భాష మరి. తమిళులు ఈ విషయంపై గొడవ చేశారు అది వేరే విషయం. హిందీ వస్తే ఎక్కడైనా బతికేయవచ్చు. ఉత్తరాది రాష్ట్రాలు వెళ్లినప్పుడు మనకి హిందీ రాకపోతే ఇంకేమన్నా ఉందా వెర్రివాళ్లకింద జమకట్టి, మదరాసీలని వెక్కిరించి...అబ్బో ఎన్ని కష్టాలో. అయినా ఇప్పుడు అమెరికానే మన పక్క ఊరిలో ఉన్నట్లుంది. ఇక మన పక్క రాష్ట్రాలు, అక్కడి భాషను మన భాషగా చేసుకోలేమా. మన తెలుగులో రకరకాల యాసలు, పదాలు ఉన్నట్లే ఉత్తరాదిన కూడా ప్రాంతం ప్రాంతంకి యాస, వాడుక పదాలు మారిపోతాయి. బీహారీ,పంజాబీ,హర్యాణవీ,ఇలా వివిధ రాష్ట్రాలలో వారి భాషలు మాట్లాడినా మూలం హిందీనే. కేవలం హిందీ రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్‌లోనూ ప్రతి జిల్లాకి ఒక భాష యాస ఉంటుంది. యహాం అనడానికి హియాం అంటారు. ఆ తేడానిబట్టి వారు ఏ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందినవారో ఇట్టే చెప్పేయచ్చు. అంతెందుకు. మన హైదరాబాదీ హిందీ పక్కా ఉర్దూ కలిపి ఉంటుంది. యాస, మాట విరుపు, ఉర్దూ పదాల గుబాళింపు హైదరాబాదీలను తేలిగ్గా పట్టిస్తాయి. అంతేనా.. హిందీ సినిమాలు చూడకపోతే అసలు ఇంక మనకి ఇప్పటి నాగరికత, ట్రెండ్ ఏమీ తెలియనట్లే. పూర్తిగా వెనకబడిపోతాం అంటే అతిశయోక్తి కాదేమో. మన బాలీవుడ్ హీరోలకు మనదేశంలోనే కాదు విదేశాల్లోనూ భారీ ఎత్తున అభిమానులుంటారు. ఎంతైనా భాష మనుషుల్ని, వారి మనసుల్ని ఒక దగ్గరికి చేరుస్తుంది.





వీళ్లు మనవాళ్లే సుమా అనిపిస్తుంది. మనమంతా ఒకటే అన్న ఐకమత్యం ఏర్పడుతుంది. అందుకే హిందీ రాష్ట్రీయ భాష. అహ...కాదు. ప్రపంచ భాష. అందుకే జనవరి 10వ తేదీని విశ్వ హిందీ దివస్ అంటారు. అంటే ప్రపంచం అంతా హిందీ భాష పండుగ. 1975 నాగపూర్‌లో మొదటిసారి హిందీ భాషను కాపాడుకునే ప్రయత్నంగా ఈ రోజును జరుపుకోవాలనే ఆలోచన జరిగింది. 2006 నుంచి ఈ హిందీ పండగ చేసుకుంటున్నాం. మనం కూడా ఎల్లుండి నుంచి హిందీకి ప్రాముఖ్యతనివ్వడం మొదలుపెడదాం.

* రంగవల్లిక *

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.







21 చుక్కలు
11వచ్చేవరకు
మధ్యచుక్క

ఐ. అనిత
తాండూర్



28 చుక్కలు పది వరుసలు
ఇరువైపులా ఐదు వదిలి పది వరకు
పది చుక్కలు ఐదువరుసలు

డి. శివకుమారి, పెద్దాపురం,
తూర్పుగోదావరిజిల్లా

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

చింతన

మానవ జన్మ అంతరార్థం

ఈ శరీరం ఒక నగరం. ప్రజ్ఞ దాని కోట. ఎముకలు స్తంభాలు, చర్మం గోడ, దీని లోపలే మాంస రక్త లేపనం ఉంది. ఈ నగరానికి నవ ద్వారాలు ఉన్నాయి. దీనిని రక్షించేందుకు చాలా ప్రయాసపడాలి. నరాలు, నాడులతో కప్పబడిన చేతన పురుషుడే ఈ నగరంలో రాజు రూపంగా వెలిశాడు.

కౌరవ పాండవుల మధ్య కురుక్షేత్రంలో భీకరమైన యుద్ధం సాగుతోంది. అర్జునుడు, భగదత్తుడు ఒకరినొకరు ఎదుర్కొంటున్నారు. వారిద్దరి మధ్య పోరు పతాక స్థాయిలో ఉండగా విధిహాత్తు గర్భంతో ఉన్న తార్జి అనే పక్షి తక్కువ ఎత్తులో ఎగురుతూ ఉండగా అర్జునుడు భగదత్తునిపై వదిలిన బాణ పరంపరలోని ఒక బాణం అతి వేగంగా వచ్చి తార్జి గర్భాన్ని చీల్చేసింది. దాని నుంచి చంద్రకాంతి వంటి తెలుపు వర్ణం గల నాలుగు అండాలు బయటపడ్డాయి. కాని వాటికి అయువు ఉన్నందున అవి పగిలిపోలేదు. పత్తిగుట్టపై పడ్డట్టు నెమ్మదిగా పడ్డాయి. అదే సమయంలో భగదత్తుడు అధిరోహించిన సుప్రతీకమనే ఏనుగు మెడలోని గంట బాణ ఘాతానికి గొలుసులు ఊడడంతో కిందపడి పక్షి అండాలను కప్పి వేసింది. దాని కింద అవి క్షేమంగా ఉన్నాయి. (వాస్తవానికి తార్జి అనే ఆ అండాల తల్లి అయిన పక్షి పూర్వ జన్మలో ఒక అప్సరస శాపవశాత్తు పక్షిగా జన్మించిన తార్జి, మందపాలుడనే మరో పక్షిని పెండ్లాడి ఆయుర్దాయం తీరడంతో కురుక్షేత్రంలో మరణించింది).

తర్వాత కొంత కాలానికి యుద్ధం ముగిసింది. శమీకుడనే మహర్షి తన శిష్యులతో కురుక్షేత్ర యుద్ధం జరిగిన ప్రాంతంలో సంచరిస్తుండగా ఆయనకు గంట కింద నుంచి పరమజ్ఞానానికి సంబంధించిన మాటలు పసికందుల కంఠంతో వినిపించాయి. విస్మితుడైన శమీకుడు గంటను తొలగించి దాని కింద రెక్కలు రాని పక్షి పిల్లలను చూశాడు. వాటిని శిష్యులకందించి ఆశ్రమానికి చేర్చి, పిల్లి, ఎలుక, ముంగిస వంటి వాటి నుంచి ప్రాణాపాయం లేని చోట భద్రంగా ఉంచండని చెబుతూ, 'ఎవరినీ రక్షించేందుకు పెద్ద ప్రయత్నమేమీ చేయనవసరంలేదు. ఎందుకంటే సమస్త జీవులూ తమ తమ కర్మల చేతనే చనిపోవడం, రక్షింపబడటం జరుగుతుంది. ఆ విధంగానే ఘోర రణరంగం మధ్య ఉండి కూడా ఈ పక్షి పిల్లలు బతికి బయటపడ్డాయి. అయితే మనిషనే వాడు కార్య సాధన కోనం ప్రయత్నించాలి. అపజయం ఎదురైనా సరే కర్తవ్య సాధనా ప్రయత్నంలోనే ఉత్తముడుగా గుర్తించబడతాడు' అని అన్నాడు. ఆ పక్షి పిల్లలకు ఆశ్రమంలోనే ఆహార పానీయాలు ఇచ్చే ఏర్పాటు చేశాడు. అవి నెల రోజులలోనే బలంగా పెరిగి సూర్యుని రథ మార్గం వరకు ఎగరగలిగాయి. కుతూహలంతో నగరాలు, సముద్రాలు, నదీ ప్రాంతాలన్నీ పరిశీలించి తిరిగి ఆశ్రమానికి వచ్చేవి. ఒకరోజు శమీకుడు శిష్యులకు ధర్మ తత్త్వాన్ని ఉపదేశిస్తుండగా విన్న పక్షుల్లో జ్ఞానం ప్రకటితమైంది. అప్పుడు అవి మనుష్య భాషలో శమీకుని ఉద్దేశించి ఇలా అన్నాయి. 'మహాత్మా! భయంకర మృత్యువు నుంచి మమ్మల్ని కాపాడారు. ఉండేందుకు చోటు, తినేందుకు తిండి, తాగేందుకు నీరు ఇచ్చారు. మీరే మాకు తండ్రి వంటివారు, గురువులు. మేము గర్భంలో ఉండగానే మా తల్లి మరణించింది. తండ్రి మమ్మల్ని కాపాడలేదు. మీరు మాకు ప్రాణదానం చేశారు. కీటకాల లాగా ఎండిపోవలసిన మమ్ము గంటనెత్తి రక్షించారు. మేమిపుడు పెద్దవారమైనాము. మీ దయ వలన మాకు పూర్వ జన్మ జ్ఞానం అబ్బింది. తమకేమి సేవ చేయగలమో దయచేసి ఆదేశించండి' అని ఆ మహర్షికి ప్రదక్షిణ చేస్తూ ఆయన పాదాలకు ప్రణమిల్లారు. పక్షుల స్పష్టమైన మాటలు విన్న శమీకుడు, కుమారుడు శృంగి, ఇతర శిష్యులు ఆశ్చర్యచకితులయ్యారు. అప్పుడు శమీకుడు 'నాయనలారా! మీ మాటలు ఎంతో స్పష్టంగా, విజ్ఞానవంతంగా ఉన్నాయి. ఇంతకీ మీరెవరు? ఈ పక్షి రూపాలేమిటి? అని ప్రశ్నించారు. దానికి పక్షులు ఈ విధంగా తమ కథను వినిపించాయి.

'మహానుభావా! పూర్వం విపులస్వానుడు అనే మునికి సుకృషుడు, తుంబురుడు అనే ఇద్దరు పుత్రులుండేవారు. వారిలో సుకృషుని నలుగురు సంతానం మేము నలుగురం. భక్తి, వినయ విధేయతలు కలిగి మా తండ్రి ఏమి కోరినా తెచ్చేవాళ్లం. మా తండ్రి సుకృషుడు ఇంద్రియ నిగ్రహం గల తపస్వి. సత్య, శౌచ, క్షమ, నిష్ఠా పరాయణుడు. ఒక రోజు వృద్ధాప్యంతో రెక్కలు దెబ్బతిని కన్నులు ఎర్రబారి శిథిల శరీరం గల ఒక పక్షి మా తండ్రి వద్దకు వచ్చి, తాను వింధ్యాగ్రంపై ఉండేదానన‌ని, ఒక పెద్ద పక్షి రెక్కల చేత వచ్చిన గాలి తాకిడికి నేల మీద పడి మూర్ఛపోయానని, ఏడు రోజులు స్పృహలో లేనని, తెలివి రాగానే ఆకలి ఎక్కువైందని ఇలా మీ వద్దకు వచ్చానని చెప్పింది. దానికి మా తండ్రి ఎలాంటి ఆహారం కావాలని అడిగారు. ఆ పక్షి తనకు మనిషి మాంసం తృప్తినిస్తుందని చెప్పింది. దానికి మా తండ్రి, మనుష్య మాంసం తింటావా? ఇంత వృద్ధాప్యంలో రుచులు కోరుతున్నావా? జీవునికి రుచులు ఆస్వాదించేందుకు అంతే లేదనిపిస్తోంది. అయినా మాటిచ్చాను కదా నేనెప్పుడూ మాట తప్పనని అన్నాడు. మమ్మల్ని పిలిచి, నేను మీకు తండ్రిని, గురువుని, పూజనీయుడిని నా మాట వింటారు కదా! అన్నాడు. దానికి మేము , మీరేమి చెబితే అలా చేస్తామని ముక్త కంఠంతో చెప్పాము. అప్పుడాయన పక్షిని చూపి, ఇది ఆకలితో నా శరణు వేడింది. మీ శరీరంతో దీని అకలిని, మీ రక్తంతో దాని దాహాన్ని తీర్చండి' అన్నాడు. దానితో మేము భయంతో వణికిపోతూ వ్యధతో 'తండ్రీ! ఈ పని మా వల్ల కాదు. తెలివిగల వాడెవడూ ఇంకొకరి శరీరం కోసం తన శరీరాన్ని నాశనం చేసుకోలేడు, మన్నించండి, ఈ పని మేము చేయలేం' అన్నాము. దానితో ఆయన ఆగ్రహం చెంది, తండ్రికి ఇచ్చిన మాటను తప్పుతారా! మీరు నా శాపంతో దగ్ధమై పక్షి యోని యందు జన్మిస్తారని శాపమిచ్చి తనను భక్షించమని ఆ పక్షిని కోరాడు. వెంటనే ఆ పక్షిరూపంలో ఉన్న ఇంద్రుడు విస్మితుడై, తన నిజ రూపం ధరించి మమ్ముద్దేశించి, మీ తండ్రి సత్య నిష్ఠను పరీక్షించేందుకు వచ్చి అపరాధం చేశాను. మీ తండ్రి అంతలా శపిస్తాడని అనుకోలేదు. మీరు నన్ను క్షమించాలి. అయినా నా వల్ల మీకు నష్టం కలిగింది కనుక మీలో ఇంద్ర సంబంధమైన జ్ఞానం (పరిపూర్ణ జ్ఞానం) నెలకొని ఉంటుందని వరమిచ్చాడు. అప్పుడు మేమందరం తండ్రి కాళ్లపై పడి శరణు వేడాం. మేము మృత్యువుకు భయపడ్డాం ఈ దీనుల్ని క్షమించండి అన్నాం. ఆ క్షణం నుంచి మేము పరిపూర్ణజ్ఞానులమైనాం. మేమేమిటో తెలుసుకున్నాం. చర్మం, మాంసం, ఎముకలు, చీము, నెత్తురులచే ఏర్పడిన ఈ శరీరంపై మమకారం ఉండరాదని మీరు సిద్ధపడిన త్యాగం తెలియజేస్తోంది. క్రోధాది దోషాలు జీవునికి ప్రబల శత్రువులని ఇప్పుడే తెలుసుకున్నాం' అన్నాం.



ఈ శరీరం ఒక నగరం. ప్రజ్ఞ దాని కోట. ఎముకలు స్తంభాలు, చర్మం గోడ, దీని లోపలే మాంస రక్త లేపనం ఉంది. ఈ నగరానికి నవ ద్వారాలు ఉన్నాయి. దీనిని రక్షించేందుకు చాలా ప్రయాసపడాలి. నరాలు, నాడులతో కప్పబడిన చేతన పురుషుడే ఈ నగరంలో రాజు రూపంగా వెలిశాడు. అతడికి ఇద్దరు మంత్రులు. బుద్ధి, మనసు, వారిరువురూ పరస్పరం విరోధులు. ఆ రాజుకు నలుగురు శత్రువులు. అతనిని పరాజితులని చేసేందుకై నిరంతరం ప్రయత్నిస్తారు. వారే కామ క్రోధ లోభ మోహాలు. వీరందరి మీదా రాజుకు అదుపు ఉంటేనే ఆయన శక్తి సురక్షితంగా, నిర్భయంగా ఉంటుంది. అప్పుడు అందరి పట్లా అనురాగం చూపగలడు. భయంకర శత్రువులైనా అతనిని పరాభవించలేరు.

నవ ద్వారాలు తెరచినపుడు శత్రువులు, ఇంద్రియాలను, మనసును, వశపరచుకుని అన్ని ద్వారాలను ఆక్రమించుకుని కోటకు నష్టం కలిగిస్తారు. మనస్సు రాగాధీనమైన వెంటనే బుద్ధి పారిపోతుంది. మంత్రి వెంట లేకపోతే మిగతా పుర జనం కూడా రాజును వదిలేస్తారు. శత్రువుల వల్ల అతని జ్ఞానంఛిద్రమై నాశనమవుతుంది. ఈ విధంగా రాగ మోహ లోభ క్రోధాదులనే దురాత్ములు మనుషుని స్మరణ శక్తిని నాశనం చేస్తాయి. కామము చేత లోభము, లోభము చేత సమ్మోహము (అవివేకం), సమ్మోహముచేస్మరణ శక్తి భ్రష్టమై పోతాయి.

స్మృతి భ్రష్టతచేబుద్ధి నాశనం అవుతుంది. బుద్ధి నాశనం వల్ల మనుషుడు తనకు తానే నాశనమై కర్మ భ్రష్టుడవుతాడు. అందుకే మమ్ము దయ చూడు తండ్రీ, బుద్ధిని కోల్పోయి రాగ లోభ పీడితులమైనాము' అని అన్నాం. అపుడు 'నీ శాపము శాంతించుగాక. పక్షి యోని యందు పుట్టడం కష్టం. మాకు ఆ జన్మ వద్దు అని విన్నవించాం. అప్పుడు మా తండ్రి సుకృషుడు, 'కుమారులారా నా నోటి నుంచి ఇంతవరకూ అసత్యవాక్కురాలేదు. నేనాడినమాట వ్యర్థం కాదు, మీరు పక్షి యోని యందు జన్మించినా పరమ జ్ఞానులుగానే ఉంటారు అని దీవించారు. ఆ విధంగా ఈ పక్షిరూపు దాల్చామని శమీకునికి ఆ పక్షులు చెప్పాయి.

అనంతరం 'ఓ మహాత్మా! సమస్త జీవ జంతువుల చేష్టలు దైవాధీనాలు, దైవం వల్ల బాధ పొందని జీవి ఈ సంసారంలో ఎక్కడా కానరాదు. యుద్ధ క్షేత్రంలో జన్మించి మృత్యువును ఎదిరించి మీ ప్రేమచే పెంచబడినవారము, మాకు ఇక సెలవిప్పించండి' అని ఆ పక్షులు శమీకుని వద్దసెలవు పుచ్చుకుని, వింధ్యగిరికి వెళ్ళి తపోస్వాధ్యాయ నిరతులై సమాధి స్థితి కోసం పర్వతాగ్రంపై నివాసమేర్పరచుకున్నాయి.

- డాక్టర్ గాది శ్రీనివాస్
9989079742

స్త్రీ సన్యాస నిరూపణం

(గత సంచిక తరువాయి భాగం)

'ఓహో సరిసరి' అన్నారు భగవాన్. 'మరైతే ఇప్పుడేం చేయాలి?'అన్నారు వాళ్లు. ''రమణగీత వ్రాసినప్పుడు నాయన ద్వారా విశాలక్ష్మమ్మగారడిగిన ప్రశ్నకు సమాధానంగా జ్ఞానభ్యాస నిరతితో పరివ్రాజికులైన స్త్రీలకు, సన్న్యాసమూ, సమాధి నిషేధం కాని చెప్పే వున్నాను గదా? ఇప్పుడు ప్రత్యేకించి చెప్పేదేమున్నది?''అన్నారు భగవాన్. ''వారికేమి సమాధానమివ్వాలి ఇప్పుడు?'' అన్నారు వారు. ''ఆ వాద ప్రతివాదాలన్నీ మనకెందుకయ్యా. ఆ పీఠంలో వున్నంతవరకూ ఆ పీఠం యొక్క నియమాలు వారు పాటించాలి గనుక వారు పత్రికలు పంపారు. పలక్కుండా మన పని మనం చేసుకుంటూ వుండటం మంచిది. రాదలుచుకున్న వారు రావచ్చును. లేనివారు మానవచ్చును. మరి దీనికి సమస్యలెందుకు?'' అన్నారు భగవాన్. వారంతటితో సమాధానపడి యథాప్రకారం మహన్యాసానికి వేదపారాయణకూ వస్తూనే వున్నారు. రమణగీతలో వున్న విశాలక్ష్మమ్మగారి ప్రశ్న, భగవాన్ సమాధానం దిగువ వ్రాస్తాను.


రమణగీత: 13వ అధ్యాయం

శ్లో॥ ఆత్మస్థితానాం నారీణా మస్తి చేత్ప్రతిబంధకం।
గృహత్యాగేన హంసీత్వం కిముస్యాత్ శాస్త్ర సమ్మతం॥

తా॥ ఆత్మయందు నిలకడజెందిన స్త్రీలకు ప్రతిబంధకమున్నయెడల ఇల్లు విడిచి పరమహంసినులుగ యుండుట శాస్త్రసమ్మతమగునా?

శ్లో॥ జీవన్ముక్తాయా దేహపాతే భవేద్యది।
దహనంవా సమాధిర్వాకార్యం యుక్తమనంతరం॥

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు



తా॥ జీవన్ముక్తురాలికి దేహపతనము సంభవించిన యనంతరము దహనమొనర్పవలయునా, సమాధి నాచరింపవలయునా? యుక్త మెద్ది?

శ్లో॥ ప్రశ్నద్వయమిదం శ్రుత్వా భగవాన్ ఋషిసత్తమః।
అవోచన్నిర్ణయం తత్ర సర్వశాస్త్రార్థతత్త్వవిత్॥

తా॥ఈ రెండు ప్రశ్నలు విని సర్వ శాస్త్రార్థముల నిజము తెలిసినవాడును భగవంతుడునగు ఋషి శ్రేష్ఠుడు అందలి నిర్ణయము దెలిపెను.

శ్లో॥ స్వరూపే వర్తమానానాం పక్వానాం యోషితామపి।
నివృత్తత్వా న్నిషేధస్య హంసీత్వం నైవదుష్యతి॥

తా॥స్త్రీలయినను పరిపాకము జెందినవారై ఆత్మరూపమున నిలకడ జెందినవారికి నిషేధము లేనందున హంసినులుగ నుండుట తప్పుకాదు.

శ్లో॥ముక్తత్వస్యా విశిష్టత్వాత్ బోధస్య చవధూరపి।
జీవన్ముక్తానదాహ్యా స్యాత్తద్దేహోహి సురాలయః॥

తా॥ముక్తియు జ్ఞానమును స్త్రీ పురుషులకు తుల్యమగుట చేత స్త్రీయైనను జీవన్ముక్తురాలిని దహింపదగదు. (ఏలన) దేహమును దేవాలయముగ నున్నది.


శ్లో॥ యేదోషా దేహదహనే పుంసోముక్తస్య సంస్మృతాః।
ముక్తాయాస్సంతితేసర్వే దేహదాహే చయోషితః॥

తా॥ముక్తుడగు పురుషుని యొక్క దేహదహనమున యెన్ని దోషములున్నవో ముక్తురాలగు స్త్రీ యొక్క దేహమును దహనమొనర్చినను అన్ని దోషములున్నవి.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



తిరస్కారం

సంక్షిప్త రామాయణం

రాజ్యానికి రావాలన్న భరతుని ఆహ్వానానికి రాముడు బదులిస్తూ, 'ఈ విషయంలో నీ దోషం అణుమాత్రం కూడ లేదు. ఆమెను (కైకను) నీవు నిందించడం తగదు. పెద్దలకు ఆస్తిపాస్తులపై, పిల్లలపై సర్వాధికారాలు ఉంటాయి. ఈ మాట దశరథుని పుత్రులమైన మనకూ వర్తిస్తుంది. మన తండ్రి మహారాజు కదా! తండ్రికి ఇచ్చిన స్థానాన్ని తల్లికి కూడా ఇవ్వడం కన్న కొడుకుల కర్తవ్యం. కాబట్టి కైకేయి, దశరథులకు మనపై సర్వాధికారాలు ఉన్నాయి. వారు ఎవరికైనా ఏ భాగాన్ని అయినా పంచి ఇవ్వవచ్చు. తల్లితండ్రులు పంచి ఇచ్చిన భాగాలను వినయంతో స్వీకరించడమే పుత్రుల కర్తవ్యం. వారి నిర్ణయం ప్రకారం నీవు అయోధ్యలో రాజ్యం పాలించాలి. నేను దండకారణ్యంలో నివసించాలి. ఇది పెద్దల నిర్ణయం మాత్రమే కాదు. విధి నిర్ణయం కూడా. విధి నిర్ణయం తప్పించడం దేవతలకు కూడా శక్యం కాదు. ఇక మానవ మాత్రులమైన మనం మార్చగలమా! నీ భాగాన్ని నీవు అనుభవించు. నా భాగాన్ని నేను అనుభవిస్తాను. తండ్రి ఆజ్ఞను శిరసావహించడమే నాకు పరమ ధర్మం. నేను దానిని అతిక్రమించను. తండ్రి మాటను అతిక్రమించడం వల్ల త్రిలోకాధిపత్యం లభించినా అది నాకు తృణప్రాయమే! స్వీకార యోగ్యం కాదు. అది నీకు కూడా శ్రేయస్కరం కాదు' అన్నాడు.

ఆ రోజు రాత్రి అందరూ అక్కడే నిద్రించారు. తెల్లవారిన తర్వాత స్నానాది నిత్య కృత్యాలు, సంధ్యావందనం, హోమాగ్ని కార్యాలు తీర్చిన తర్వాత అందరి సమక్షంలో పితృశోక తప్తుడై రాజ్యాన్ని స్వీకరింపుమని మరల భరతుడు రాముని కోరాడు. 'రాజ్యపాలనకు నేను సమర్థుడను కాదు. అందుకు నీవే అన్నివిధాల తగినవాడవు.

ఆకాశగమనం గరుత్మంతునికి సాధ్యమైనట్టు ఒక సాధారణ పక్షికి సాధ్యమవుతుందా? నీవు రాజ్యపాలన చేయాలన్నదే నా ప్రగాఢ వాంఛ' అని పలికిన భరతుని అందరూ అభినందించారు.

రాముడు జీవిత సత్యాలను తెలిపి, పితృశోకంతో కుమిలిపోతున్న భరతుని ఆర్తిని తొలగింపతలచి, 'భరతా! ఎవరికి వారు ఇచ్చవచ్చినట్లు నడుచుకోవడం సాధ్యం కాదు. సుఖ దుఃఖాలకు, వృద్ధి క్షయాలకు ప్రారబ్ధ కర్మము విధి రూపంలో కారణమవుతుంది. పక్వానికి వచ్చిన పండు రాలిపోక తప్పదన్నట్లు, పుట్టినవాడు గిట్టక తప్పదు. ఏదైనా శిథిలం కాక తప్పదు. అలాగే మనిషి జరాదుల కారణంగా కృశించి మరణించక తప్పదు. రాత్రింబవళ్లు అనేవి జీవుల ఆయువును హరిస్తూ ఉంటాయి. ఆత్మ శాశ్వతమైనది. శరీరం క్షణ భంగురమైనది. అనే సత్యాన్ని ఆకళింపు చేసుకో! మృత్యువు ఎల్లవేళల మనల్ని నీడవలె అనుసరిస్తూ ఉంటుంది. శరీరం ముడతలు పడడం, వెంట్రుకలు తెల్లబడడం, ముదిమి వల్ల కృశించడం జీవులకు ప్రకృతి సహజ ధర్మాలు. ఈ సత్యాన్ని గ్రహింపక, మనిషి పగటిపూట ధనార్జనకై వివిధ మార్గాలలో ప్రయత్నిస్తూ ఉంటాడు. జీవితం నీటి బుడగ వంటిది అని తెలుసుకొనలేక బంధాలకు తగులుకుని మోహ పరవశుడై సంసారమనే సముద్రంలో మునిగితేలుతూ ఉంటాడు. నీటి ప్రవాహంలో కర్రలు తేలి కలుస్తూ, విడిపోతూ ఉంటాయి. అలాగే భార్యా పుత్రమిత్ర సంయోగ వియోగాలు కూడా సహజమే! జనన మరణాలను ఎవ్వరూ తప్పించుకొనలేరు. మరణించిన వారికై శోకించేవారు కూడా మరణించక తప్పదు. ఈ రహస్యాన్ని తెలుసుకుని ఆత్మాన్వేషణ చేయాలి.

మన తండ్రి యజ్ఞ యాగాదులు చేశాడు. వైభవ ప్రాభవాలతో రాజ్యపాలన చేశాడు. సకల భోగాలను అనుభవించాడు. ప్రజలను కన్నబిడ్డలవలె రక్షించాడు. ధర్మమార్గంలో ధనాన్ని సంపాదించాడు. ఆయువు తీరిపోయింది. స్వర్గస్థుడయ్యాడు. బుద్ధిమంతుడైనవాడు ఎవ్వడూ మనవలె ఈ విధంగా దుఃఖింపడు. తండ్రి మాటను పాలించి రాజ్యాన్ని పాలించడమే నీ విధ్యుక్త కర్తవ్యం. తండ్రి ఆజ్ఞను శిరసావహించి పద్నాలుగేళ్లు వనవాసం చేయడమే నా కర్తవ్యం. పరలోక సుఖాలను కోరేవారు పెద్దల మాటను గౌరవించాలి. తండ్రి ఆజ్ఞను శిరసావహించడమే ఉత్తమోత్తమమైన ధర్మం' అన్నాడు రాముడు. భరతుడు పరిపరివిధాలుగా ప్రార్థించాడు. దృఢ సంకల్పుడూ, స్థిర చిత్తుడూ, సత్యసంధుడూ, పితృవాక్యపాలకుడు అయిన రాముడు, తండ్రి సత్యసంధతను కాపాడడమే మన కర్తవ్యం అని నొక్కి వక్కాణించాడు.

భరతుడు ప్రాధేయపడుతున్నప్పటికీ, ''పరలోకసుఖాలను కోరేవాడు తండ్రి ఆజ్ఞను శిరసావహించాలి'' అంటున్న రాముని చూసి జాబాలి ఈ విధంగా చెప్పాడు.

రామా! నీవు బుద్ధిశాలివి. పామరుల వలె ఆలోచిస్తున్నావేమి? లోకంలో ఎవ్వరూ ఎవ్వరికీ ఏమీ కారు. తండ్రి, తల్లి, పుత్రుడు అనే బంధాలు, మమకారాలు ఉన్మాద జనితాలే! ఏప్రాణి అయినా ఒంటరిగానే పుడతాడు. ఒంటరిగానే మరణిస్తాడు. బాటసారి ఒక రాత్రి సత్రంలో బసచేసి, తెల్లవారిన తరువాత ఆ సత్రాన్ని విడిచి వెళ్లిపోతాడు. అంతేకాని ఆ సత్రంపై మమకారం పెంచుకొంటాడా? బంధానికి కట్టుబడతాడా? గృహభార్యాపుత్రాది బంధాలన్నీ కూడ అలాంటివే! కాబట్టి బుద్ధిమంతులు ఆసక్తి లేకుండా జీవిస్తారు. రాజ్యం నిన్ను వరించాను రా రమ్మంటూ ఉంటే, కష్టాలమయమైన వనవాస జీవితాన్ని ఇష్టపడడం నీవంటి వానికి తగదు. పరదేశానికి వెళ్లిన భర్త రాకకై, ఆశతో ఎదురుచూస్తున్న భార్యవలె అయోధ్య నీకోసం ఎదురుచూస్తున్నది అన్నాడు.


- కె. ఓబులేశు
9052847742

తిరుప్పావై

పాశురం 24

అన్ఱివ్వులగ మళన్దాయ్! అడిపోత్తి;
చ్చెన్ఱఙ్గు త్తెన్నిలఙ్గై శెత్తాయ్! తిఱల్ పోత్తి;
పొన్ఱచ్చగడ ముదైత్తాయ్; పుగళ్ పోత్తి;
కన్ఱు కుణిలా వుఱిన్దాయ్! కళల్ పోత్తి;
కన్ఱుకుడై యావెడుత్తాయ్! గుణమ్ పోత్తి;
వెన్ఱు పగై కెడుక్కుమ్ నిన్కైయిల్ వేల్ పోత్తి;
ఎన్ఱెన్ఱున్ శేవగమే యేత్తిప్పఱై కొళ్వాన్
ఇన్ఱియామ్ వన్దోమ్ ఇరఙ్గేలో రెమ్బావాయ్

తాత్పర్యం



దేవతల రాజ్యములను అపహరించిన బలి యొక్క అహంకార మడంచుటకై వామనుడవై బలిని యాచించి వెంటనే త్రివిక్రముడవై కఠినమైన ఈ లోకములను కొలచినవాడా! ఆనాడు కందిపోయిన సుకుమారమైన నీ దివ్య పాదారవిందములకీనాడు మంగళమగుగాక!

నిను నమ్మిన సీత లంకకు గొనిపోబడగ ఆమె కోసం లంకకు వెళ్లి సుందరమైన ఆ లంకా నగరమును నేలపాలు చేసిన వాడా! ఆనాటి నీ బాహుబలమునకు ఈనాడు మంగళమగుగాక!

నీడకొరకుంచిన బండిపై అసురుడావేశించగ, ఈ శకటాసురుని కీళ్లూడునట్లు కాలును జాపి తాకించిన నీ కళ్యాణ గుణకీర్తికి మంగళమగుగాక!

మాకు ఆధారమైనట్టి నిన్ను సంహరింపదలచి వచ్చిన యిరువురిలో ఒకడైన వత్సాసురుని, గోటి బిళ్ళ వలె, రెండవవాడైన కపిత్థాసురుని పైకి విసరి యిరువుర నొకే మారు నేల కూల్చిన సమయాన ముందుకు జాపిన నీపాదమునకు మంగళమగుగాక!



తన దయశీలతచే ఎదిర్చిన శత్రువులను సమూలముగా నశింపజేయు నీ చేతిలోని బల్లెమునకు మంగళమగుగాక ! ఇలా ఇలా నీయొక్క వీరచరితమునే కీర్తిస్తూ నీనుండు పఱై అను దానిని పొందు నిమిత్తమై ఓ స్వామీ ప్రస్తుతము మేము వచ్చితిమయ్యా! దయచూపవయ్యా! .

- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

దిన ఫలాలు

మేష రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయవృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/ సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడ గట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్య పరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతి బంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.


మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభ వ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: ఋణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యరీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com







ప్రోస్టేట్ పెరగనీయొద్దే!

పురుషుల పునరుత్పాదక వ్యవస్థలో భాగంగా అక్రోట్ పరిమాణంలో ఉండే గ్రంథినే ప్రోస్టేట్ (వస్తిగ్రంథి) అంటారు. ప్రోస్టేటిక్ ఫ్లూయిడ్ (వీర్యంలో ఉండే ద్రవం)ను ఉత్పత్తి చేయడం దీని విధి.

మధ్యవయసు దాటిన పురుషుల్లో ఈ ప్రోస్టేట్ గ్రంథి పెద్దదవుతుంది. దీన్నే ప్రాణాపాయ రహిత వస్తిగ్రంథి పెరుగుదల (బిపిహెచ్- బినైన్ ప్రోస్టేటిక్ హైపర్‌ప్లాసియా) అంటారు. తరచుగా ఇది 50 సంవత్సరాల వయసులో ప్రారంభమవుతుంది. ఈ పరిస్థితి మాత్రం క్యాన్సర్ కాదు. ఇది మూత్రాశయానికి చుట్టుకుని ఉండటం వల్ల బిపిహెచ్ మూత్ర విసర్జనకు ఆటంకం కలిగిస్తుంది. బిపిహెచ్ ప్రోస్టేట్ గ్రంథి క్యాన్సర్ లక్షణ రహితంగా వృద్ధి చెందుతుంది. ఈ వృద్ధి మూత్రనాళాన్ని(శరీరం నుండి మూత్రాన్ని బయటకు పంపించేది) ముడుచుకుపోయేలా చేయడం వల్ల మూత్రాశయం ఖాళీ కావడాన్ని జటిలం చేస్తుంది.

ప్రోస్టేట్ గ్రంథి కణాల నుంచి వృద్ధి చెందుతుంది. మూత్రాశయం దిగువన ప్రోస్టేట్ గ్రంథి ఉంటుంది. పురుషులకు మాత్రమే ఉండే గ్రంథి ఇది. ఇది ఉత్తత్తి చేసే ఒక విధమైన ద్రవం వీర్య కణాలను రక్షిస్తుంది. పురుషాంగం నుంచి మూత్రాన్ని, వీర్యాన్ని బయటకు తీసుకెళ్లే మూత్ర మార్గం వెలుపలి భాగాన్ని చుడుతూ ఉంటుంది. ఈ గ్రంథి నుండే నరాలు అంగస్తంభనలో పాలుపంచుకుంటాయి.

మలిదశలో..

ఓ వ్యక్తి ప్రోస్టేట్ క్యాన్సర్‌కు గురైతే క్యాన్సర్ కణాలు గ్రంథి అవతలి భాగాలకు కూడా విస్తరిస్తాయి. ఈ రకం క్యాన్సర్‌లు చాలావరకు నెమ్మదిగా ఎదుగుతాయి. ఎలాంటి వ్యాప్తిని లేదా లక్షణాలను ప్రదర్శించవు. పెద్దవయసులో ఇతర వ్యాధుల కారణంగా మరణించిన వారిలో ఎంతోమందికి ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లు తదనంతరం నిర్వహించిన శవపరీక్షల్లో వెల్లడైంది. కొన్ని రకాల ప్రోస్టేట్ క్యాన్సర్‌లు మాత్రం వేగంగా వృద్ధి చెందడంతో పాటు వేగంగా విస్తరిస్తాయి కూడా. 50 ఏళ్లపై బడిన పురుషులకు ఎక్కువగా ఈ ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.

ప్రోస్టేట్ వ్యాధి లక్షణాలు

ప్రోస్టేట్‌లో పెరుగుదల మొదలైన అందరిలోను సమస్య ఉండాలని ఏమీ లేదు. కొందరిలో చాలాకాలం వరకు ఎటువంటి సమస్య ఉండకపోవచ్చు కూడా. ప్రోస్టేట్ గ్రంథి పెరుగుతున్న తీరును బట్టి ఉంటుంది. కొందరిలో ప్రోస్టేట్ గ్రంథి మూత్రనాళం వైపు కాకుండా బయటివైపు పెరుగుతుంది. అలాంటి వారికి సమస్య అసలు ఉండకపోవచ్చు. ఒక్కొక్కరిలో ఒక్కోరకమైన లక్షణాలు కనిపించవచ్చు.

- ☞ మూత్రంలో మంటగా అనిపించడం
- ☞ మూత్రం విసర్జనకు ఎక్కు సమయం పట్టడం
- ☞ మూత్రంలో రక్తం పడడం
- ☞ వెంటనే మూత్ర విసర్జన చేయడం అనిపించడం అంటే మూత్రం ఆపలేకపోవడం
- ☞ మూత్రం విసర్జించడానికి ఉపక్రమించిన తర్వాత విసర్జన ఆలస్యం అవడం
- ☞ మూత్రం చుక్కలుగా రావడం
- ☞ తరచుగా మూత్ర విసర్జన చేయడం
- ☞ రాత్రి పూట తరచుగా మూత్ర విసర్జన చేయాల్సి రావడం వల్ల నిద్రాభంగం కలగడం
- ☞ ప్రోస్టేట్ బ్లాడర్‌లో పెరిగినప్పుడు మాత్రం పూర్తిగా విసర్జితం కాకపోవడం వల్ల బ్లాడర్‌లో మిగిలిపోతుంది. మూత్రం అలా నిల్వ ఉండడం వల్ల ఇన్ఫెక్షన్ వచ్చేందుకు అవకాశాలు ఎక్కువ అవుతాయి. అది అలాగే కొనసాగితే కిడ్నీ ఫెయిల్యూర్‌కి దారి తీసే ప్రమాదం ఉంటుంది.

కనిపించని లక్షణాలు

క్యాన్సర్ ఉన్నవారికి తొలిదశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. చాలావరకు ప్రోస్టేట్ క్యాన్సర్‌లు రొటీన్‌గా నిర్వహించే మలాశయ పరీక్షల సందర్భంగానే వెల్లడవుతుంటాయి. వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత మూత్ర విసర్జనలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఆ సమయంలో బాగా బాధగా ఉండవచ్చు. వెన్ను లేదా వృక్కద్రోణి (మూత్రనాళం మొదలు) లేదా కటివలయం (పొత్తికడుపు ప్రాంతంలో) నొప్పిగా ఉండవచ్చు. ప్రోస్టేట్ క్యాన్సర్ ఉందని గుర్తించిన వారిలో 83శాతం మంది కనీసం ఐదేళ్లు, 63శాతం మంది కనీసం పదేళ్లు జీవించారు. చాలాసార్లు అంటే పగలు, రాత్రి మూత్ర విసర్జనకు వెళ్లడం, మూత్ర వస్తే ఆపుకోలేకపోవడం, మూత్ర ధార సన్నగా కారడం, ఆగిఆగి మూత్రం రావడం, మూత్రంలో రక్తం రావడం కొన్ని లక్షణాలు.

వంశపారపర్యంగా..

ప్రోస్టేట్ క్యాన్సర్ రావడానికి కారణాలేంటో ఇప్పటికీ పూర్తిగా తెలియనప్పటికీ ఈ వ్యాధి వచ్చేందుకు అవకాశం ఉన్న అంశాలతో ముడిపడి ఉన్న ప్రమాదకారకాలను కొన్నింటిని మాత్రం పరిశోధకులు గుర్తించారు. ప్రోస్టేట్ క్యాన్సర్ కొన్ని కుటుంబాల్లో వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉంది. కుటుంబంలో ఓ వ్యక్తి తండ్రి లేదా సోదరునికి ప్రోస్టేట్ క్యాన్సర్ ఉంటే ఆ వ్యక్తికి కూడా ఆ వ్యాధి వచ్చేందుకు సాధారణ వ్యక్తులతో పోలిస్తే రెట్టింపు అవకాశాలుంటాయి. బంధుగణంలో మరింత మందికి ఈ వ్యాధి ఉంటే, యుక్తవయస్సులోనే ఈ వ్యాధి ఉన్నట్లు వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో తేలితే ఆ వ్యక్తికి కూడా ఈ వ్యాధి వచ్చేందుకు మరిన్ని అవకాశాలుంటాయి.

కొవ్వు ఓ కారణం..

కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకునే పురుషులు ఈ వ్యాధికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. శరీరంలో కొవ్వు ఎక్కువ ఉండటం కన్నా కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు, పాల ఉత్పత్తులు అధికంగా తినడం, జీవనశైలి ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలను అధికం చేస్తుంది. లైకోపెనెస్ అధిక స్థాయిలో కానవచ్చే కొన్ని పండ్లు, కూరగాయలు (వండిన లేదా వండని టమాటాలు లేదా పుచ్చకాయలు) ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశాన్ని తగ్గించగలవని తెలుస్తోంది. విటమిన్- ఇ తరహా పదార్థాలు యాంటి ఆక్సిడంట్స్, డిఎన్ఎకు కలిగే నష్టాన్ని ఇవి నివారిస్తాయి. అంతేకాకుండా ప్రోస్టేట్ క్యాన్సర్ ముప్పును తగ్గిస్తాయి. కాల్షియం అధికంగా ఉండే ఫ్రుక్టోస్ (ఫ్రూట్ షుగర్) తక్కువగా ఉండే ఆహారపదార్థాలు ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలను అధికం చేస్తాయి. వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నవారికి ఈ వ్యాధి వచ్చే అవకాశాలు అధికంగా ఉండవచ్చు. ఇలాంటి వారిలో ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు రెండింతలయ్యే అవకాశాలున్నాయని కొన్ని అధ్యయనాలు వెల్లడించగా అలాంటి తేడాలేమి ఉండవని మరికొన్ని అధ్యయనాల్లో తేలింది. 35 ఏళ్లలోపు వేసెక్టమీ చేయించుకున్నవారిలో ఈ వ్యాధికి గురయ్యే ముప్పు అవకాశాలు అధికంగా ఉంటాయి. విటమిన్ ఎ సప్లిమెంట్స్ తీసుకోవడం ప్రోస్టేట్ క్యాన్సర్ ముప్పు అవకాశాలను పెంచుతుంది. కొంతమంది పరిశోధకులు సూచిస్తున్నారు. విటమిన్ సప్లిమెంట్స్‌ను డాక్టర్ సలహాతో వాడడమే ఉత్తమం



కారణాలు నిర్దిష్టంగా తెలియవు

ప్రోస్టేట్ క్యాన్సర్ రావడానికి అసలు కారణాలు ఏంటో నేటికి నిర్దిష్టంగా తెలియవు. ముప్పును పెంచే కొన్ని కారకాలను మాత్రం పరిశోధకులు గుర్తించారు. ప్రోస్టేట్ గ్రంథిలోని కణాలు క్యాన్సర్ బారిన పడేందుకు ఈ కారకాలు ఎలా కారణమవుతున్నాయో తెలుసుకోవడంలో కొంత పురోగతిని కూడా పరిశోధకులు సాధించారు. డిఎన్ఏలో చోటు చేసుకునే కొన్ని నిర్దిష్ట మార్పులు, ప్రోస్టేట్ గ్రంథిలోని కణాలు అసాధరణ రీతిలో పెరిగేందుకు ఎలా దోహదపడుతున్నాయో, క్యాన్సర్‌ను ఎలా కలిగిస్తున్నాయో అనే విషయాన్ని తెలుసుకోవడంలో శాస్త్రవేత్తలు ఎంతో ప్రగతిసాధించారు. మన కణాలు చేసే పనులన్నింటికీ అవసరమైన ఆదేశాలను కలిగి ఉండే లేదా తీసుకెళ్లే రసాయనమే డిఎన్ఏ. డిఎన్ఏ లోని కొన్ని జన్యువులు, కణాల పెరుగుదల, విభజనలను నియంత్రణకు సంబంధించిన ఆదేశాలను కలిగి ఉంటాయి. కణ విభజనకు దోహదం చేసే నిర్దిష్ట జన్యువులను ఆంకోజీన్స్ అని అంటారు. కణ విభజన మందగింపజేసే లేదా నిర్దేశిత సమయంలో కణాలు నశించిపోయేలా చేసే జన్యువులను ట్యూమర్ సప్రెసర్ జన్యువులని అంటారు. డిఎన్ఏ మ్యూటేషన్ (ఉత్పరివర్తనం లేదా జన్యుపరమైన లోపాలు వల్ల అంకోజీన్స్ పనిచేయడం లేదా ట్యూమర్ సప్రెసర్ జన్యువులు పనిచేయకపోవడం జరుగవచ్చు. ఈ విధమైన డిఎన్ఏ జన్యులోపాలను కొంతమంది వారసత్వంగా పొందడం గమనార్హం. ఇలా వారసత్వంగా వచ్చిన కొన్ని జన్యువుల్లోని డిఎన్ఏ మార్పులు, ప్రోస్టేట్ క్యాన్సర్ వృద్ధి చెందే అవకాశాలను అధికం చేస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ప్రోస్టేట్ క్యాన్సర్‌లలో దాదాపు 10శాతం మేరకు ఇలా జన్యుపరమైన మార్పుల వల్ల చోటు చేసుకునేవేనని భావిస్తున్నారు. ప్రోస్టేట్ క్యాన్సర్‌కు సంబంధించిన డిఎన్ఏ ఉత్పరివర్తనాలు (జన్యులోపాల్లాంటివి) వారసత్వంగా రావడానికి మించి, మనిషి జీవితకాలంలోనే ఎక్కువగా వృద్ధి చెందుతాయి.

హార్మోన్ల పాత్ర

ప్రోస్టేట్ క్యాన్సర్ వృద్ధికి నిర్దిష్ట హార్మోన్ల స్థాయిలకూ సంబంధం ఉందనేందుకు ఆధారాలున్నాయి. అండ్రోజెన్ (మేల్ హార్మోన్) అధిక స్థాయిలో ఉండడం కొంతమందిలో ప్రోస్టేట్ క్యాన్సర్‌ను కలిగించవచ్చు. ఇన్సులిన్ లైక్ గ్రోత్ ఫ్యాక్టర్-1 (ఐజిఎఫ్ 1) అనే మరో హార్మోన్ అధిక స్థాయిలో ఉండడం కూడా ప్రోస్టేట్ క్యాన్సర్ ముప్పు అవకాశాన్ని అధికం చేస్తుందని పరిశోధకులు గమనించారు. జింక్, సెలీనియం, మాంగనీస్, మెగ్నీషియం, విటమిన్ -ఇ తక్కువవ్వడం ప్రోస్టేట్ క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం.

రోగనిర్ధారణ పరీక్షలు

మూత్ర విసర్జన చేయడాన్ని పరీక్షించడం లాంటి పరీక్షలు చేయాలి. దీన్ని ఒక ఎలక్ట్రానిక్ మీటర్‌ను ఉపయోగించి చేస్తారు. మూత్ర విసర్జన వేగం తగ్గితే, అది బిపిహెచ్ అని నిర్ధారించుకోవచ్చు. మూత్రాశయాన్ని ఎంత బాగా ఖాళీ చేస్తున్నారో చూడటాన్ని 'పోస్ట్‌వాయిడ్ రెసిడ్యూయల్' అనే పరీక్ష చేస్తారు.

నలభై నుంచి యాభై ఏళ్ల పైబడిన వాళ్లు ప్రతి సంవత్సరం సెరమ్ ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ పరీక్ష చేయించుకోవాలి. ఇంట్లో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే మూత్ర సంబంధిత ఇబ్బందులుంటే కూడా చేయించుకోవాలి.

అల్ట్రాసౌండ్ స్కానింగ్

ఈ పరీక్ష ద్వారా ప్రోస్టేట్ గ్రంథి పరిమాణం, బ్లాడర్ మీద దాని ప్రభావం,కిడ్నీ మీద దాని ప్రభావం ఎంతవరకు ఉందో తెలుసుకోవచ్చు.

యూరోఫ్లోమెట్రి: మూత్రం ఎంత పరిమాణంలో విసర్జితమవుతుందో ఎంత వేగంగా వస్తోంది. ఆగుతూ వస్తోందా వంటి లక్షణాలను నిర్ధారించవచ్చు. బ్లాడర్ గోడల మందాన్ని కూడా అంచనా వేస్తారు.

తొలిదశలోనే

వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగడానికి ముందే 31శాతం మంది ప్రోస్టేట్ గ్రంథి సమీపంలోని కణజాలాల్లో క్యాన్సర్ వ్యాప్తి చెందుతుంది. ప్రోస్టేట్ నరాలకు సమీపంలోని నరాలకు చికిత్స చేయడం లేదా వాటిని తొలగించడం వంటివి చేయాలి. నిర్లక్ష్యం చేస్తే నపుంసకత్వం వంటి అంగ స్థంభన సమస్యలకు దారితీయవచ్చు. తొలిదశలోనే ప్రోస్టేట్ గ్రంథి క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స చేయడమనేది కొంతమంది ఆయుర్దాయాన్ని పెంచినప్పటికీ, మరెంతోమంది ఆయుర్దాయంపై అదెలాంటి ప్రభావాన్ని కలిగించలేకపోయింది. లోకలైజ్డ్ క్యాన్సర్ అంటే ప్రోస్టేట్ క్యాన్సర్ బయటికి కాకుండా లోపలే ఉంటే రాడికల్ ప్రొసెక్టమీ అనే శస్త్రచికిత్స ద్వారా ప్రోస్టేట్‌ను తొలగిస్తారు. ఈ తరహా శస్త్రచికిత్సలు 90 నుంచి 95 శాతం శస్త్రచికిత్సలు విజయవంతమవుతున్నాయి. ఒక్కోసారి ఈ క్యాన్సర్ శరీరంలోని ఇతరభాగాలు ఎముకలు, లింఫ్ నోడ్లు, ఊపిరితిత్తులకు వ్యాపిస్తుంది. ప్రస్తుతం (ఐఎంఆర్‌టి రేడియేషన్ థెరపీ అందుబాటులో ఉంది. ప్రోస్టేట్‌లో చిన్న సూదినుంచి దీని ద్వారా రేడియేషన్ కిరణాలను పంపిస్తే ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలు కాలిపోతాయి. ప్రోస్టేట్ క్యాన్సర్‌ను మూడు రకాలుగా విభజించారు. దీన్ని గ్లెసన్ గ్రేడ్ అంటారు. మధ్యస్థం, స్వల్పం, తీవ్రమైన క్యాన్సర్లుగా విభజించారు. మధ్యస్థంగా ఉంటే చికిత్స సులభమవుతుంది. తీవ్రంగా ఉంటే సర్జరీయే కాకుండా హార్మోన్ థెరపీ, ఇంజక్షన్లతో చికిత్స అవసరం.

బిపిహెచ్ లక్షణాలు

- ☞ మూత్రం అనిశ్చితంగా ఆగి ఆగి సన్నగా రావడం
- ☞ మూత్రం తొందరగా రావడం, కారటం లేదా బొట్టు బొట్టుగా పడటం
- ☞ అత్యంత తరచుగా మూత్ర విసర్జన, ప్రత్యేకించి రాత్రి సమయాల్లో ఎక్కువగా రావడం
- ☞ మూత్ర విసర్జన సమయంలో మంటగా / నొప్పిగా ఉండటం
- ☞ అత్యవసరంగా రావడం, మూత్ర విసర్జనను ఆపుకోలేకపోయే అనుభూతి
- ☞ మూత్ర విసర్జన ప్రారంభించడానికి, కష్టపడటం లేదా ఒత్తిడికి అవసరం కావటం

చికిత్స

శస్త్రచికిత్స చేయకుండా ప్రోస్టేట్ పరిమాణాన్ని తగ్గించడంలో మందులు ఉపకరిస్తాయి. ఇవి ఈ విధంగా పనిచేస్తాయి.

- ☞ మూత్రాశయంపై ఒత్తిడి తగ్గించడం ద్వారా
- ☞ ప్రోస్టేట్ వృద్ధిని ప్రోత్సహించే హ ర్మోన్లను అడ్డుకోవడం ద్వారా
- ☞ మూత్ర విసర్జన తీవ్రతను ఉపశమించడం చేయడం ద్వారా
- ☞ ప్రోస్టేట్ గ్రంథి చికిత్సలో 80శాతం మందికి మందులతో చికిత్స సరిపోతుంది. 20శాతం మందికి మాత్రం సర్జరీ తప్పనిసరి.
- ☞ మూత్రంలో రక్తం పడుతున్నప్పుడు ప్రోస్టేట్ గ్రంథి పూర్తిగా తీసివేయాల్సి ఉంటుంది.
- ☞ ఇదివరకు ప్రోస్టేట్ గ్రంథిలో పెరిగిన పరిమాణాన్ని అనుసరించి గ్రంథిలా కొంత భాగాన్ని చిన్న చిన్న ముకలుగా కత్తిరించి తీసేసేవారు. కానీ కొంతకాలానికి సమస్య తిరిగి ప్రారంభం కావచ్చు. ఇప్పుడు పెరిగిన శాస్త్ర పరిజ్ఞానం వల్ల లేజర్ ద్వారా పూర్తిగా గ్రంథిని ఒకేసారి తీసివేయడం సాధ్యపడుతుంది. దీనినే ట్రాన్స్ యూరేథ్రల్ రీసక్షన్ ఆఫ్ ప్రోస్టేట్ (టియుఆర్‌పీ) అంటాం. టియుఆర్‌పి చికిత్స ద్వారా సమస్యను శాశ్వతంగా తొలగించవచ్చు.

శస్త్ర చికిత్స విధానాలు

మీ లక్షణాలను ఇతర పద్దతులు ఉపశమనం కలిగించలేనప్పుడు అనేక శస్త్ర చికిత్స పద్దతులతో ఏదో ఒకదానిని అవలంబించవచ్చు.

సైటోస్కోపు: ఇది లైటుతో కూడిన టెలిస్కోపును చొప్పించడం. దీనిద్వారా ప్రోస్టేట్‌ను చూడొచ్చు. ఇందులో శస్త్ర చికిత్స ఉపకరణాలను పంపించడం ద్వారా ప్రోస్టేట్ కణజాలాన్ని తొలగిస్తారు.

ట్రాన్స్ యురిథ్రల్ రిసెక్షన్ ఆఫ్ ప్రోస్టేట్(టియుఆర్‌పి): మూత్రాశయం, బ్లాడర్‌ను అడ్డుకునే టిష్యూను తొలగిస్తారు

ఓపెన్ ప్రోస్టేటెక్టొబి ఇన్సిషన్: అధిక టిష్యూను తొలగించడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.

థర్మల్ థెరపీ: అధిక కణజాలాన్ని కుంచించుకుపోయేలా చేయడానికి వేడిని ఉపయోగిస్తారు.

ప్రోస్టేట్‌కు లేజర్ ఆధునిక చికిత్సలు

ప్రోస్టేట్ గ్రంథి పరిమాణంలో పెరుగుతుంది అనగానే చాలామంది అది క్యాన్సరేనని భయపడతారు. కానీ 98శాతం మందిలో ఈ పెరుగుదల వయస్సు రీత్యా వచ్చేది. కానీ క్యాన్సర్ కాదు. ప్రోస్టేట్‌లో వాపు రావడం లేదా

పరిమాణం పెరగడమనేది పురుషులలో చాలా సాధారణంగా కనిపించే సమస్య. 40 సంవత్సరాల వయస్సు దాటిన దాదాపు అందరు పురుషుల్లో కనిపిస్తుంది. ప్రోస్టేట్ గ్రంథి పెరగడం వల్ల మూత్ర విసర్జనలో సమస్యలు తలెత్తుతాయి. వయస్సు పెరుగుతున్న కొద్దీ సమస్య తీవ్రమవుతుంది.

అపోహలు

ప్రోస్టేట్ గ్రంథి విషయంలో చాలా అపోహలుంటాయి. ప్రోస్టేట్‌కు సర్జరీ చేయడం వల్ల లైంగిక సామర్థ్యం తగ్గిపోతుంది అనుకుంటారు. కానీ ఈ చికిత్సలో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. సర్జరీ జరిగిన మొదలు మూడునాలుగు వారాల్లో తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లాల్సిరావడం లేదా ఆపలేకపోవడం వంటి చిన్న చిన్న దుష్ప్రభావాలు ఉండొచ్చు. అవి సమయం గడుస్తున్న కొద్దీ తగ్గిపోతాయి.



డాక్టర్ పి. వంశీ
కన్సల్టెంట్ యూరాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్

కునుకు పడితే మనసు కుదుట

కునుకు పడితే మనసు కాస్త కుదుటపడుతుంది అని మనసు కవి ఆత్రేయ సెలవిచ్చారు. అవును ఇది నిజం. పగటిపూట చాలామంది కునుకు తీస్తారు. ఈ కునుకు చిన్నపిల్లల్లోనే కాదు పెద్దల్లో కూడా మంచిదేనని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. కునుకు తీయడం వల్ల బద్దకస్తులని అనుకోవడం పొరపాటు. చిన్న కునుకుపాటు నిస్తేజమైన మీ మెదడుని ఉత్సాహపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. పనిసామర్థ్యం మరింత పెరుగుతుంది. చురుకుగా మారతారు. ఒత్తిడినుంచి విముక్తులవుతారు. కునుకు ప్రయోజనాలు చాలానే ఉన్నాయి.

జ్ఞాపకశక్తిని పెంపొందించడం

మీ మెదడులో జ్ఞాపకాల దొంతరలను నిక్షిప్తం చేసుకోవడానికి పగటిపూట కునుకు తీయడం చాలా మేలు. రాత్రిపూట సరిగ్గా నిద్రపోనివారికి కూడా కునుకు వల్ల ప్రయోజనాలు సిద్దిస్తాయి. పగటిపూట భోజనం చేసిన తర్వాత నిద్రకు ఉపక్రమించడం వల్ల మీ అలసట మటుమాయమౌతుంది.

కాఫీకన్నా బెటర్

మీరు బాగా అలసిపోయినప్పుడు చాలా మంది టీలు, కాఫీలు తీసుకుంటారు. ఇది చాలా తప్పు. వీటని తీసుకోవడం వల్ల తాత్కాలికంగా ఉపశమనం లభించినా దీర్ఘకాలంలో మరిన్ని సమస్యలు ఎదురౌతాయి.

మూడ్ మారిపోతుంది

మీరు చాలా నిరాశగా ఉన్నారనుకోండి. ఇలాంటి సమయంలో ఓ చిన్న కునుకుపాటు చక్కటి ఔషధంగా పనిచేస్తుంది. స్ఫూర్తిని పొందగలుగుతారు.

ప్రయాణాల్లో ఉన్నప్పుడు..

చాలామంది ప్రయాణాల్లో ఉన్నప్పుడు నిద్రగూర్చి అస్సలు పట్టించుకోరు. ఇది మంచి పద్దతికాదు. ఇటువంటివాళ్లు కొద్దిసేపు కునుకు తీయడం వల్ల వాళ్లలో ఉన్న నిరసం, నిస్సత్తువ తొలగిపోతుంది. తాజాగా ఉండటానికి దోహదపడుతుంది.

ఒత్తిడి

ఒత్తిడిలో ఉన్నప్పుడు చాలామంది ఇబ్బందిపడుతుంటారు.



ఇలాంటి వాళ్లు కనీసం 30 నిమిషాలపాటు కునుకు తీయాలి. దీని వల్ల వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుంది.

గుండె

కునుకువల్ల గుండెకు ఎంతో మేలు జరుగుతుందని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. మీ రక్తపోటు అదుపులో ఉంటుంది.

క్రియేటివిటీ

ఏ రంగంలోనైనా రాణించాలంటే క్రియేటివిటీ చాలా ముఖ్యం. ఈ క్రియేటివిటీ పెరగాలంటే కూడా పగటిపూట కునుకు మంచిదేనట.

అలవాటుగా పెట్టుకోండి

ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పుడు కునుకు తీయడం కూడా అలవాటుగా పెట్టుకోండి. ఈ అలవాటు పెద్దలకే కాదు పిల్లల్లో కూడా ప్రయోజనాలు ఉన్నాయట. మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల మధ్య ఈ కునుకుపడితే చాలాబెటర్ అని అంటున్నారు.

థియేటర్ల విషయంలో అనుచితంగా మాట్లాడొద్దు

-నిర్మాత దిల్ రాజు


మెహరీన్, వెంకటేష్, వరుణ్ తేజ్, అనిల్ రావిపూడి


తమన్నా

వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ నాయకానాయికలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించిన ఎఫ్ 2 చిత్రం సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. వినోదంతో ప్రేక్షకులను ఎంతో అలరింపజేసేలా ఈ చిత్రం ఉంటుందని వెంకటేష్, వరుణ్‌తేజ్ వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన పాటలకు విశేషమైన స్పందన లభించిందని చిత్రబృందం తెలిపింది.

ఈ సంక్రాంతికి తెలుగులో మూడు భారీ చిత్రాలతో పాటు ఓ అనువాద చిత్రం కూడా విడుదలవుతుండటంతో థియేటర్ల సమస్య తలెత్తింది. దీనిపై నిర్మాతల మధ్య మాటలు తూటాలుగా పేలుతున్నాయి. రజనీకాంత్ నటించిన పేట చిత్రానికి థియేటర్లు దొరకడం లేదంటూ ఆ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్న నిర్మాత అశోక్ వల్లభనేని చేసిన వ్యాఖ్యలపై నిర్మాత దిల్‌రాజు స్పందించారు. సోమవారం సాయంత్రం ఎఫ్ 2 ట్రైలర్ విడుదల కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ, సంక్రాంతికి తెలుగులో మూడు పెద్ద సినిమాలు విడుదలవుతున్నాయి. వాటి విడుదల కూడా ఆరు నెలల క్రితమే ప్రకటించడం జరిగింది. అయితే నిన్న ఓ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ఆ చిత్రం వాళ్లు తొందరపడి మాట్లాడారో ఏంటో తెలియదు కానీ థియేటర్లు దొరకడం లేదంటూ అనుచితంగా మాట్లాడారు. తెలుగులో మూడు పెద్ద సినిమాలు క్రేజీగా విడుదలవుతుంటే వాటికే థియేటర్లు చాలినన్ని దొరకక మేమే ఇబ్బందులు పడుతుంటే పక్క రాష్ట్రం సినిమాకు ఇలాంటి పండగ సీజన్‌లో థియేటర్లు ఎలా దొరుకుతాయి. పైపెచ్చు వారి సినిమాకు 15 రోజుల క్రితమో, నెల క్రితమో హక్కులు తీసుకుని విడుదల తేదీని ప్రకటిస్తే సహజంగానే ఇలాంటి సమయంలో థియేటర్లు దొరకడం కష్టమౌతుంది. ఆ విషయాన్ని తెలుసుకోకుండా పిచ్చి పిచ్చిగా ఆరోపణలు గుప్పించడం సరికాదు. ఆ నిర్మాతే నాలుగు నెలల కాలంలో మూడు డబ్బింగ్ సినిమాలను విడుదల చేశారు. నవాబ్, సర్కార్ సినిమాలకు కావాల్సినన్ని థియేటర్లను తీసుకున్నారు. దీనిని వారు గుర్తు చేసుకుంటే అనుచిత వ్యాఖ్యలు చేయరు. గతేడాది పంపిణీదారుడిగా నేను చాలా డబ్బులు పోగొట్టుకున్నాను.



అయినా సినిమా అంటే నాకు ఫ్యాషన్. అందరం డబ్బులు సంపాదించడం కోసమే వ్యాపారం చేస్తాం. 18వ తేదీ నుంచి థియేటర్లలో తమ చిత్రం మాత్రమే ఉంటుందని ఆ నిర్మాత చెబుతున్నారు. అలాంటప్పుడు ఆ తేదీనే వారి చిత్రాన్ని విడుదల చేసుకోవచ్చు కదా! అని దిల్‌రాజు అన్నారు.

నా శక్తి దేశభక్తి


వివేక్ ఒబెరాయ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీవిత చరిత్ర ఇప్పుడు వెండితెరకెక్కించబోతున్నారు. నరేంద్ర మోదీ పాత్రలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటించనున్నారు. ఒమంగ్ కుమార్ దర్శకత్వంలో లెజెండ్ గ్లోబల్ స్టూడియో సమర్పణలో సురేష్ ఒబెరాయ్, సందీప్ ఎస్.సింగ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ ఇదే నెలలో ప్రారంభం కానుంది. కాగా ఈ చిత్రంలోని మోదీ పాత్రధారి వివేక్ ఒబెరాయ్ ఫస్ట్‌లుక్‌ను 23 భాషల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చేతుల మీదుగా సోమవారం విడుదలచేశారు. మువ్వన్నెల జాతీయ జెండా వెనుక వైపు ఎగురుతుండగా...జనం మధ్యలో మోదీ పాత్రలో వివేక్ ఒబెరాయ్ హుందాగా నిలుచుని కనిపిస్తున్నారు. నా శక్తి దేశభక్తి అనే స్లోగన్‌ను ఈ లుక్‌కు అన్వయించారు.

పేట ప్రీ రిలీజ్ వేడుక



రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'పేట'. సిమ్రాన్, త్రిష నాయికలు. జనవరి 10న ప్రేక్షకుల ముందుకువస్తున్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. చిత్ర బృందంతో పాటుగా హీరో శ్రీకాంత్, దర్శకుడు వైవిఎస్. చౌదరి పాల్గొన్నారు.

''నవాబ్, సర్కార్ వంటి సినిమాలను విడుదల చేసిన వల్లభనేని అశోక్ తాజా చిత్రం పేట మంచి విజయం సాధించాలి'' అని హీరో శ్రీకాంత్ అన్నారు. ''మాలాంటి ఆర్టిస్టులు అందరికీ రజనీగారు ప్రేరణ'' అని పేర్కొన్నారు.

గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ రజనీ సినిమాకు పాటలు రాసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఆయన పాటల్లో మంచి సందేశం ఉంటుంది అని అన్నారు.

నిర్మాత వల్లభనేని అశోక్ మాట్లాడుతూ ''రజనీకాంత్ స్ఫూర్తితో ఆయన సినిమా చేసే స్థాయికి చేరుకున్నాను. థియేటర్ల విషయంలో చాలా మంది నన్ను ఇబ్బంది పెడుతున్నారు. వారికి సినిమా హిట్‌తో బుద్ధి చెప్పాలని అనుకుంటున్నాను'' అని అన్నారు.

పేట మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ మాట్లాడుతూ ''ఈ సినిమా రజనీ ఫ్యాన్స్ కోసమే. మంచి అవకాశం ఇచ్చిన దర్శకుడు కార్తిక్ గారికి థాంక్స్'' అని అన్నారు.

చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ ''నా తొలి సినిమా పిజ్జా కోసం హైదరాబాద్ వచ్చాను. మళ్లీ ఈ సినిమా కోసం వచ్చాను. ఇది కుటుంబ నేపథ్యం ఉన్న యాక్షన్ చిత్రం. అందరూ ఎంజాయ్ చేసే అంశాలు ఉన్నాయి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైవియస్. చౌదరి, హీరోయిన్ మేఘా ఆకాష్, నటుడు బాబీ సింహా కూడా మాట్లాడారు.

కథలా సాగే జీవితంలో...!

హిందీ చిత్ర పరిశ్రమలో స్టార్‌గా దూసుకొచ్చారు రణ్వీర్ సింగ్. స్వతహాగా ఎదిగిన కథానాయకుడిగా రణ్వీర్‌కు మంచి గుర్తింపు ఉంది. అసాధారణ ప్రతిభగల ఈ నటుడు దాదాపు తన ప్రతి సినిమాతో ఆకట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే అతనికి భారీ విజయాలు దక్కుతున్నాయి. గతేడాది రణ్వీర్‌కు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా బాగా గుర్తుండిపోతుంది. పద్మావత్, సింబా లాంటి సూపర్ హిట్ చిత్రాలతో పాటు ప్రేయసి దీపికాను వివాహం చేసుకున్నాడు. ఇంత ఘనత సాధించినా తానెప్పుడూ వాస్తవంలోనే జీవిస్తుంటానని చెబుతున్నారు రణ్వీర్ సింగ్. విజయం సాధిస్తే తన వల్లే అనుకోనని, అలాగే అపజయం వచ్చినా అందరిదీ అనుకుంటానని అన్నారు. నటుడు కావడమే తన కలని, ప్రస్తుతం ఆ కలలో జీవిస్తున్నందుకు ఎప్పుడూ కృతజ్ఞతగా ఉంటానని చెప్పారు. తాజాగా రణ్వీర్ మాట్లాడుతూ...నా జీవితం ఒక కథలా అనిపిస్తుంటుంది. ఇదంతా నిజమా అని ఆశ్చర్యమేసిన సందర్భాలున్నాయి. నా కలలో జీవిస్తున్నందుకు రోజూ కృతజ్ఞతగా ఉంటాను. ఒక సినిమా విజయం నావల్లే అనుకోను, అలాగే జనాలకు నచ్చకున్నా అలాగే తీసుకుంటాను. ఈ మధ్యే మార్గాన్ని తీసుకోవడం వల్ల ఎలాంటి సందర్భంలోనైనా స్తిమితంగా ఉండగలను. నటుడిగా పరిశ్రమకు వచ్చాక రెండున్నర ఏళ్లు బాగా కష్టపడ్డాను. ఆ పరిస్థితులు బాగా గుర్తుండిపోయాయి. నేను కష్టపడిన సందర్భాలే నన్ను నేల మీద నిలబడేలా చేస్తుంటాయి. అన్నారు. ప్రస్తుతం గల్లీ బాయ్స్ అనే చిత్రంలో నటిస్తున్నారు రణ్వీర్.


రణ్వీర్ సింగ్

వై.యస్. బయోపిక్ యాత్రలో విజయమ్మలుక్


ఆశ్రిత వేముగంటి

వై.యస్.రాజశేఖర్‌రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం యాత్ర. మహి వి.రాఘవ్ దర్శకత్వంలో 70 ఎం.ఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. జగపతిబాబు, పోసాని, సుహాసిని, అనసూయ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. వై.యస్. రాజశేఖర్‌రెడ్డి సతీమణి విజయమ్మ పాత్రలో నటిస్తున్న ఆశ్రిత వేముగంటి లుక్‌ను విడుదలచేశారు. ఆమె లుక్ ఆ పాత్రకు కరెక్ట్‌గా సెట్ అయ్యిందని అంటున్నారు.

కొత్త జంటతో ప్రేమకథ


వంశి స్టెఫీ పాటెల్

వంశి, స్టెఫీ పాటెల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'నిన్ను తలచి'. అనిల్ తోట దర్శకుత్వంలో నేదురుమల్లి, అజిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ విడుదల చేశారు.

నిర్మాత అజిత్ మాట్లాడుతూ ''నూతన జంటతో నిర్మిస్తున్నాం. మా అందరికీ మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది'' అని అన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ ''ఎంతో కష్టపడి చేసిన సినిమా. సినిమా బాగా వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తాం'' అని చెప్పారు.

హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న వంశీ, స్టెఫీ తమకు అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

యువ ప్రతిభ స్ఫూర్తినిస్తోంది..!


ఏఆర్ రెహమాన్

తను సంపాదించుకున్న సంగీత జ్ఞానంలో కొంత తిరిగి కొత్త తరానికి ఇవ్వాలని ఉందన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్. ఇటీవలే 52వ పుట్టిన రోజు జరుపుకున్నారు రెహమాన్. పాటలు పాడటంలో, సంగీతంలో యువత ప్రతిభ చూస్తుంటే సంతోషంగా ఉందన్నారాయన. ఆస్కార్, గ్రామీ పురస్కార గ్రహీతగా ప్రపంచ ఖ్యాతిని అందుకున్నారు రెహమాన్. 1992లో రోజా చిత్రంతో మొదలైన రెహమాన్ స్వర ప్రస్థానం మూడు దశాబ్దాలుగా దిగ్విజయంగా కొనసాగుతోంది. ఎదగడం, మారడం అనేవి తన జీవితంలో కీలక విషయాలని అంటారు ఈ సంగీత ఖని. చిరకాలం గుర్తుండే వందలాది పాటలు స్వరపర్చిన రెహమాన్... ఆసియాలోనే రెండు ఆస్కార్‌లు అందుకున్న తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఈ స్వరకర్త మాట్లాడుతూ...ఇన్నేళ్ల ప్రయాణం ఎంతో కీర్తిని, ఆదాయాన్ని ఇచ్చింది. సంగీతంలో నేను తెలుసుకున్న వాటిలో కొన్ని ఇప్పటి తరానికి తిరిగి ఇవ్వాలనుకుంటున్నాను. సంగీత కార్యక్రమాల్లో యువతరం ప్రతిభ చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. కొత్తగా ఏదైనా పాట రాసేందుకు, స్వరపర్చేందుకు వాళ్లు నాకు స్ఫూర్తినిస్తున్నారు. పుట్టిన రోజున కుటుంబ సభ్యులతోనే గడుపుతుంటాను. అని అన్నారు. ప్రస్తుతం కొంత ఎంపికగా సినిమాలు చేస్తున్న రెహమాన్.. ఫకీర్ ఆఫ్ వెనిస్ అనే చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.